FLASH INDIA NEWS
ప్రశ్నిస్తాం... ప్రజలకోసం...

www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO. APTEL/2010/33229

| సంపుటి : 16 | సంచిక : 86 | శనివారం 03-05-2025 | ఎడిటర్ : కొమరరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల : రూ 2/- |
|---|---|---|---|---|---|

విలేకరులు కావలెను

రాష్ట్రవ్యాప్తంగా వెలువడుతున్న 'ఫ్లాష్ఇండియా' తెలుగు దినపత్రిక మరియు మాసపత్రికల లకు రాష్ట్రంలో అన్ని ప్రాంతాల నుండి విలేకరులు కావలెను

ఫోన్ : 7730032999

## గవర్నర్‌ను కలిసిన కాంగ్రెస్ బీసీ నేతలు

03

- బీసీలకు రాజకీయ, విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు
- తెలంగాణ ఉభయ సభల్లో చేసిన బిల్లుకు గవర్నర్ ఆమోదం
- రాష్ట్రపతికి పంపినందుకు కాంగ్రెస్ బీసీ నేతలు శుక్రవారం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిసి ధన్యవాదాలు తెలిపారు




కాంగ్రెస్ బీసీ నేతలు శుక్రవారం ఉదయం రాజ్ భవన్ లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, కేకే, మధుయాష్కీ నేతృత్వంలో గవర్నర్ ను కలిశారు. బీసీలకు రాజకీయ, విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ ఉభయ సభల్లో చేసిన బిల్లుకు గవర్నర్ ఆమోదం పొంది రాష్ట్రపతికి పంపినందుకు కాంగ్రెస్ నేతలు ధన్యవాదాలు తెలిపారు. ఇంకా గవర్నర్ ను కలిసిన వారిలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, మేయర్ విజయలక్ష్మి తదితరులు

## సురేష్ ప్రొడక్షన్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు

02

- సుప్రీం కోర్టులో సురేష్ ప్రొడక్షన్‌కు బిగ్ షాక్ తగిలింది
- ఏపీ ప్రభుత్వ షోకాజ్ నోటీసును సవాల్ చేస్తూ సురేష్ ప్రొడక్షన్ వేసిన పిటిషన్‌పై సుప్రీం కీలక వ్యాఖ్యలు చేసింది
- పిటిషన్‌లో జోక్యం చేసుకోలేమని.. మధ్యంతర ఉపశమనం కుదరదని తేల్చిచెప్పేసింది ధర్మాసనం






సురేష్ ప్రొడక్షన్ కు సుప్రీంకోర్టులో ఊరట లభించలేదు. విశాఖ రామానాయుడు స్టూడియో భూముల వ్యవహారంపై ఈరోజు (శుక్రవారం) సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఫిల్మ్ సిటీ కోసం కేటాయించిన భూములను ఇతర అవసరాలకు వాడుకోవచ్చని గతంలో జగన్ ప్రభుత్వం అనుమతించిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వ నిర్ణయాన్ని ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలని ప్రస్తుత ఏపీ ప్రభుత్వం షోకాజ్ నోటీసు ఇచ్చింది.

## ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలు కన్నుమూత..

- 116 ఏళ్ల అద్భుత జీవితం ముగిసింది
- సన్యాసిని కనబారో లుకాస్.. కాలాన్ని మించిన ప్రయాణం
- ఆధ్యాత్మికత, ఫుట్‌బాల్ పట్ల ప్రేమతో నిండిన అరుదైన జీవితం

02



## దోస్త్ నోటిఫికేషన్ విడుదల..

- తెలంగాణలో డిగ్రీ ప్రవేశాలకు దోస్త్ 2025 నోటిఫికేషన్ విడుదల
- మూడు విడతల్లో అడ్మిషన్లు మొదటి దశకు ఈ నెల 3 నుంచి దరఖాస్తులు
- బకెట్ సిస్టమ్, రిజర్వేషన్లతో ఈసారి ప్రవేశ ప్రక్రియ

06




# అమరావతి పునర్నిర్మాణం

**రాజధాని పనులు సహా రూ.58 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం**

**సాగు నీరుకు ఇబ్బంది లేకుండా నదుల అనుసంధానం చేస్తున్నాం..**

- వెలగపూడి నుంచి సభాస్థలికి ప్రధాని మోడీ రోడ్ షో
- ప్రధాని మోడీకి శాలువా కప్పి ప్రత్యేక జ్ఞాపికను అందజేసిన సీఎం
- సభా వేదికపైనుంచే పలు ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు అమరావతి పునర్నిర్మాణ పనులకు ప్రధాని మోడీ
- ప్రధానికి ఘన స్వాగతం పలికిన పవన్ కళ్యాణ్
- ప్రధానికి మరో పేరు చెప్పిన పవన్ అమరావతి పునర్నిర్మాణ పనులకు మోడీ శంకుస్థాపన
- తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించిన ప్రధాని మోడీ

**పోలవరం ప్రాజెక్ట్ త్వరగా పూర్తి అయ్యేందుకు సహకరిస్తాం: ప్రధాని మోడీ**




**ఆంధ్రప్రదేశ్ :**

రాజధాని అమరావతి పునఃనిర్మాణ పనుల కోసం ప్రధాని నరేంద్ర మోడీ వెలగపూడికి చేరుకున్నారు. గన్నవరం ఎయిర్ పోర్ట్ నుంచి హెలికాప్టర్ లో వెలగపూడి చేరుకున్న ప్రధానికి ఏపీ గవర్నర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఘన స్వాగతం పలికారు. రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగిన ప్రధాని.. అమరావతి సభా వేదికపైకి చేరుకున్నారు. వేదికపై ప్రధానిని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ సన్మానించారు. ధర్మవరం శాలువాను కప్పి.. ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు.సభా వేదికపై కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, నారాయణ, నాదెండ్ల మనోహర్ ఉన్నారు. సభా వేదిక పైనుంచే పలు ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు చేయనున్నారు. హైకోర్టు, సెక్రటేరియట్, అసెంబ్లీ భవనాలకు, న్యాయమూర్తుల నివాస సముదాయాలకు శంకుస్థాపన చేయనున్నారు. రూ. 57,962 కోట్ల

03

## హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించనున్న సీఎం

మే 8వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా పోలీస్ స్టేషన్ ను అధికారికంగా ప్రారంభించనున్నారు

**ప్రభుత్వ భూములపై జరిగే అక్రమ ఆక్రమణలపై స్థానికులు లేదా అధికారులు ఫిర్యాదు చేస్తే, హైడ్రా పోలీస్ స్టేషన్లలోనే కేసులు నమోదు**

- హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల కబ్జాలపై ఇకపై హైడ్రా PS లో కేసులు
- ఇప్పటికే సాధారణ పోలీస్ స్టేషన్లలో నమోదు అయిన పలు భూకబ్జా కేసులు

02



## తెలంగాణ మదర్సాల్లో బంగ్లాదేశీయులు!

- తన పార్లమెంట్ పరిధిలోని ఇస్నాపూర్ లోనే 247 మంది నేపాలీలకు ఆధార్ కార్డులు
- తెలంగాణలో విచ్చలవిడిగా కొత్త మదర్సాలు పుట్టుకువస్తున్నాయని, వాటిలో ఎన్నింటికి అనుమతులు ఉన్నాయో వివరాలు చెప్పాలి

03



## త్వరలో బీసీలకు కేంద్ర మంత్రి పదవి

- త్వరలో బీసీలకు కేంద్ర మంత్రి పదవి వస్తుందన్న కృష్ణయ్య
- తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కులగణనపై చిత్తశుద్ధితో వ్యవహరించలేదన్నారు

05

**ప్రధాని మోడీ చిత్రపటానికి ఆర్. కృష్ణయ్య పాలాభిషేకం**



విజయవాడలో ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య పాలాభిషేకం చేశారు. బీసీల పట్ల మోడీకి ఉన్న ప్రేమ, చిత్తశుద్ధి వల్లే కులగణన సాధ్యమైందన్నారు. కులాల లెక్కలు తీయడం ద్వారా బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్లు లభించనున్నాయని పేర్కొన్నారు. ఇది బీసీల విజయం మాత్రమే కాదు.. దేశంలో ఓ కొత్త శకానికి నాంది అని వ్యాఖ్యానించారు. జనగణనలో కుల గణన చేయడానికి స్వాతంత్ర్యం ఉన్నప్పటికీ గతంలో ఏ ప్రభుత్వమూ ముందుకు

## ఉగ్ర వేటలో భారత్‌కు సహకరించండి

- ఉగ్ర వేటలో భారత్‌కు సహకరించండి
- పాక్‌కు జేడీవాన్స్ సూచన

05



## పాలమూరు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం

- పాలమూరు రంగారెడ్డి పనులపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- రాజకీయ కక్షతో ప్రాజెక్టులను అడ్డుకుంటున్న కాంగ్రెస్ నేతలు
- రైతులకు నష్టం, రాష్ట్రానికి అన్యాయం : నిరంజన్ రెడ్డి

03




## ఎయిరిండియాకు రూ.5 వేల కోట్ల నష్టం!

- పాకిస్థాన్-భారత్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు
- ఎయిరిండియాకు రూ.5 వేల కోట్ల నష్టం!

02




## ఇప్పుడు గుర్తుకు వచ్చిందా

- కవిత వ్యాఖ్యలపై బీర్ల అయిలయ్య మండిపాటు
- రైతు బంధు, RTC సమ్మె, సామాజిక న్యాయం పై ఎదురుదాడి
- కుల గణనతో తెలంగాణ రాజకీయ వేడి

02



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :**

గత 10 ఏళ్లలో తండ్రి కేసీఆర్ హయాంలో ఏం జరిగిందో ఇప్పుడు ఆమె గుర్తించుకుంటున్నట్లు తెలుస్తోందని ఐలయ్య ఎద్దేవా చేశారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన తప్పులు, అప్పులు గురించి కవిత ఒక్కమాట కూడా మాట్లాడలేదని, రైతుబంధు పథకంపై నిజమైన రైతులకు లాభం లేదన్న ఆరోపణలపై అప్పట్లో స్పందించలేదని గుర్తు చేశారు బీర్ల ఐలయ్య. భూమిలేని వ్యవసాయ కూలీలకు మద్దతివ్వాలన్న కాంగ్రెస్ డిమాండ్ ను పట్టించుకోకపోయారని ఆరోపించారు.మా ప్రభుత్వం ఇప్పుడు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమిలేని కూలీలకు సాయం చేస్తోందని, అప్పుడు పదేళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకున్నవాళ్లను

## ఆ ఇంటి పిలుపు వినిపిస్తూనే ఉందా?

- పదిహేనేళ్ల తర్వాత ఇండియాలో చిన్నప్పటి ఇంటికి తిరుగు ప్రయాణం
- వైరల్ వీడియోలో బాల్య స్మృతుల్లోకి వెళ్తూ ఏడ్చిన విదేశీయుడు

02



## ఓటీటీ షోలో అసభ్య కంటెంట్

**ఎంపీ ప్రియాంక చతుర్వేది ఆగ్రహం**

05

- 'హౌస్ అరెస్ట్' షో క్లిప్ వివాదం ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో కంటెంట్
- నియంత్రణపై మరోసారి చర్చను రేకెత్తించింది
- ఈ అంశంపై ప్రియాంక చతుర్వేది, నిషికాంత్ దుబే వంటి నేతలు కూడా స్పందించారు



### HYDERABAD & VIJAYAWADA



| | |
|---|---|
| 22 క్యారెట్ | రూ.87,750 |
| 24 క్యారెట్ | రూ.95,730 |
| కేజీ వెండి | రూ.1,07,000 |

### CHICKEN RATE



| | |
|---|---|
| Dressed With Skin | 170 Kg |
| Skinless | 210 Kg |
| Boneless | 220 Kg |

# ఏ 1 నిందితుడు మొయినుద్దీన్ అరెస్ట్

- గొర్రెల స్కామ్‌లో కేసు నమోదు అయినప్పటి నుండి మొయినుద్దీన్ ఆయన కొడుకు ఈక్రముద్దీన్ ఇద్దరూ పరరీలోనే ఉన్నారు
- ఈ నేపథ్యంలో మొయినుద్దీన్ హైదరాబాద్ చేరుకోగానే ఇమ్మిగ్రేషన్ సహకారంతో శంషాబాద్ ఎయిర్ పోర్టులోనే అదుపులోకి తీసుకున్నారు
- గొర్రెల స్కీమును స్కామ్‌గా మర్చి రూ. 1200 కోట్ల అవినీతికి పాల్పడ్డారు

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా మారిన గొర్రెల పంపిణీ స్కాం కేసు లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో మొదటి నుంచి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఏ1 నిందితుడు మొయినుద్దీన్‌ను శుక్రవారం ఉదయం ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు. శంషాబాద్ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్నారు. గతంలో మొయినుద్దీన్‌పై పోలీసులు ఎల్‌వోసీ జారీ చేశారు. మొయినుద్దీన్ కొడుకు ఈక్రముద్దీన్ ఇద్దరి పాస్ పోర్టును అధికారులు ఇన్వొండ్ చేశారు. ఈ క్రమంలోనే మొయినుద్దీన్‌ను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.గొర్రెల స్కామ్‌లో కేసు నమోదు అయినప్పటి నుండి మొయినుద్దీన్ ఆయన కొడుకు ఈక్రముద్దీన్ ఇద్దరూ పరరీలోనే ఉన్నారు. ఈ నేపథ్యంలో మొయినుద్దీన్ హైదరాబాద్ చేరుకోగానే ఇమ్మిగ్రేషన్ సహకారంతో శంషాబాద్ ఎయిర్ పోర్టులోనే అదుపులోకి తీసుకున్నారు. గొర్రెల స్కీమును స్కాముగా మర్చి రూ. 1200 కోట్ల అవినీతికి పాల్పడ్డారు. ఇప్పటి వరకు గొర్రెల స్కాములో 17 మందిని అరెస్ట్ చేశారు. మాజీ మంత్రి తలసాని ఓఎస్డీ కళ్యాణ్, గొర్రెల మేకల పెంపకం సమైక్య మాజీ ఎండీ రామచందర్ నాయక్, పలువురు వెటర్నరీ అధికారులు అరెస్ట్ అయ్యారు. లోలోన ది లైవ్ కంపెని పేరుతో దళారి వ్యాపారానికి మొయినుద్దీన్ అతని కుమారుడు ఈక్రముద్దీన్ తెరలేపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ గొర్రెల పంపిణీ పథకంలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని తేలడంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసు విచారణను ఏసీబీ అధికారులకు అప్పగించింది. ఈ కేసులో ఇప్పటి వరకు 17 మందిని అరెస్ట్ చేయగా.. ఇవాళ A1 నిందితుడు అయిన మొయినుద్దీన్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. అతన్ని వెంటనే విమానాశ్రయం నుంచి బంజారాహిల్స్‌లోని ఏసీబీ కార్యాలయానికి తరలించారు. గొర్రెల పంపిణీ స్కామ్‌లో మొయినుద్దీన్‌దే కీలక పాత్ర అని అధికారుల విచారణలో వెల్లడైన విషయం తెలిసిందే.

# ఉగ్రవాదుల చేతిలో 'ఎన్‌క్రిప్టెడ్' పరికరాలు

- ఉగ్రవాదుల చేతిలో 'ఎన్‌క్రిప్టెడ్' పరికరాలు
- ప్రస్తుతం భారత్‌లోనే పహల్గామ్ ఉగ్రవాదులు
- ఎన్ఐఏ అంచనా ఇదే!

**ఢిల్లీ :** పహల్గామ్ లో నేరమేధం సృష్టించిన ఉగ్రవాదులు ప్రస్తుతం భారత్ లోనే ఉన్నట్లుగా దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ ఒక నిర్ధారణకు వచ్చింది. దక్షిణ కాశ్మీర్ లోని దట్టమైన అడవుల్లో సేఫ్ జోన్ లో ఉన్నట్లుగా భావిస్తోంది. స్థానికుల సహకారంతో వీరంతా భద్రంగా ఉన్నట్లుగా అంచనా వేస్తోంది.అయితే వీరి దగ్గర అత్యంత భద్రత కలిగిన "ఎన్ క్రిప్టెడ్" కమ్యూనికేషన్ పరికరాలు ఉన్నట్లుగా భావిస్తోంది. ఇదొక సీక్రెట్ పరికరం. ఈ పరికరాలు సమాచారాన్ని అత్యంత గోప్యంగా ఉంచుతాయి. సమాచారం గానీ.. డేటా గానీ రహస్య కోడ్ గా మారిపోతుంది. ఇదొక గూఢ లిపి పరికరం. ఈ పరికరాలు ఉన్న వారికి మాత్రం కోడ్ భాష అర్థమవుతోంది. అంతేకాకుండా సమాచారం కూడా వారికి మాత్రమే అందుతుంది. ఇలాంటి అత్యాధునికమైన పరికరాలు ఉపయోగించడం వల్ల ఉగ్రవాదుల జాడ తెలియడం లేదు. ఈ పరికరాలు అత్యంత భద్రతతో పాటు సమాచారం కూడా చాలా సురక్షితంగా ఉంచుతుంది.ఈ పరికరాలు సైనిక ప్రయోజనాల కోసమే ఉపయోగిస్తారు. పురాతన కాలంలో రహస్య సంభాషణను చేరవేయడానికి సైన్యాలు ఉపయోగించేవి. గ్రీస్, రోమ్ ఈ పరికరాలను విరివిగా ఉపయోగించింది. అత్యంత ప్రసిద్ధమైన పరికారాల్లో ఎన్ క్రిప్టెడ్ ఒక పరికరం. 800 AD ప్రాంతంలో అరబ్ గణిత శాస్త్రజ్ఞుడు అల్ కండి ఈ పరికరాన్ని రూపొందించాడు. ఈ పరికరం అత్యంత సేఫ్ జోన్ అస్త్రంగా చెబుతుంటారు. అందుకే ప్రస్తుతం ఈ పరికరాన్ని వాణిజ్యం, భద్రత, ఇంటర్నెట్ కమ్యూనికేషన్ బదిలీల కోసం ఉపయోగిస్తుంటారు. సైబర్ దాడులను నిరోధించడానికి ఈ పరికరం ఎంతగానో ఉపయోగపడుతుంది. దాదాపుగా ప్రపంచంలో 71 శాతం కంపెనీలన్నీ ఈ వ్యవస్థనే ఉపయోగిస్తుంటాయి. దీన్ని సాధారణ ప్రజలు అర్థం చేసుకోలేరు. చూడలేరు. ఈ పరికరంతోనే ఉగ్రవాదులు సురక్షితంగా ఉన్నట్లుగా ఎన్ఐఏ కనిపెట్టింది.ఏప్రిల్ 22న పహల్గామ్ లో జరిగిన ఉగ్ర దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయారు. కొత్తగా పెళ్లైన జంటలు.. భర్తలను కోల్పోయారు. మతం పేరుతో ఈ దాడులు చేశారు. కేవలం హిందువులు టార్గెట్ గా ముష్కరులు చెలరేగిపోయారు. ఇక ఈ దాడి తర్వాత పాకిస్థాన్ పై భారత్ కఠిన చర్యలు తీసుకుంది.

# ఆ ఇంటి పిలుపు వినిపిస్తూనే ఉందా?

- పదిహేనేళ్ల తర్వాత ఇండియాలో చిన్నప్పటి ఇంటికి తిరుగు ప్రయాణం
- భావోద్వేగంతో కన్నీళ్లు పెట్టుకున్న వ్యక్తి
- వైరల్ వీడియోలో బాల్య స్మృతుల్లోకి వెళ్తూ ఏడ్చిన విదేశీయుడు




**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** ప్రతి ఒక్కరి జీవితంలో బాల్యం ఒక మధురమైన జ్ఞాపకం. ఆడుతూ పాడుతూ గడిపిన రోజులు, చిన్ననాటి స్నేహితులు, పెరిగిన ఇంటి పరిసరాలు... ఇవన్నీ తలచుకుంటే ఒక తెలియని ఆనందం కలుగుతుంది. కానీ, కాలం ఎప్పుడూ ఒకేలా ఉండదు. కొంతమంది అనివార్య కారణాల వల్ల తమ ఊరిని, తమ బాల్యాన్ని వదిలి వేరే చోటకు వెళ్లాల్సి వస్తుంది. కొత్త ప్రదేశంలో కొత్త స్నేహితులు దొరికినా, పాత జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికీ గుండెల్లో పదిలంగా ఉంటాయి.ఇలాంటి అనుభవమే ఇంగ్లాండ్ కు చెందిన ఒక వ్యక్తికి ఎదురైంది. పదిహేనేళ్ల తర్వాత అతను తన అందమైన బాల్యాన్ని గడిపిన భారతదేశంలోని ఇంటికి తిరిగి వచ్చాడు. ఆ ఇంటిని చూడగానే అతని హృదయం భావోద్వేగంతో నిండిపోయింది.రాల్ఫ్ లెంగ్ అనే ఇన్ స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేసిన ఒక వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. ఈ వీడియోలో రాల్ఫ్ లెంగ్ అనే వ్యక్తి, చాలా సంవత్సరాల తర్వాత భారతదేశానికి వచ్చిన ఈ విదేశీయుడు రికార్డ్ చేస్తున్నారు. ఆ వ్యక్తి తన చిన్నప్పుడు ఆడుకున్న అందమైన ఇంటి ముందు నిలబడి ఉన్నాడు. ఇంటి గేటు తెరవగానే, అతని కళ్లముందు బాల్యంలోని ప్రతి దృశ్యం కదలాడుతున్నట్లు అనిపించింది. ఆనాటి మధురమైన జ్ఞాపకాలు ఒక్కసారిగా అతనిని చుట్టుముట్టాయి.ఆ గతం తలుచుకుంటూ ఆ వ్యక్తి బిగ్గరగా ఏడుస్తూ కనిపించాడు. వీడియోలో అతను తన చిన్ననాటి రోజులు ఎంత సంతోషంగా ఉండేవో చెబుతూ కన్నీళ్లు పెట్టుకున్నాడు. అంతేకాదు, అతను ఇక్కడి నుండి వెళ్ళిపోయినప్పుడు తన స్నేహితులు కూడా ఆ ఇంటిని, ఆ ఊరిని వదిలి వెళ్లాల్సి వచ్చిందని గుర్తు చేసుకున్నాడు. ఆ బాధను తట్టుకోలేక చిన్నపిల్లాడిలా విలపించాడు.ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఇప్పటికే ఇరవై ఐదు లక్షలకు పైగా వీక్షణలను సొంతం చేసుకుంది. నెటిజన్లు ఈ వీడియోపై తమదైన శైలిలో స్పందిస్తూ, తమ బాల్యపు జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటున్నారు. ఒక యూజర్ "ప్రతిదీ మారుతుంది, ఏదీ శాశ్వతం కాదు" అని కామెంట్ చేయగా, మరొకరు ఆ వ్యక్తి ఏడుస్తుంటే ముఖం టమోటాలా ఎర్రగా మారిందని సరదాగా వ్యాఖ్యానించారు. ఇంకొకరు "దయచేసి ఏడవకండి, మీరు ఏడవడం చూడలేకపోతున్నాను, మీరు ఎప్పుడూ నవ్వుతూనే ఉండాలి" అని ఓదార్పుగా రాశారు.ఈ వీడియో ఒకసారి మనందరినీ మన బాల్యంలోకి తీసుకెళ్తుంది. కాలం ఎంత వేగంగా గడిచిపోయినా, చిన్ననాటి జ్ఞాపకాలు మాత్రం మన హృదయాలలో ఎప్పటికీ పదిలంగానే ఉంటాయి అనడంలో సందేహం లేదు. ఆ మధురమైన రోజులను గుర్తుచేసుకోవడం కూడా ఒక అందమైన అనుభూతే కదా..!

# మూగజీవంపై అమానుషం.. గుర్రం యజమానిపై కేసు



**కోల్‌కతా :** ఓ వైపు దేశంలో విపరీతమైన ఎండలు. ఇంకోవైపు ఉక్కపోత. బయటకు రావాలంటేనే ప్రజలు హడలెత్తిపోతున్నారు. ఉదయం నుంచే భానుడు భగభగమండిపోతున్నాడు. దీంతో ప్రజలతో పాటు మూగజీవాలు కూడా విలవిలలాడిపోతున్నాయి. ఇలాంటి భయంకరమైన పరిస్థితుల్లో బండి లాగుతున్న గుర్రం హఠాత్తుగా రహదారిపై నీరసించి పడిపోయింది. అయితే గుర్రం యజమాని మాత్రం మూగజీవం పట్ల కర్కశంగా ప్రవర్తించాడు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.కోల్ కతా వీధిలో గుర్రం బండి వెళ్తోంది. అయితే ఎండ వేడిమి తట్టుకోలేక ఒక గుర్రం కుప్పకూలిపోయింది. అనంతరం గుర్రం యజమాని.. ఆ గుర్రాన్ని బలవంతంగా కొట్టి.. తాడుతో లాగే ప్రయత్నం చేశాడు. కానీ ఆ మూగజీవి నీరసించి లేవలేకపోయింది. ఈ ఘటనపై జంతు ప్రేమికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మూగజీవి పట్ల దుర్మార్గం ప్రవర్తించిన యజమానిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను నటి పూజా భట్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. తక్షణమే గుర్రపు బండ్ల వాడకాన్ని నిషేధించాలని ముఖ్యమంత్రి మమతా బెనర్జీని కోరారు.అయితే గుర్రం పోషకాహార లోపంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. దీంతోనే సన్ స్ట్రోక్ కారణంగా ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. అయితే ఈ సంఘటన జంతు ప్రేమికులకు ఆగ్రహాన్ని తెప్పించింది. వీడియో వైరల్ కావడంతో పోలీసులు గుర్రపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇక సోషల్ మీడియాలో అయితే నెటిజన్లు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

# హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించనున్న సీఎం

- హైడ్రా పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి
- చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల కబ్జాలపై ఇకపై హైడ్రా PSలో కేసులు
- ఇప్పటికే సాధారణ పోలీస్ స్టేషన్ లలో నమోదు అయిన పలు భూకబ్జా కేసులు



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలో భారీ స్పందన పొందిన హైడ్రా (HYDRAA) ఇప్పుడు ఇతర జిల్లాలకు కూడా విస్తరించేందుకు సన్నద్ధమవుతోంది. అక్రమ నిర్మాణాల కూల్చివేత, చెరువులు, పార్కులు, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్న ఈ ప్రత్యేక విభాగానికి ఇటీవల ప్రభుత్వం మరిన్ని అధికారాలు అప్పగించింది. ఈ నేపథ్యంలో, హైడ్రా కమిషనర్ రంగనాథ్ వెల్లడించినట్లుగా, త్వరలో ప్రత్యేక హైడ్రా పోలీస్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు అనుగుణంగా, మే 8వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైడ్రా పోలీస్ స్టేషన్ ను అధికారికంగా ప్రారంభించనున్నారు.ఇకపై చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూములపై జరిగే అక్రమ ఆక్రమణలపై స్థానికులు లేదా అధికారులు ఫిర్యాదు చేస్తే, హైడ్రా పోలీస్ స్టేషన్లలోనే కేసులు నమోదు అవుతాయి. ఇప్పటివరకు సాధారణ పోలీస్ స్టేషన్లలో నమోదైన భూకబ్జా కేసులపై హైడ్రా దాడులు జరుపుతూ వస్తోంది. అయితే త్వరలోనే ఈ కేసులు సాధారణ స్టేషన్ల నుంచి హైడ్రా స్టేషన్లకు బదిలీ అయ్యే అవకాశం ఉంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాసేపట్లో హస్తినకు వెళ్లనున్నారు. ఇవాళ సాయంత్రం ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన నిర్వహించే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశానికి కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు తప్పనిసరిగా పాల్గొనాలని అధిష్టానం నుంచి ఆదేశాలు అందాయి. ఈ మేరకు ఇవాళ సీఎం రేవంత్ రెడ్డి ఉదయం 10 గంటలకు శంషాబాద్ ఇంటర్‌నేషనల్ ఎయిర్‌పోర్ట్‌నుంచి ఢిల్లీకి బయలుదేరనున్నారు. ఈ భేటీకి కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీ , రాహుల్ గాంధీ , కేసీ వేణుగోపాల్ హాజరవుతున్నారు. ఇందులో భాగంగా పహల్గాం లో టూరిస్టులపై జరిగిన టెర్రర్ అటాక్ , కేంద్రం తాజాగా జనగణనతో పాటు కులగణనను నిర్వహించాలని తీసుకున్న నిర్ణయాలపై ప్రధానంగా చర్చించనున్నట్లుగా తెలుస్తోంది. అదేవిధంగా కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకు సంబంధించిన అంశాలు, కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల అంశాలు చర్చకు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ సీడబ్ల్యూసీ భేటీలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ సీనియర్ నేత వంశీచంద్ రెడ్డి, మంత్రి దామోదర రాజనర్సింహ పాల్గొననున్నారు.

# సురేష్ ప్రొడక్షన్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు

- సుప్రీం కోర్టులో సురేష్ ప్రొడక్షన్‌కు బిగ్ షాక్ తగిలింది
- ఏపీ ప్రభుత్వ షోకాజ్ నోటీసును సవాల్ చేస్తూ సురేష్ ప్రొడక్షన్ వేసిన పిటిషన్‌పై సుప్రీం కీలక వ్యాఖ్యలు చేసింది
- పిటిషన్‌లో జోక్యం చేసుకోలేమని..
- మధ్యంతర ఉపశమనం కుదరదని తేల్చిచెప్పేసింది ధర్మాసనం.



**న్యూఢిల్లీ :** సురేష్ ప్రొడక్షన్ కు సుప్రీంకోర్టులో ఊరట లభించలేదు. విశాఖ రామానాయుడు స్టూడియో భూముల వ్యవహారంపై ఈరోజు (శుక్రవారం) సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. ఫిల్మ్ సిటీ కోసం కేటాయించిన భూములను ఇతర అవసరాలకు వాడుకోవచ్చని గతంలో జగన్ ప్రభుత్వం అనుమతించిన విషయం తెలిసిందే. గత ప్రభుత్వ నిర్ణయాన్ని ఎందుకు రద్దు చేయకూడదో చెప్పాలని ప్రస్తుత ఏపీ ప్రభుత్వం షోకాజ్ నోటీసు ఇచ్చింది. ప్రభుత్వ షోకాజ్ నోటీసును సుప్రీంకోర్టులో సురేష్ ప్రొడక్షన్ సవాల్ చేసింది. దీనిపై ఈరోజు విచారణకు రాగా.. జస్టిస్ అభయ్ ఎస్ ఒకా ధర్మాసనం విచారణ జరిపింది.అయితే పిటిషన్ విషయంలో జోక్యం చేసుకునేందుకు ధర్మాసనం నిరాకరించింది. మధ్యంతర ఉపశమనం అడుగుతున్నారని.. అది కుదరదని సుప్రీం కోర్టు తేల్చి చెప్పేసింది. అవసరం అనుకుంటే ప్రభుత్వ షోకాజ్ నోటీసుపై సంబంధిత కోర్టును ఆశ్రయించాలని అభయ్ ఒకా సూచించారు. పిటిషన్ ను ఉపసంహరించుకుంటామని సురేష్ ప్రొడక్షన్స్ తెలుపగా.. అందుకు సుప్రీం కోర్టు ధర్మాసనం అనుమతించింది.

# ఎయిరిండియాకు రూ.5 వేల కోట్ల నష్టం!

- పాకిస్థాన్-భారత్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు
- ఎయిరిండియాకు రూ.5 వేల కోట్ల నష్టం!

**ఢిల్లీ :** పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత పాకిస్థాన్-భారత్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. పాకిస్థాన్ పై భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంది. సింధు జలాలను నిలిపివేసింది. అనంతరం పాకిస్థాన్ వీసాలను రద్దు చేసింది. అంతేకాకుండా అటారీ సరిహద్దు మూసివేసింది. దీంతో పాకిస్థాన్.. గగనతలాన్ని మూసివేసింది. తమ వైపు విమానాలు రాకుండా అడ్డుకుంది. అయితే దీని కారణంగా ఎయిరిండియా భారీ నష్టాలను ఎదుర్కొందిపాక్ గగనతలం ఏడాది పాటు మూసివేతతో ఎయిరిండియా సంస్థకు రూ.5 వేల కోట్ల వరకు నష్టం వాటిల్లనుంది. ఈ విషయాన్ని పీటీఐ వెల్లడించింది. ఎయిరిండియా సహా ఇండిగో, స్పైస్ జెట్ వంటి విమానయాన సంస్థలు తాజాగా సూచనలు, సలహాలను పౌర వైమానిక శాఖకు తెలియజేశాయి. ఈ నేపథ్యంలో వీటిని పరిశీలించి తగిన పరిష్కారం వెతికే పనిలో ఆ శాఖ నిమగ్నమైంది.ఏడాది పాటు పాక్ గగనతలం మూసివేస్తే సుమారు 600 మిలియన్ డాలర్లు (రూ.5 వేల కోట్లు) నష్టం వాటిల్లుతుందని ఎయిరిండియా పేర్కొంది. ఈ నేపథ్యంలో వైమానిక సంస్థ పలు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిపెట్టాయి. ప్రస్తుతం దేశంలో ఎయిరిండియా, ఎయిర్ ఇండియా ఎక్స్ ప్రెస్ , ఇండిగో, స్పైస్ జెట్ , ఆకాశా ఎయిర్ అంతర్జాతీయ సర్వీసులను నడుపుతున్నాయి. వైమానిక సంస్థలకు వారానికి రూ.77 కోట్ల అదనపు భారం పడొచ్చని అంచనా వేస్తున్నారు. ఇక భారత్ కూడా గత బుధవారం నుంచి పాకిస్థాన్ విమానాలకు మే 23వ తేదీ వరకు గగనతలం మూసివేసింది. ప్రస్తుతం రెండు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి.




# ఇప్పుడు గుర్తుకు వచ్చిందా

- కవిత వ్యాఖ్యలపై బీర్ల అయిలయ్య మండిపాటు
- రైతు బంధు, RTC సమ్మె, సామాజిక న్యాయం పై ఎదురుదాడి
- కుల గణనతో తెలంగాణ రాజకీయ వేడి



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో రాజకీయ విమర్శలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. తాజాగా ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ కవితపై తీవ్రమైన విమర్శలు గుప్పించారు. కార్మిక దినోత్సవం సందర్భంగా కవిత చేసిన వ్యాఖ్యలపై ఆయన ఘాటుగా స్పందించారు. కవిత ఇప్పటికైనా తెలంగాణ పట్ల సోయి చూపించడం గమనార్హమని చెప్పారు. సామాజిక తెలంగాణ ఇంకా రాలేదని ఇప్పుడు కవితకు అర్థమవుతోందంటే, గత 10 ఏళ్లలో తండ్రి కేసీఆర్ హయాంలో ఏం జరిగిందో ఇప్పుడు ఆమె గుర్తించుకుంటున్నట్లు తెలుస్తోందని ఐలయ్య ఎద్దేవా చేశారు.గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరిగిన తప్పులు, అప్పులు గురించి కవిత ఒక్కమాట కూడా మాట్లాడలేదని, రైతుబంధు పథకంపై నిజమైన రైతులకు లాభం లేదన్న ఆరోపణలపై అప్పట్లో స్పందించలేదని గుర్తు చేశారు బీర్ల ఐలయ్య. భూమిలేని వ్యవసాయ కూలీలకు మద్దతివ్వాలన్న కాంగ్రెస్ డిమాండ్ ను పట్టించుకోకపోయారని ఆరోపించారు.మా ప్రభుత్వం ఇప్పుడు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద భూమిలేని కూలీలకు సాయం చేస్తోందని, అప్పుడు పదేళ్ల పాటు రాష్ట్రాన్ని దోచుకున్నవాళ్లను ప్రశ్నించని కవితకు ఇప్పుడు సామాజిక న్యాయం గుర్తొచ్చిందా? అని ఐలయ్య ప్రశ్నించారు.ఆర్టీసీ సమ్మె సమయంలో 30 మంది కార్మికులు చనిపోయినా కవిత స్పందించలేదని ఐలయ్య గుర్తు చేశారు. కల్వకుంట్ల కుటుంబంలో తగాదాలు వచ్చి తన ప్రాధాన్యం తగ్గిపోవడమే కవిత ఇప్పుడీ మాటలు మాట్లాడటానికి కారణం అని వ్యాఖ్యానించారు. అధికారంలో ఉన్నప్పుడే కవిత తన తండ్రి కేసీఆర్ ను ప్రశ్నించి ఉంటే రాష్ట్ర పరిస్థితి వేరేలా ఉండేదని అన్నారు.ఇప్పటికైనా ఆమె కేసీఆర్ పాలనలో జరిగిన తప్పులను బయటపెట్టి ప్రజల రుణం తీర్చుకోవాలని సూచించారు. ఇక బీజేపీ నేతలపై కూడా ఐలయ్య విమర్శలు గుప్పించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి కులగణనపై సోయిలేని వ్యాఖ్యలు చేస్తున్నారని, ప్రధాని మోడీ కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకోవడంతో తెలంగాణ బీజేపీ నాయకులు ఉలిక్కిపడ్డారని అన్నారు.రేవంత్ రెడ్డిని ప్రధాని మోడీ హీరో చేశారని, కులగణన వల్ల దేశవ్యాప్తంగా ఆయనకు గుర్తింపు పెరిగిందని అన్నారు. ఈ విజయం బీజేపీ నేతలకు జీర్ణించుకోవడం కష్టంగా మారిందన్నారు. బీసీ బిల్లు గవర్నర్ ఆమోదించి రాష్ట్రపతికి పంపించడమే మా తొలి ఘనవిజయంఅని ఐలయ్య స్పష్టం చేశారు.

# ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలు కన్నుమూత..

- 116 ఏళ్ల అద్భుత జీవితం ముగిసింది
- సన్యాసిని కనబారో లుకాస్.. కాలాన్ని మించిన ప్రయాణం
- ఆధ్యాత్మికత, ఫుట్‌బాల్ పట్ల ప్రేమతో నిండిన అరుదైన జీవితం

**బ్రెజిల్ :** కాలం ఒక నది లాంటిది. ఎందరినో తనలో కలుపుకొని సాగిపోతూ ఉంటుంది. అలాంటి కాలపు ప్రవాహంలో ఒక అరుదైన జ్ఞాపకంలా నిలిచిన కనబారో లుకాస్ ఇక లేరు.



ప్రపంచంలోనే అత్యంత వృద్ధురాలిగా గుర్తింపు పొందిన ఈ బ్రెజిలియన్ సన్యాసిని 116 ఏళ్ల వయసులో కన్నుమూశారు. ఆమె 117వ పుట్టినరోజుకు కేవలం కొన్ని వారాల ముందు మరణించడం విషాదకరం. 1908 జూన్ 8న బ్రెజిల్ లోని రియో గ్రాండే డో సుల్ లో జన్మించిన కనబారో, తన జీవితాన్ని ఒక సన్యాసినిగా గడిపారు. 21 ఏళ్ల వయసులోనే ఆమె ఆధ్యాత్మిక మార్గాన్ని ఎంచుకున్నారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ కాసెరోస్ లోని శాంటా కాసా డి మిసెరి కార్డియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచారని కుటుంబ సభ్యులు తెలిపారు.కనబారో జీవితం ఎంతోమందికి ఆదర్శం. ఆధ్యాత్మిక చింతనతో పాటు ఆమెకు ఫుట్ బాల్ అంటే ఎంతో అభిమానం. తన ప్రతి పుట్టినరోజుకు ఫుట్ బాల్ టీషర్ట్ ను ధరించి సంబరాలు చేసుకునేవారు. ఈ ప్రత్యేకమైన ఆచారం ఆమెను మరింత ప్రత్యేకంగా నిలిపింది. ఆమె మరణం పట్ల పలువురు ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. కనబారో లుకాస్ మరణంతో, ఇప్పుడు 115 ఏళ్ల వయసున్న ఇంగ్లాండ్ కు చెందిన ఈథెల్ కేటర్ ప్రపంచంలోనే అత్యంత వృద్ధ మహిళగా గుర్తింపు పొందారు. కనబారో లుకాస్ ఒక శకం. 116 ఏళ్ల పాటు ఆమె జీవించిన జీవితం ఒక అద్భుతం. ఆమె జ్ఞాపకాలు ఎప్పటికీ మన హృదయాల్లో నిలిచి ఉంటాయి. కాలం గడుస్తున్నా కొన్ని జీవితాలు చరిత్ర పుటల్లో శాశ్వతంగా నిలిచి పోతాయి.

# గవర్నర్‌ను కలిసిన కాంగ్రెస్ బీసీ నేతలు

- బీసీలకు రాజకీయ, విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు
- తెలంగాణ ఉభయ సభల్లో చేసిన బిల్లుకు గవర్నర్ ఆమోదం
- రాష్ట్రపతికి పంపినందుకు కాంగ్రెస్ బీసీ నేతలు శుక్రవారం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిసి ధన్యవాదాలు తెలిపారు



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ బీసీ నేతలు శుక్రవారం ఉదయం రాజ్ భవన్ లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కలిశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, కేకే, మధుయాష్కీ నేతృత్వంలో గవర్నర్ ను కలిశారు. బీసీలకు రాజకీయ, విద్యా ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ ఉభయ సభల్లో చేసిన బిల్లుకు గవర్నర్ ఆమోదం పొంది రాష్ట్రపతికి పంపినందుకు కాంగ్రెస్ నేతలు ధన్యవాదాలు తెలిపారు. ఇంకా గవర్నర్ ను కలిసిన వారిలో ప్రభుత్వ విప్ బీర్ల ఆయిలయ్య, ఎమ్మెల్యేలు వీర్లపల్లి శంకర్, ప్రకాష్ గౌడ్, మేయర్ విజయలక్ష్మి తదితరలు ఉన్నారు.స్థానిక సంస్థలు, విద్య, ఉపాధి రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం (మార్చి 18న) శాసన సభలో ప్రవేశపెట్టిన రెండు బిల్లులు ఆమోదం పొందాయి. ఆ మరుసటి రోజు (మంగళవారం) వాటిని శాసన మండలిలో ప్రవేశపెట్టి ఆమోదం పొందిన అనంతరం వాటిని ప్రభుత్వం గవర్నర్ కు పంపారు. ఆయన వాటిని పరిశీలించి.. రాష్ట్రపతికి పంపారు. తొలుత.. 'తెలంగాణ బీసీ, ఎస్సీ, ఎస్టీ (విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు) బిల్లు-2025', 'తెలంగాణ బీసీ (స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు) బిల్లు-2025'ను మంత్రి పొన్నం ప్రభాకర్ సభలో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీలకు ఉన్న రిజర్వేషన్లు 29 శాతం. వాటిని 42 శాతానికి పెంచుతూ ఆమోదించిన బిల్లు చట్ట రూపం దాల్చాలంటే.. పార్లమెంటులో 2/3 మెజారిటీతో వాటికి ఆమోదం పొందాల్సి ఉంది. ఇందుకు కారణం.. సుప్రీం కోర్టు గతంలో ఇచ్చిన పలు తీర్పులే. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలందరికీ అమలు చేసే రిజర్వేషన్లన్నీ కలిపి 50 శాతాన్ని మించకూడదని గతంలో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. ఒకవేళ.. రిజర్వేషన్లను పెంచితే వాటిని రాజ్యాంగంలోని షెడ్యూల్ 9లో చేర్చాల్సి ఉంటుంది. అందుకే.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 31 (సి) ప్రకారం రాష్ట్రపతి ఆమోదం కోసం పంపుతున్నట్టు బిల్లుల్లో పేర్కొంది. న్యాయ సలహా తీసుకుని రాష్ట్రపతి వాటిపై ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. అవి చట్టపరంగా నిలబడాలంటే మాత్రం.. బిల్లులను పార్లమెంటు ఉభయ సభలు 2/3 మెజారిటీతో ఆమోదించాలి. అప్పుడు మాత్రమే అవి రాజ్యాంగంలోని షెడ్యూల్ -9లో చేరి, వాటికి రాజ్యాంగ రక్షణ లభిస్తుంది.

# పాలమూరు పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం

- పాలమూరు రంగారెడ్డి పనులపై ప్రభుత్వ నిర్లక్ష్యం
- రాజకీయ కక్షతో ప్రాజెక్టులను అడ్డుకుంటున్న కాంగ్రెస్ నేతలు
- రైతులకు నష్టం, రాష్ట్రానికి అన్యాయం : నిరంజన్ రెడ్డి



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటున్న వైఖరిని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. తెలంగాణ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రేవంత్ రెడ్డిపై ప్రత్యేకంగా మండిపడ్డారు. పాలమూరు బిడ్డ అని చెప్పుకునే సీఎం రేవంత్ రెడ్డి, పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుపై ఒక్క అడుగు ముందుకు వేయకపోవడం మాతృద్రోహం కాదా? అని ఆయన ప్రశ్నించారు. ఏడాదిన్నర కాలంగా తట్టెడు మన్ను కూడా ఎత్తని ప్రభుత్వం ప్రాజెక్టుపై ప్రాధాన్యం లేకుండా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్యాకేజీ 3లో కేవలం 8 కిలోమీటర్ల కాలువ మాత్రమే మిగిలి ఉండగా, దానికి సంబంధించిన కాంట్రాక్ట్ ను ఆంధ్రప్రదేశ్ కు చెందిన టీడీపీ నేతకు అప్పగించడం అనుమానాస్పదమని నిరంజన్ రెడ్డి ఆరోపించారు. ఆ కాంట్రాక్టును ప్రారంభించకపోవడానికి అక్కడి రాజకీయ నాయకుల ఒత్తిడి ఉందేమో అనిపిస్తోందని అన్నారు. ప్రాజెక్టు కోసం 27,000 ఎకరాల భూసేకరణ జరగగా, కేవలం 100 ఎకరాలు మాత్రమే మిగిలివున్నాయని తెలిపారు. ప్రజలకు పాలమూరు ప్రయోజనాలు త్వరగా అందకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ పనులను నిర్లక్ష్యం చేస్తోందని ఆయన వ్యాఖ్యానించారు.ప్రాజెక్టుకు సంబంధించి ప్రస్తుత పరిస్థితిని సమీక్షించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం డిమాండ్ చేశారు. డిండి పనులను హడావిడిగా ప్రారంభించడం అనవసరం. తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ప్రాజెక్టును నీటి పారుదల శాఖ మంత్రి ఎందుకు సమీక్షించడం లేదని నిలదీశారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు చేపట్టాల్సిన సమయంలో, జూరాల నుంచి కొడంగల్ ఎత్తిపోతల చేపట్టడం అనేది కక్షసాధింపు చర్య అని ఆయన ఆరోపించారు. ప్రస్తుతం జూరాలలో నీరు వదులుకోవడం వల్ల ప్రాజెక్టు డిజైన్ ప్రమాదంలో పడుతుందని, అల్మట్టిలో నీళ్లు నిలుపుకునే అవకాశం తక్కువ అని అన్నారు.ప్రాజెక్టుపై ఇప్పటివరకు రూ.32 వేల కోట్ల వ్యయం జరిగిందని, 90 శాతం పనులు పూర్తయ్యాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కూడా అంగీకరించారని గుర్తు చేశారు. జరిగిన పనులకు అభినందనలు చెప్పే ముందు, మిగిలిన వాటిని పూర్తిచేసి ప్రజలకు ఫలితాలు అందించాలంటూ డిమాండ్ చేశారు. సాగునీళ్లు ఇవ్వడం లేదు, పంటలు కొనడం లేదు. రైతులకు బోనస్ ఇవ్వలేదు. రుణమాఫీ సగం కూడా కాలేదని ఆయన మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రూ.లక్షా 70 వేల కోట్ల అప్పులు చేసిన ఈ ప్రభుత్వం ఇప్పుడు అప్పుల గురించి మాట్లాడడం ఆక్షేపణీయమైనదని నిరంజన్ రెడ్డి వ్యాఖ్యానించారు. మూసీ ప్రాజెక్టు, హైడ్రా వంటి మంచి అవకాశాలను ధ్వంసం చేశారు. అన్ని రంగాల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల ప్రజలు శిక్ష అనుభవిస్తున్నారు అని ఆయన విమర్శలు గుప్పించారు.

# అమరావతి పునర్నిర్మాణం

### వంద పాకిస్థాన్ లకు సమాధానం చెప్పే మిస్సైల్ మనదగ్గర ఉంది :మంత్రి నారాలోకేష్

ఏపీ రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తోంది. పదేళ్ల క్రితం 2015 అక్టోబరు 22న అమరావతి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ప్రధాని నరేంద్రమోడీ చేతుల మీదుగానే అమరావతి పునర్నిర్మాణం మొదలైంది. ఈ కార్యక్రమంలో మంత్రి నారాలోకేష్ మాట్లాడారు. పహల్గాం దాడిలో అమరులైన టూరిస్టుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వేదిక మీద నుంచి పాకిస్థానీయులను హెచ్చరించారు.

"ఉగ్రవాదుల దాడిలో చనిపోయిన కుటుంబాలకి దేశం మొత్తం అండగా నిలుస్తుంది. పాకిస్థాన్ గీత దాటింది. అమాయకులను చంపింది. చాలా పెద్ద తప్పు చేసింది. ఒక్క పాకిస్థాన్ కాదు.. 100 పాకిస్తాన్ లో వచ్చినా.. భారతదేశ నేలపై మొలిచిన గడ్డి కూడా పీకలేదు. 100 పాకిస్థాన్ లకు సమాధానం చెప్పే.. ఒక్క మిస్సైల్ మన దగ్గర ఉంది. ఆ మిస్సైలే "నమో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ". సింహం ముందు ఆటలాడకూడదు. ఆడితే ఏమవుతుందో అందరికీ తెలుసు. మన ప్రధాని మోడీ కొట్టే దెబ్బకి ప్రపంచ మ్యాప్ లోనే పాకిస్థాన్ కనుమరుగైపోతుంది. ఈరోజు పాకిస్థాన్ ఆర్మీ లో పని చేసే వాళ్ళు కొంత మంది రాజీనామా చేశారు. కొంతమంది సెలవు పెట్టి పోయారు. అది మన మోడీ పవర్ అంటే.. మన ప్రధాని దిబ్బకు పాకిస్థాన్ దిమ్మ తిరగడం ఖాయం." అని మంత్రి నారాలోకేష్ వ్యాఖ్యానించారు.

### ఆ బాధను నేను మర్చిపోలేను..:డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్

రాజధాని నిర్మాణానికి 34000 ఎకరాలు ఇచ్చిన 29 వేల పైచిలుకు రైతులుకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నమస్కారాలు తెలిపారు. అమరావతి రైతులు ఐదు సంవత్సరాలుగా నలిగిపోయారని.. రోడ్ల మీదకు వచ్చి, ముల్ల కంచెలపై కూర్చొని, పోలీసులు లాఠీ దెబ్బలు తిని, కేసులు పెట్టించుకున్నారని గుర్తు చేశారు. 2000 రైతుల ప్రాణాలు కోల్పోయాయని చెప్పారు. రైతులు నలిగి బాధపడి, తమ కన్నీళ్లు తుడిచేవారు ఉన్నారా? అని చాలామంది మహిళలు రైతులు ఆ రోజుల్లో తను అడిగిన సన్నివేశాన్ని గుర్తు చేశారు. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి తెలుస్తుందా? అని రైతులు అడిగినట్లు తెలిపారు. మోడీకి ఏదీ ఉండదని.. అమరావతి శాశ్వత రాజధాని అని మోడీ నమ్మారని ఆరోజు చెప్పినట్లు తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం మరోసారి మోడీ చేతుల మీదుగా రాజధాని నిర్మాణం పున ప్రారంభం జరుగుతుందన్నారు. 5 కోట్ల మంది ప్రజలకు సంబంధించి ఈ రాజధాని ఒక హబ్ లాంటిదని, ఓ ఇల్లు లాంటిదన్నారు.రైతులు పడ్డ బాధలను గుర్తు చేసిన డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాటి రోజులను గుర్తు చేశారు. "రాజధాని నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు నా శిరస్సు వంచి ధన్యవాదాలు తెలియజేస్తున్నా. గత ఐదేళ్లలో మీరు పడ్డ బాధలు, మీరు తిన్న లాఠీ దెబ్బలు, మీరు అనుభవించిన అవస్థలు అన్ని మా మనసులో ఉన్నాయి. దివ్యాంగులను కూడా లాఠీతో కొట్టడం, నా గుండెల్లో ఇప్పటివరకు ఇలాగే ఉంది. ఆ బాధను నేను మర్చిపోలేను. దీనికి సజీవ సాక్షి నేడు ఈ అమరావతి రాజధాని పునః ప్రారంభం. ఆరోజు మహిళలు విద్యార్థులు చేసిన పోరాటాల త్యాగానికి జవాబుదారీ తరంగా ఉంటాం. అమరావతి మహిళా రైతుల పాత్ర ప్రత్యేకమైనది." అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తెలిపారు."అమరావతి రైతులు గత ఐదేళ్లు పోరాడారని.. అమరావతి శాశ్వత రాజధానిగా ఉంటుందని మాటిచ్చాం.. గత ప్రభుత్వం అమరావతి భవిష్యత్ ను తుడిచి పెట్టేసింది.. అమరావతి రైతులు ధర్మ యుద్ధంలో గెలిచారు.. అమరావతి ప్రపంచస్థాయి రాజధానికి మారుతుంది.. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రధాని మోడీ అమరావతి పునఃనిర్మాణ సభకు వచ్చారు.. కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీయే అధికారంలో ఉండటంతో వేగంగా అభివృద్ధి జరుగుతుంది.. మ్యాచింగ్ గ్రాంట్లు కూడా ఇవ్వని కారణంగా గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కుంటుపడింది.. 20 ఏళ్ల ముందే భవిష్యత్ ను ఊహించి ప్రణాళికతో ముందుకు వెళ్ల గల నేత చంద్రబాబు. అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యాఖ్యానించారు.ప్రధాని ఓం సన్యాశాస్త్రంలో ఉన్నప్పుడు ఆయనకు అనికేత్ అని పేరు పెట్టారని చెప్పారు.'ప్రధాన మంత్రిగా నరేంద్ర మోడీ ఓం సన్యాశాస్త్రంలో ఉన్నప్పుడు ఆయనకు అనికేత్ అని పేరు పెట్టారు. అనికేత్ అంటే.. పరమశివుడు, ఇల్లు లేని వాడని అర్థం. ఇలాంటి ఇల్లు లేని వాడు, కుటుంబం లేని వాడు మన ప్రధాని నరేంద్ర మోడీ.. 5 కోట్ల మంది ప్రజల కోసం, ఎన్ని కోట్ల కుటుంబాల కోసం.. 140 కోట్ల మంది ప్రజానీకాన్ని తన కుటుంబ సభ్యులుగా భావించి ముందుకు సాగుతున్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారికి ఆంధ్రప్రదేశ్ ప్రజానీకం తరపున, అమరావతి రైతాంగం, ఆడపడుచుల తరపున హృదయపూర్వక నమస్కారాలు' అని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు.

### ఐదు కోట్ల మంది ప్రజల సెంటిమెంట్ అమరావతి అమరావతి :సీఎం చంద్రబాబు

రాజధాని పునర్నిర్మాణం చేస్తున్నామంటే ఈరోజు కంటే ప్రత్యేకమైన రోజు మరి ఏది ఉండదలని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపారు. గతంలో మోడీని ఎప్పుడు కలిసిన చాలా ఆహ్లాదకరంగా ఉండేవారని.. కానీ మొన్నటి సమావేశంలో అమరావతికి రమ్మని పిలవడానికి వెళ్తే.. తమ భేటీ చాలా గంభీరంగా సాగిందని గుర్తు చేశారు. దీనికి ఏకైక కారణం ఉగ్రవాదుల దాడితో నా దేశ ప్రజల ప్రాణాలు కోల్పోయారని మోడీ ఆవేదనను మోడీలో తాను చూసినట్లు సీఎం తెలిపారు. ఉగ్రవాదులను అంతం చేయడానికి కేంద్రం తీసుకునే ప్రతి నిర్ణయంలో తాము ప్రధానికి అండగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ప్రజలు మోడీకి అండగా ఉన్నారన్నారు.అమరావతిని మూడేళ్లలో పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. అప్పుడు ప్రధాని మోడీని మళ్లీ ఆహ్వానిస్తామని చెప్పారు.. "రూ.57,980 కోట్ల ప్రాజెక్టులకు ఇవాళ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుగుతున్నాయి.. మోడీ గైడెన్స్ తో అమరావతిని ప్రపంచం మెచ్చే రాజధానిగా తయారు చేస్తాం.. అమరావతి 5 కోట్ల మంది ప్రజల సెంటిమెంట్.. 5 లక్షల మంది అమరావతిలో చదువుకునే అవకాశం ఉంటుంది.. అమరావతిని హెల్త్, ఎడ్యుకేషనల్ హబ్ గా చేస్తాం.. అమరావతిని పర్యావరణహితంగా తయారు చేస్తాం.. బిట్స్ పిలానీ, టాటా ఇన్నోవేషన్ హబ్ లాంటి సంస్థలు ఇక్కడికి వస్తాయి." అని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు."కేంద్రం తీసుకున్న కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం.. 2024 ఎన్నికల్లో నేను, పవన్ కళ్యాణ్ కలిసి పని చేసి 94 శాతం స్ట్రైక్ రేట్ సాధించాం.. ఇప్పుడు కేంద్రం ఇచ్చిన ఆసరాతో ఏపీ అభివృద్ధిలో ముందుకు వెళ్తుంది.. కేంద్రం సహకారంతో అమరావతిని మళ్లీ పట్టాలెక్కిస్తున్నాం.. 34 వేల ఎకరాల భూమిని రాజధాని కోసం ల్యాండ్ పూలింగ్ కింద ఇచ్చారు.. అమరావతి రైతులు వీరోచితంగా పోరాడారు, ఇది వాళ్ల విజయం.. అమరావతి రైతులు చేసిన ఉద్యమం లాంటి ఉద్యమాన్ని ఇంత వరకు నేను ఎప్పుడూ చూడలేదు." అని సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు.ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అమరావతి పునఃనిర్మాణం సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సభ జరిగే సమయంలో వర్షం వస్తుందని తాము అనుకున్నట్లు చెప్పారు. మోడీ ఓ మాట చెప్పారని గుర్తు చేశారు. " ఈ రోజు వర్షం వస్తుందని మేము అనుకున్నాం. కానీ మోడీ వస్తున్నారంటే.. వర్షం కూడా రాకుండా దేవతలు మొత్తం ఆశీర్వదించారంటే అది ఈ అమరావతి పవర్. ఇప్పుడే ప్రధాని నాతో ఓ మాట అన్నారు. నా 25 ఏళ్ల చరిత్రలో ఏ మీటింగ్‌కి వచ్చిన వాతావరణం సానుకూలంగానే వచ్చింది. ఏ మీటింగ్ క్యాన్సల్ కాలేదు. ఈ మీటింగ్ కూడా విజయవంతం అవుతుందనే వచ్చినట్లు మోడీ చెప్పినప్పుడు నాకు ఎంతో ఆనందం కలిగింది.ఏపీ కలల రాజధాని అమరావతి కేవలం ఒక నగరం మాత్రమే కాదు.. ఐదు కోట్ల మంది ప్రజల సెంటిమెంట్ అని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవం, ఆత్మవిశ్వాసం, ఆశలు, ఆకాంక్షలకు ఈ నగరమే ప్రతిరూపమన్నారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా 29 వేల మంది రైతులు ఏకంగా 34వేల ఎకరాల భూమిని రాజధానికి పూలింగ్ కింద ఇచ్చారంటే.. దేశానికే కాదు.. ప్రపంచానికే ఇదో చరిత్ర అన్నారు. అలాంటి అమరావతి నగర నిర్మాణం తలపెడితే.. గత ఐదేళ్లలో ఎలాంటి విధ్వంసం జరిగిందో చూశామన్నారు.

### అమరావతి పునర్నిర్మాణ పనులకు ప్రధాని మోడీ శంకుస్థాపన!

అమరావతి పునర్నిర్మాణ పనులకు శుక్రవారం వెలగపూడిలో ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన చేశారు. సభా వేదిక పైనుంచే 18 ప్రాజెక్టులకు ప్రధాని శంకుస్థాపనలు చేశారు. రాజధాని పనులు సహా రూ.58 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. రూ.49,040 కోట్ల విలువైన రాజధాని పనులకు, రూ.8 వేల కోట్ల విలువైన కేంద్ర ప్రాజెక్టులకూ ప్రధాని శంకుస్థాపన చేశారు. పనుల ప్రారంభానికి ప్రతీకగా అమరావతి పైలాన్‌ను ప్రధాని ఆవిష్కరించారు.అమరావతి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన అనంతరం ప్రధాని నరేంద్ర మోడీ తెలుగులో ప్రసంగాన్ని ప్రారంభించారు. తల్లి దుర్గ భవానీ కొలువైన పుణ్య భూమిపై మీ అందరినీ కలవడం నాకు ఆనందంగా ఉందని ప్రధాని అన్నారు. 'అమరావతి స్వప్నం సాకారం అవుతున్నట్లు కనిపిస్తోంది. చారిత్రక పరంపర, ప్రగతి రెండు కలిసి పయనిస్తున్నట్లు కనిపిస్తుంది. ఒక కొత్త అమరావతి, కొత్త ఆంధ్రప్రదేశ్, బౌద్ధ వారసత్వం, ప్రగతి కలగలిసిన ప్రాంతం ఇది. అమరావతి ఒక నగరం కాదు, అమరావతి ఒక శక్తి. ఆంధ్రప్రదేశ్‌ను ఆధునాతన ప్రదేశ్‌గా మార్చే శక్తి అమరావతికి ఉంది. ఏపీలోని ప్రతి ఒక్కరి కలలను అమరావతి సాకారం చేస్తుంది' అని అన్నారు.'ఏఐ, టెక్నాలజీ, గ్రీన్ ఎనర్జీ, విద్యా రంగాల్లో అమరావతి ముందు ఉంటుంది. ఇవి కేవలం శంకుస్థాపనలు కాదు ఏపీ ప్రగతికి, వికసిత్ భారత్‌కు నిదర్శనం. స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణానికి ఇది శుభసంకేతం. రికార్డు స్పీడ్‌లో పనులు పూర్తి చేయడానికి కేంద్రం సహకరిస్తుంది. అమరావతిలో మౌలిక సదుపాయల కోసం కేంద్రం సహకరించింది. అమరావతికి ఉన్న ఆటంకాలు తొలగిపోయి ఇప్పుడు పనులు వేగంగా జరుగుతున్నాయి. చంద్రబాబు నాకు టెక్నాలజీ వాడకం గురించి చెప్పారు. నేను గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు ఏపీ సీఎంగా చంద్రబాబు టెక్నాలజీ వాడకాన్ని గమనించాను' అని ప్రధాని మోడీ చెప్పుకొచ్చారు.అమరావతి పునర్ నిర్మాణ పనుల ప్రారంభోత్స కార్యక్రమంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 18 కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఇక, ఆయన మాట్లాడుతూ.. దేశంలో సాగు నీరుకు ఇబ్బంది లేకుండా నదుల అనుసంధానం చేస్తున్నాం అని పేర్కొన్నారు. ప్రతి పొలానికి నీరు అందించాలి.. రైతులకు ఎలాంటి సమస్య ఉండకూడదనేది మా ప్రభుత్వ లక్ష్యం అని చెప్పుకొచ్చారు. అలాగే, ఏపీకి జీవనాడి అయిన పోలవరాన్ని వేగంగా పూర్తి చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తాయని ప్రధాని మోడీ అన్నారు.ఇక, నెల్లూరులోని శ్రీహరికోట నుంచి జరిగే ప్రయోగాలు.. దేశం మొత్తాన్ని గర్వపడేలా చేస్తాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తెలిపారు. మన ఆయుధాలే కాదు.. ఐకమత్యమే మన ప్రధాన బలం అన్నారు. విశాఖలో ఏక్తా మాల్.. హస్తకళల నిపుణులకు చేయూతనిస్తుందని పేర్కొన్నారు. అయితే, అంతర్జాతీయ యోగా దినోత్సవం (జూన్ 21న) రోజున నేను ఏపీకి వస్తున్నాను.. చంద్రబాబు ఆహ్వానం మేరకు నేను యోగా దినోత్సవం రోజున.. రాష్ట్రంలో పర్యటిస్తాను అని వెల్లడించారు. వచ్చే 50 రోజులు.. ఏపీలో యోగాకు సంబంధించిన విస్తృత కార్యక్రమాలు జరగాలని ప్రధాని మోడీ పిలుపునిచ్చారు.

# త్వరలో బీసీలకు కేంద్ర మంత్రి పదవి

- ప్రధాని మోడీ చిత్రపటానికి ఆర్. కృష్ణయ్య పాలాభిషేకం
- త్వరలో బీసీలకు కేంద్ర మంత్రి పదవి వస్తుందన్న కృష్ణయ్య
- తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కులగణనపై చిత్తశుద్ధితో వ్యవహరించలేదన్నారు

**ఆంధ్రప్రదేశ్ :** విజయవాడలో ప్రధాని నరేంద్ర మోడీ చిత్రపటానికి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య పాలాభిషేకం చేశారు. బీసీల పట్ల మోడీకి ఉన్న ప్రేమ,



చిత్తశుద్ధి వల్లే కులగణన సాధ్యమైందన్నారు. కులాల లెక్కలు తీయడం ద్వారా బీసీలకు చట్టబద్ధమైన రిజర్వేషన్లు లభించనున్నాయని పేర్కొన్నారు. ఇది బీసీల విజయం మాత్రమే కాదు.. దేశంలో ఓ కొత్త శకానికి నాంది అని వ్యాఖ్యానించారు. జనగణనలో కుల గణన చేయడానికి స్వాతంత్ర్యం ఉన్నప్పటికీ గతంలో ఏ ప్రభుత్వమూ ముందుకు రాలేదని విమర్శించారు. అనేక కమిషన్లకు లెక్కలు ఇచ్చినప్పటికీ వాటిని పట్టించుకోలేదని తెలిపారు. మోడీ ఓబీసీల పట్ల నిజమైన కమిట్ మెంట్ ఉన్న నాయకుడు అని ప్రశంసించారు. త్వరలోనే బీసీలకు కేంద్ర మంత్రి పదవి లభించనుందని తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కులగణనపై చిత్తశుద్ధితో వ్యవహరించలేదని కృష్ణయ్య ఆరోపించారు.ఇక ప్రధాని నరేంద్ర మోడీ అమరావతి పర్యటనను చారిత్రక ఘట్టం అన్నారు ఆర్ . కృష్ణయ్య. ఆంధ్రప్రదేశ్ లో ఇప్పటివరకు రాజధాని విషయంలో స్పష్టత లేకపోయినప్పటికీ, ఇప్పుడు అమరావతి అభివృద్ధి బాట పట్టిందని చెప్పారు. హైదరాబాద్ లో ఐటీ రంగాన్ని అభివృద్ధి చేసిన చంద్రబాబు, అమరావతిని అదే విధంగా అభివృద్ధి చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేలా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారని అన్నారు కృష్ణయ్య. బీసీలు భారత మాత ముద్దు బిడ్డలు.. ఇది బీసీల మొదటి విజయం కాదు దేశంలో ఓ కొత్త శకం ప్రారంభమైందన్నారు. కొన్ని పార్టీలు కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం విమర్శలు చేస్తున్నాయని మండిపడ్డారు. వరుసగా ఎన్నికల్లో మోడీ గెలుస్తున్నారు, మోడీ ఓబీసీల పట్ల నిజమైన కమిట్ మెంట్ ఉన్న నాయకుడు, మోడీ నాయకత్వంలో బీసీలకు మంచి జరిగింది, త్వరలో బీసీలకు కేంద్ర మంత్రిపదవి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు కృష్ణయ్య. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కులగణన చేపట్టలేదు, లెక్కలు తీసుకుంది, కులగణనపై కాంగ్రెస్ కు నిజమైన చిత్తశుద్ధి లేదని విమర్శించారు బీజేపీ రాజ్యసభ సభ్యులు ఆర్ . కృష్ణయ్య.

# తెలంగాణ మదర్సాల్లో బంగ్లాదేశీయులు!

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో విచ్చలవిడిగా కొత్త మదర్సాలు పుట్టుకు వస్తున్నాయని, వాటిలో ఎన్నింటికి అనుమతులు ఉన్నాయో వివరాలు చెప్పాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాస్తున్నానని మెదక్ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. ఇవాళ బీజేపీ స్టేట్ ఆఫీస్ లో మీడియాతో మాట్లాడిన ఆయన మెదక్ పార్లమెంట్ పరిధిలో ఉన్న వాటితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మదర్సాల్లో జరుగుతున్న చట్టవ్యతిరేక కార్యక్రమాలపైన నియంత్రణ ఎవరికి ఉందో అధికారులు ఎవరూ చెప్పడం లేదని అందుకే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తున్నామన్నారు. త్వరలోనే గవర్నర్ ను ఆ తర్వాత కేంద్ర హోంశాఖ మంత్రి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. సంగారెడ్డి జిల్లా జిన్నారం, సంగారెడ్డి-సదాశివపేట మధ్య హైవైపై ఉన్న మదర్సా విషయంలో తమకు అనుమానాలు ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు.

### మదర్సాల్లో బంగ్లాదేశీయులు:

జిన్నారంలో మదర్సా విషయంలో కామన్ సిటిజన్ గా తాను చేసిన దర్యాప్తులో తెలంగాణే కాదు యావత్ దేశం ఆశ్చర్యపడే విషయాలు బయటపడ్డాయని రఘునందన్ రావు అన్నారు. జిన్నారం మదర్సాలో మొత్తం 70 మంది విద్యార్థులు చదువుతుంటే అందులో 65 మంది విద్యార్థులు బిహార్ రాష్ట్రంలోని కిషన్ గంజ్ జిల్లాకు చెందిన వారు ఉన్నారని, వీరికి చదువు చెప్పే ఉపాధ్యాయులు సైతం కిషన్ గంజ్ కు చెందిన వారేనని అన్నారు. జిన్నారం కేవలం చిన్న మండల కేంద్రం అని అలాంటి చోటకు ఎక్కడో బిహార్ కు చెందిన విద్యార్థులు ఇక్కడికి వచ్చి చదువుకోవాల్సి అవసరం ఏంటనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. కిషన్ గంజ్ బంగ్లాదేశ్ కు బార్డర్ అని బంగ్లాదేశ్ కు చెందిన విద్యార్థులే అక్కడి నుంచి వచ్చి జిన్నారంలో శిక్షణ పొందుతున్నారనే అనుమానం తమకు ఉందన్నారు. బంగ్లాదేశ్ నుంచి కిషన్ గంజ్ లోకి అక్రమంగా వలసవచ్చిన వారు అక్కడున్న హిందువులను బెదిరిస్తూ బలవంతంగా వారి భూములు కొనుగోలు చేస్తూ ల్యాండ్ జిహాద్ కు పాల్పడుతున్నారని ఈ విషయం జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయన్నారు. జిన్నారంలో కోదండరామస్వామి దేవాలయానికి సంబంధించిన భూముల్లో మదర్సా ఎలా వచ్చిందో అధికారులు చెప్పాలన్నారు.జిన్నారం మదర్సా ఎపిసోడ్ లో తాను ఓ కామన్ సిటిజన్ గా ఎంక్వయిరీ చేస్తే అనేక సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయని ఇక పోలీసులు దర్యాప్తు చేస్తే ఎలాంటి విషయాలు వెలుగు చూస్తాయోనన్నారు.

### 247 మంది నేపాలీలకు ఆధార్ కార్డులు:


తన పార్లమెంట్ పరిధిలోని ఇస్నాపూర్ లోనే 247 మంది నేపాలీలకు ఆధార్ కార్డులు ఇచ్చారని కేంద్ర ప్రభుత్వం విదేశీయులను వెనక్కి పంపాలని ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో అక్రమంగా ఉంటున్న వారిని గుర్తించి పంపించి వేయాలన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఎక్కడికక్కడ మీ చుట్టుపక్కల్లో ఉన్న మదర్సాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



# సంపాదకీయం

## బైసరన్ వ్యాలీ పర్యవేక్షణ బాధ్యత ఎవరిది

రోజు మాదిరిగానే ఏప్రిల్ 22న కూడా జమ్మూకశ్మీర్ లోని పహల్గాంలో ఉన్న బైసరన్ వ్యాలీకి పర్యటకులు పెద్దసంఖ్యలో వచ్చారు. ఈ ప్రదేశం పహల్గాం మార్కెట్ నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది.అదే రోజు మధ్యాహ్నం తీవ్రవాద దాడి జరిగింది. ఈ దాడిలో 26 మంది మరణించారు. వారిలో 25 మంది పర్యటకులు కాగా, ఒక స్థానిక యువకుడు ఉన్నారు.గత మూడు దశాబ్దాల్లో, జమ్మూకశ్మీర్ లో పర్యటకులు లక్ష్యంగా ఇంత పెద్ద దాడి జరగడం ఇదే తొలిసారి.అసలింతకీ ఈ అందమైన బైసరన్ వ్యాలీ నిర్వహణాబాధ్యతలు చూసేదెవరు? దీనిని ఎప్పుడు తెరుస్తారు? ఎప్పుడు మూసేస్తారు? వంటి ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకునేందుకు మేం ప్రయత్నించాం. అలాగే, దీనితో సంబంధమున్న వ్యక్తులు, స్థానికులు ఏం చెబుతున్నారో చూద్దాం.బైసరన్ వ్యాలీ పహల్గాం డెవలప్‌మెంట్ అథారిటీ(పీడీఏ) పరిధిలోకి వస్తుంది. బైసరన్‌తో పాటు పహల్గాంలోని ఇతర పర్యటక ప్రాంతాలను కూడా ఈ అథారిటీనే పర్యవేక్షిస్తుంది.ఈ అథారిటీతో సంబంధమున్న ముగ్గురు వ్యక్తులతో మాట్లాడింది. బైసరన్ పార్క్ బాధ్యతలను తమ డిపార్ట్‌మెంటే పర్యవేక్షిస్తుందని వారు స్వయంగా నాతో చెప్పారు.పర్యవేక్షణాబాధ్యతల గురించి వివరిస్తూ, బైసరన్ లేదా పహల్గాంలోని ఇతర ప్రదేశాల బాధ్యతలను కూడా అథారిటీనే చూస్తుందని వారన్నారు.ఈ అథారిటీ పహల్గాంలోని బైసరన్ వ్యాలీతో పాటు బెతాబ్ వ్యాలీ, ఇంకా ఇతర చిన్నా పెద్ద పార్కుల నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్ కాంట్రాక్టర్లకు ఇస్తుంది. ఈ ఒప్పందం మూడేళ్లు ఉంటుంది.పహల్గాంలో పనిచేసిన ఉద్యోగి మాట్లాడుతూ, గత ఏడాది బైసరన్ పార్క్ నిర్వహణ బాధ్యతలను మూడేళ్లకు గానూ 3 కోట్ల రూపాయల టెండర్‌ను ఒక ప్రైవేట్ కాంట్రాక్టర్‌కు ఇచ్చినట్లు చెప్పారు. ఆయన తనపేరు బయటకు వెల్లడించొద్దన్నారు.సదరు ప్రైవేట్ కాంట్రాక్టర్‌ను సంప్రదించేందుకు కూడా ప్రయత్నించింది, కానీ సాధ్యం కాలేదు.బైసరన్ పార్క్, బెతాబ్ వ్యాలీ ఏడాది పొడవునా తెరిచే ఉంటాయని అథారిటీ అధికారి ఒకరు, తన వివరాలు బహిర్గతం చేయద్దన్న షరతుతో చెప్పారు.వాతావరణం అనుకూలించనప్పుడు కొద్దికాలం బైసరన్ వ్యాలీని మూసేస్తారని అన్నారు. భారీగా మంచుకురిసే సమయంలో కశ్మీరీలు కూడా ఇళ్లకే పరిమితమవుతారని, అలాంటి సందర్భాల్లో పర్యటకులు కూడా బైసరన్ వంటి ఎత్తైన ప్రదేశాలకు వెళ్లరని ఆయన అన్నారు.బైసరన్ పార్క్ తెరవాలని కానీ, మూసివేయాలని కానీ పోలీసులు లేదా ఇతర భద్రతా సంస్థలు తమకు ఎప్పుడూ చెప్పలేదని ఈ అధికారి తెలిపారు.'సెక్యూరిటీ క్లియరెన్స్'గా చెబుతున్నట్లు, బైసరన్ వ్యాలీ తెరవడంపై పోలీసుల వైపు నుంచి తమతో ఎలాంటి సంప్రదింపులూ జరగలేదని ఆయన అన్నారు.గత ఏడాది అమర్‌నాథ్ యాత్ర సందర్భంగా, దాదాపు రెండునెలల పాటు బైసరన్ వ్యాలీని మూసివేసినట్లు అథారిటీకి చెందిన మరో అధికారి తెలిపారు. అయితే, దాని గురించి కూడా పోలీసులు తమతో ఎలాంటి సంప్రదింపులూ జరపలేదని ఆయన చెప్పారు.బైసరన్ వ్యాలీలో పోలీసులు లేదా భద్రతా సిబ్బంది ఎప్పుడూ లేరని ఈ అధికారి చెప్పారు. బైసరన్ వ్యాలీ ఏడాది పొడవునా తెరిచే ఉంటుందని ఆయన అన్నారు.బైసరన్ తెరవడానికి సంబంధించిన అనుమతుల గురించి గత మూడేళ్లలో ఎన్నడూ పోలీసులు తమ శాఖతో సంప్రదింపులు జరపలేదని ఆయన అన్నారు.ఈ విషయంలో తాను ఎలాంటి వ్యాఖ్యలూ చేయాలనుకోవడం లేదని మరో అధికారి అన్నారు.మీరు అడుగుతున్న ప్రశ్నలకు మేం సమాధానం చెప్పలేం, ఇది సున్నితమైన విషయమని ఆయన అన్నారు.మాట్లాడిన పహల్గాం డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులందరూ తమ పేర్లు బయటకు వెల్లడించొద్దని మాతో అన్నారు.మరోవైపు, బైసరన్ పార్క్ తెరిచేందుకు పోలీసుల నుంచి అనుమతి తీసుకోవడం లాంటిదేదీ లేదని ఒక సీనియర్ పోలీసు అధికారి అన్నారు. ఈ పోలీసు అధికారి ఐదేళ్ల కిందట ఒకసారి, ఏడాది కిందట మరోసారి అనంత్‌నాగ్‌లో పనిచేశారు.ఇప్పుడు ఆయన ఇక్కడ లేరు. ఇక్కడ పనిచేసిన సమయంలో బైసరన్ పార్క్ తెరిచేందుకు సెక్యూరిటీ క్లియరెన్స్ వంటి చర్చ ఏదైనా పహల్గాం డెవలప్‌మెంట్ అథారిటీతో జరిగిందా అని మేం ఆయన్ను అడిగాం. తాను పనిచేసిన సమయంలో అలాంటిదేమీ జరగలేదని ఆయన చెప్పారు.పహల్గాంలోని పోనీ స్టాండ్ నంబర్‌వన్ ప్రెసిడెంట్ బషీర్ అహ్మద్ వానీ మాట్లాడుతూ, ఈ దాడికి ముందు తమ స్టాండ్ నుంచి ప్రతిరోజూ గుర్రాలపై పర్యటకులను బైసరన్ పార్కుకు తీసుకెళ్లేవాళ్లమన్నారు.''బైసరన్‌లో టూరిస్టులపై దాడి జరిగిన రోజు మా స్టాండ్ నుంచి పది గుర్రాలు పర్యటకులను బైసరన్‌కు తీసుకెళ్లాయి. బైసరన్ వ్యాలీ ఎప్పుడూ మూతపడలేదు. ఈ ఏడాది ప్రారంభం నుంచి అక్కడికి పర్యటకులను తీసుకెళ్తున్నాం. మా స్టాండ్ నుంచి ప్రతిరోజూ యాభై గుర్రాలు బైసరన్ లోయకు వెళ్లేవి. నా జీవితంలో, బైసరన్ మూసేయడం 2024లో అమర్‌నాథ్ యాత్ర సమయంలో చూశా'' అని ఆయన అన్నారు''మా నాన్న కూడా గుర్రంపై పర్యటకులను తీసుకెళ్లేవారు. దశాబ్దాల కిందట పహల్గాంలో రెండు సైట్ సీన్‌లు (పర్యటక ప్రదేశాలు) మాత్రమే ఉండేవని ఆయన నాతో చెప్పేవారు. వాటిలో ఒకటి శికార్‌గా, మరొటి బైసరన్ వ్యాలీ. ఆ తర్వాత శికార్‌గా వరకూ రోడ్డు వేశారు. దీంతో అక్కడకు గుర్రపు స్వారీలు నడపడం మానేశారు.''ఇప్పుడు, పహల్గాంలో బైసరన్ వ్యాలీ సహా కనీసం ఏడు సైట్ సీన్‌లు ఉన్నాయి. గుర్రాలపై వెళ్లి చూసొచ్చే ప్రదేశాల గురించి ఇక్కడి స్థానికులు సైట్ సీన్ అనే పదాన్ని వాడతారు.మా తండ్రుల కాలం నుంచే బైసరన్ వ్యాలీ సందర్శన కోసం పర్యటకులు వచ్చేవారని బషీర్ అహ్మద్ చెప్పారు. కశ్మీర్‌లో తీవ్రవాదం మొదలుకాకముందు నుంచే పర్యటకులు, స్థానికులు బైసరన్ వ్యాలీకి వస్తుండేవారని అన్నారు.బషీర్ అహ్మద్ చెప్పిన దాని ప్రకారం, బైసరన్ వ్యాలీ చేరుకోవడానికి రెండు ట్రెక్ మార్గాలున్నాయి. ఒక ట్రెక్ మూడు కిలోమీటర్లు కాగా, మరొటి 6 కిలోమీటర్లు. ఒక ట్రెక్‌ను హిల్ పార్క్ అని, మరో దానిని సీఎం బేస్ రోడ్ అని పిలుస్తారు.ఏప్రిల్ 22కు ముందు తాము తీసిన బైసరన్ లోయ ఫోటోలు, వీడియోలు ఏవైనా ఉన్నా, వాటిని షేర్ చేయడానికి భయమేస్తోందని మరో గుర్రపు స్వారీ అసోసియేషన్‌కు చెందిన ఒకరు మాతో చెప్పారు.పరిస్థితులు సాధారణ స్థితికి వస్తే, మేం మీకు చాలా వీడియోలు చూపించగలమని ఆయన అన్నారు. బైసరన్ వ్యాలీ ఏడాది పొడవునా తెరిచే ఉంటుందని చెప్పడానికి ఆ వీడియోలు సరిపోతాయి.బైసరన్ వ్యాలీ తెరిచేందుకు పోలీసుల నుంచి అనుమతి తీసుకోలేదని దాడి జరిగిన కొద్దిరోజుల తర్వాత జరిగిన అఖిలపక్ష సమావేశంలో హోంమంత్రిత్వ శాఖ చెప్పినట్లు మీడియా రిపోర్టులు చెబుతున్నాయి.బైసరన్ వ్యాలీ ఎప్పుడైనా మూతపడిందా అని తెలుసుకోవడానికి పహల్గాంలో కనీసం పది మంది స్థానికులతో మాట్లాడింది. వాళ్లందరూ బైసరన్ మూసేయడం తామెప్పుడూ చూడలేదని చెప్పారు.బైసరన్ పార్క్ మూసేయడం తానెప్పుడూ చూడలేదని పేరు చెప్పేందుకు ఇష్టపడని స్థానికుడొకరు నాతో చెప్పారు. 2024లో, అమర్‌నాథ్ యాత్ర సమయంలో కేవలం 2 నెలలు మాత్రమే మూసివేసినట్లు ఆయన చెప్పారు. ఆ సమయంలో అక్కడ భద్రతా బలగాలను కూడా మోహరించారని ఆ వ్యక్తి నాతో అన్నారు.పహల్గాం బజార్ నుంచి బైసరన్ పార్క్ వెళ్లే దారి కఠినమైన కొండమార్గం. అక్కడికి గుర్రాలపైనా, లేదంటే కాలినడకన వెళతారు.బైసరన్ పార్క్ సముద్రమట్టానికి దాదాపు 8 వేల అడుగుల ఎత్తులో ఉంది. ఇది చుట్టూ దట్టమైన అడవులతో ఉండే లోయ ప్రాంతం. బైసరన్ లోయను మినీ స్విట్జర్లాండ్ అని కూడా పిలుస్తారు.బైసరన్ పార్క్‌లోకి వెళ్లేందుకు ఎంట్రీ టికెట్ కొనాల్సి ఉంటుంది. టికెట్ ధర పెద్దవాళ్లకు 35 రూపాయలు, చిన్నపిల్లలకు 20 రూపాయలు.పహల్గాం దక్షిణ కశ్మీర్‌లోని అనంత్‌నాగ్ జిల్లాలో ఒక భాగం. శ్రీనగర్ నుంచి పహల్గాంకి సుమారు 100 కిలోమీటర్ల దూరం.ఇక్కడ ఎన్నో బాలీవుడ్ సినిమాలు, నాటకాలు, షార్ట్ ఫిల్మ్స్ చిత్రీకరణ జరిగింది.ఏటా లక్షలాది మంది భక్తులు పహల్గాం మార్కెట్ మీదుగా అమర్‌నాథ్ యాత్రకు వెళతారు. ఈ యాత్ర బేస్‌క్యాంప్ పహల్గాంలోని నున్వాన్‌లో ఉంటుంది. ఈ బేస్‌క్యాంప్ నుంచి యాత్రికులు బృందాలుగా అమర్‌నాథ్ గుహకు వెళతారు.అమర్‌నాథ్ యాత్ర సమయంలో పహల్గాం నుంచి గుహ వరకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తారు. ఎత్తైన పర్వతాలపై భద్రతా దళాలను మోహరిస్తారు.




# రణ్ ఆఫ్ కచ్ఛ్‌లో తప్పిపోయి



గుజరాత్ రాష్ట్రంలోని కచ్ఛ్ లో ఇటీవల జరిగిన ఒక సంఘటన చర్చకు దారితీసింది. వాగడ్ ప్రాంతంలో ఉన్న రాపర్ తాలూకాలో గల బేలారణ్ ప్రాంతంలో సోలార్ పార్క్ ప్రాజెక్టుకు సంబంధించిన రోడ్డు నిర్మాణం కోసం ఒక ప్రైవేట్ కంపెనీ సర్వే నిర్వహిస్తోంది. ఈ సర్వే సమయంలో అర్నాబ్ పాల్ అనే కంపెనీ ఉద్యోగి కనిపించకుండా పోయారు.సరిహద్దు భద్రతాదళం, పోలీసులు డ్రోన్లు ఉపయోగించి పెద్ద ఎత్తున గాలించారు. ఐదురోజుల తర్వాత బేలా రణ్ లో ఆయన మృతదేహం దొరికింది.డీహైడ్రేషన్, తీవ్ర దాహం కారణంగా అర్నాబ్ మరణించినట్లు పోస్ట్ మార్టం నివేదిక వెల్లడించింది.దారి తప్పిపోవడం, నీరు అందుబాటులో లేకపోవడం వల్ల రణ్ ఆఫ్ కచ్ఛ్ లో ఇలా మనుషులు మరణించడం ఇదే తొలిసారి కాదు. రణ్ ప్రాంతంపై ప్రాథమిక అవగాహన లేకుండా సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే, అది తీవ్రమైన పరిణామాలకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.రణ్ ఆఫ్ కచ్ఛ్ లో ప్రజలు తరచుగా దారితప్పి మరణిస్తున్నారు. కచ్ఛ్ సంక్లిష్టమైన, విశాలమైన భౌగోళిక రూపం ఇటువంటి విషాదాలకు ఎలా కారణమవుతుందో అర్థం చేసుకోవడానికి గుజరాతీ ఆ ప్రాంత పరిశోధకులతో మాట్లాడింది.భారతదేశానికి పశ్చిమంగా 'రణ్ ఆఫ్ కచ్ఛ్' ఉంది, అంతేకాదు, పాకిస్తాన్ దక్షిణ, తూర్పు సరిహద్దును పంచుకుంటోంది.'రణ్ ఆఫ్ కచ్ఛ్'లో ఎక్కువ ఇసుక ఉండదు. గుజరాత్ విశ్వకోష్ (గుజరాతీ ఎన్‌సైక్లోపీడియా) ప్రకారం.. ఈ ప్రాంతం ఒకప్పుడు టెథిస్ సముద్రంలో భాగంగా ఉండేది, సాంబార్ సరస్సు వరకు ఇది విస్తరించి ఉండేది.గుజరాత్ వాయువ్య సరిహద్దులో సముద్ర మట్టానికి కొంచెం ఎత్తులో ఉన్న 'రణ్ ఆఫ్ కచ్ఛ్'ను భారత ఉపఖండంలో ఒక ప్రత్యేకమైన భూభాగంగా పరిగణిస్తుంటారు.ఇస్రో రిటైర్డ్ శాస్త్రవేత్త పి.ఎస్. ఠక్కర్ రణ్‌లో అనేక పురావస్తు ప్రదేశాలను కనుగొన్నారు. అక్కడ విస్తృతమైన పరిశోధనలు చేశారు."రణ్ ఆఫ్ కచ్ఛ్ ఇసుక ఎడారి కాదు. సముద్రం నుంచి ఉద్భవించిన ప్రత్యేకమైన ఎడారి. రణ్ ఆఫ్ కచ్ఛ్ రెండు భాగాలుగా ఉంది. గ్రేట్ రణ్, లిటిల్ రణ్. గ్రేట్ రణ్ దాదాపు 270 కి.మీ పొడవు, 50 నుంచి 90 కి.మీ వెడల్పు ఉంటుంది. లిటిల్ రణ్ దాదాపు 100 కి.మీ పొడవు, దాదాపు 70 కి.మీ వెడల్పు ఉంటుంది" అని తెలిపారు."కచ్ఛ్‌లో ఎక్కువ భాగం సముద్ర మట్టానికి దిగువన ఉంది. ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు, ఇది 30 సెం.మీ నుంచి 1 మీటర్ నీటితో నిండి ఉంటుంది. నవంబర్ నుంచి మార్చి వరకు నీటి మట్టం ఎక్కువగా ఉంటుంది" అని ఠక్కర్ తెలిపారు.విశాలమైన రణ్ ఆఫ్ కచ్ఛ్‌లో ప్రయాణించే వారికి దిశానిర్దేశం చేసే ల్యాండ్‌మార్క్‌లు లేకపోవడం వల్ల దారి తప్పుతున్నారు."చోరాద్, బేలా, ఖాదిర్, ఖావ్డా వంటి ప్రాంతాలలో మానవ నివాసాలు ఉన్నాయి. కానీ, రణ్‌లో ఉప్పు మైదానాలు తప్ప మొక్కలు, జంతువులు కనపడవు, కిలోమీటర్ల వరకు ఏమీ చూడలేరు. ఎడారిలో మెరుస్తూ ఉండే ఎండమావులు నీరులా కనిపించడంతో దిశలను అర్థం చేసుకోవడం కష్టం అవుతుంది" అని ఠక్కర్ అన్నారు."గ్రేట్ రణ్‌లో బీఎస్ఎఫ్ సైన్యం కోసం లింక్ రోడ్లు నిర్మించారు. ఈ రోడ్లను అనుసరిస్తే ఎటువంటి సమస్యా ఉండదు. అయితే, ఉప్పు మైదాన ప్రాంతాలలో ఎటువంటి సైన్‌పోస్టులు లేవు. దిక్సూచి లేకుండా దిశను తెలుసుకోవడం కష్టం. నెట్‌వర్క్ కవరేజ్ సరిగా లేకపోవడం వల్ల రణ్‌లోని చాలా ప్రాంతాలలో మొబైల్ ఫోన్‌లు కూడా పనిచేయవు. ఈ కఠినమైన పరిస్థితులు తరచుగా ప్రజలు దారి తప్పడానికి కారణమవుతాయి" అని ఆయన వివరించారు.కచ్ఛ్ ప్రాంతంలో చాలా సంవత్సరాలుగా రిపోర్టర్‌గా పనిచేస్తున్న, రణ్ ప్రాంతం గురించి బాగా తెలిసిన జర్నలిస్ట్ విపుల్ వైద్య ఈ విషయంతో ఏకీభవిస్తున్నారు."రణ్ ప్రాంతం విశాలంగా ఉండటం, ల్యాండ్‌మార్క్‌లు లేకపోవడంతో ప్రయాణికులకు సరైన దారి దొరకదు. చాలాచోట్ల మొబైల్ నెట్‌వర్క్‌లు పనిచేయవు, కాబట్టి దారి కోసం జీపీఎస్, ఫోన్‌లు ఎక్కువ ఉపయోగపడవు. బోర్డర్ ఏరియా డెవలప్‌మెంట్ స్కీమ్ కింద రోడ్లు నిర్మించినప్పటికీ, కమ్యూనికేషన్ పరిమితమే. మీరు ఎక్కడ ఉన్నారో ఖచ్చితంగా తెలియకపోవడం వల్ల మార్గనిర్దేశం చేయడం కష్టం అవుతుంది. అందుకే తప్పిపోయిన వ్యక్తిని కనుగొనడం కష్టం" అని అన్నారు విపుల్."ఇప్పుడు, ప్రధాన సరిహద్దు పోస్టుల వరకు రోడ్లున్నాయి. కానీ, 15 సంవత్సరాల కిందట ఇక్కడ రోడ్లే లేవు. బండ్లు లేదా జీపులు వెళ్లిన ట్రాక్‌లను ప్రజలు అనుసరించాల్సి వచ్చింది. ముందు వెళ్లిన వాహనం దారి తప్పితే, దానిని అనుసరించే ఇతరులు కూడా తప్పిపోతారు" అని విపుల్ చెప్పారు.కచ్ఛ్‌లో రాత్రిపూట కనిపించే చిర్‌బత్తీ అనే వెలుగుల (నీలం, నారింజ రంగు వెలుగులు) కారణంగా ప్రజలు తప్పుదారి పడతారు. ఈ లైట్ల శాస్త్రీయ వివరణ ఇప్పటికీ తెలియదు. గతంలో ఇక్కడ ప్రజలు ఎడ్ల బండ్లతో గుంపులుగా వెళ్లేవారని విపుల్ వైద్య తెలిపారు."రణ్ ఆఫ్ కచ్ఛ్‌లో దారి తప్పిపోవడం, నీరు లేకపోవడం వల్ల మరణిస్తున్నారు. కచ్ఛ్ మైదానాలు చదునుగా ఉంటాయి. కచ్ఛ్ మధ్యలో నిలబడి చూస్తే భూమి గుండ్రంగా ఉన్నట్లు కనిపిస్తుంది. ఇక్కడ దారి తప్పిన ప్రయాణికుడు నాలుగు దిక్కులు తెలియక వృత్తంలా తిరుగుతుంటాడు. ప్రయాణికుడు ముందుకే వెళుతున్నట్లు భావిస్తాడు కానీ, అర కిలోమీటరు వ్యాసార్థంలో తిరుగుతుంటాడు. చివరికి దాహంతో కింద పడతాడు" అని రణ్ ఆఫ్ కచ్ఛ్‌కు చెందిన జర్నలిస్ట్ అన్ను పటేల్ చెప్పారు.రణ్‌లో తప్పిపోయిన వ్యక్తులు అనుకోకుండా పాకిస్తాన్ భూభాగంలోకి ప్రవేశించిన సందర్భాలు చాలా ఉన్నాయి.జర్నలిస్ట్ విపుల్ వైద్య వివరిస్తూ "రణ్ ఆఫ్ కచ్ఛ్ విస్తారంగా ఉంటుంది. గ్రేట్, లిటిల్ రణ్ రెండింటిలోనూ ప్రజలు తప్పిపోయిన సంఘటనలు క్రమం తప్పకుండా జరుగుతున్నాయి. జనం ఉండే ప్రాంతాలు గ్రేట్ రణ్ నుంచి దాదాపు 50 కి.మీ దూరంలో ఉన్నాయి. బేలా సరిహద్దుకు సమీపంలో ఉన్న కొన్ని భాగాలకు ఇప్పటికీ ఫెన్సింగ్ లేదు. ఎవరైనా అక్కడ తప్పిపోతే, పాకిస్తాన్‌లోకి ప్రవేశించే ప్రమాదం ఉంది" అని అన్నారు.

# పాకిస్తాన్, చైనా స్నేహానికి కారణమేంటి?



పహల్గాం దాడి అనంతర పరిస్థితులపై చైనా విదేశీ వ్యవహారాల మంత్రి వాంగ్ యి, పాకిస్తాన్ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ల మధ్య ఆదివారం ఫోన్ సంభాషణ జరిగింది.భారత్, పాక్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతను చైనా నిశితంగా గమనిస్తోందని ఈ సందర్భంగా చైనా ప్రభుత్వ మీడియా పేర్కొంది.చైనా కమ్యూనిస్ట్ పార్టీ పత్రిక గ్లోబల్ టైమ్స్ కథనం ప్రకారం.. పహల్గాం దాడిపై వీలైనంత త్వరగా నిష్పాక్షిక దర్యాప్తు ప్రారంభించడానికి మద్దతు ఇస్తున్నట్లు చైనా తెలిపింది.ఈ విషయంలో రెండు దేశాలు సంయమనం పాటిస్తాయని చైనా ఆశిస్తోందని ఆ పత్రిక రాసింది.ఇంతకీ చైనా, పాకిస్తాన్ దేశాల మధ్య ఇంత దగ్గరి స్నేహం ఎక్కడిది? గతంలో రెండు దేశాల మధ్య సంబంధాలు ఎలా ఉండేవి? అసలు ఈ పహల్గాం ఘటనలో చైనా ఎలా స్పందించింది?ఏప్రిల్ 22న పహల్గాంలో జరిగిన దాడిలో 26 మంది మరణించారు.ఈ దాడిని ఖండిస్తూ చైనా ఒక ప్రకటన విడుదల చేసింది. ఉగ్రవాదాన్ని చైనా వ్యతిరేకిస్తుందని ఆ దేశ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి గువో జియాకున్ ప్రకటించారు.మరోవైపు ఈ దాడులపై పాకిస్తాన్ కూడా స్పందించింది. బాధ్యతాయుతమైన దేశంగా నిష్పాక్షికమైన, పారదర్శకమైన, విశ్వసనీయ దర్యాప్తునకు సిద్ధంగా ఉన్నట్లు పాకిస్తాన్ ప్రధాన మంత్రి షాబాజ్ షరీఫ్ శనివారం ప్రకటించారు.కానీ, భారత్, పాకిస్తాన్ లో రోజురోజుకీ పరిస్థితులు మారిపో

తున్నాయి.గ్లోబల్ టైమ్స్ మీడియా ప్రకారం.. పాకిస్తాన్‌లో ప్రస్తుత పరిస్థితుల గురించి చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యికి ఫోన్‌లో ఇషాక్ దార్ వివరించారు."ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో పాకిస్తాన్ దృఢంగా నిలబడుతుంది. ఉద్రిక్తతలను పెంచే ఏ చర్యలనైనా వ్యతిరేకిస్తుంది" అని ఇషాక్ దార్ అన్నారు.వాంగ్ యితో ఫోన్‌కాల్ సంభాషణ గురించి పాకిస్తాన్ విదేశీ వ్యవహారాల శాఖ ఎక్స్ వేదికగా వివరాలు వెల్లడించింది.ఆ పోస్టులో "పాకిస్తాన్ శాంతి, భద్రత, స్థిరమైన అభివృద్ధి అనే ఉమ్మడి లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రాంతీయంగా, అంతర్జాతీయంగా అన్ని స్థాయిలలో సన్నిహిత సంబంధాలు, సమన్వయాన్ని కొనసాగించడానికి వారు అంగీకరించారు" అని తెలిపింది."ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం అన్ని దేశాల బాధ్యత. పాకిస్తాన్ తీసుకునే ఉగ్రవాద వ్యతిరేక చర్యలకు చైనా మద్దతు ఉంటుంది" అని వాంగ్ యి అన్నారు."పాకిస్తాన్ భద్రతా సమస్యలను చైనా పూర్తిగా అర్థం చేసుకుంటుంది. పాక్ భద్రతా ప్రయోజనాలను కాపాడుకోవడానికి ఆ దేశం చేసే ప్రయత్నాలకు మద్దతిస్తుంది" అని ఆయన చెప్పారు.ఈ సందర్భంగా పహల్గాం దాడి ఘటనపై న్యాయమైన దర్యాప్తు జరగాలంటూ పాకిస్తాన్ చేసిన డిమాండ్‌కు మద్దతు ఇస్తున్నట్లు చైనా ప్రకటించింది.పహల్గాం దాడికి సంబంధించి పాకిస్తాన్‌పై భారత్ 'తప్పుడు ఆరోపణలు' చేసిందని పాక్ ప్రధాని షాబాజ్ షరీఫ్ శుక్రవారం అన్నారు."మా పొరుగు దేశం ఎటువంటి దర్యాప్తు, ఆధారాలు లేకుండా పాకిస్తాన్‌పై నిరాధార ఆరోపణలు చేసింది. న్యాయమైన, పారదర్శకమైన, విశ్వసనీయమైన దర్యాప్తులో సహకరించడానికి పాకిస్తాన్ సిద్ధంగా ఉంది" అని ఆయన అన్నారు."మేం శాంతిని కోరుకుంటాం, కానీ దానిని మా బలహీనతగా పరిగణించకూడదు" అని షాబాజ్ షరీఫ్ అన్నారు.పాకిస్తాన్ తన సార్వభౌమత్వాన్ని అన్ని విధాలుగా కాపాడుకుంటుందన్నారు. సరిహద్దులను కాపాడుకోవడానికి పాకిస్తాన్ సైన్యం సిద్ధంగా ఉందని, దీనిలో ఎటువంటి సందేహం లేదన్నారు షరీఫ్.పాకిస్తాన్, చైనాలు ప్రస్తుతం సన్నిహిత మిత్రులు. ఆర్థిక, రక్షణ రంగంలో పాకిస్తాన్‌కు చైనా సహాయం చేసింది. అంతర్జాతీయ స్థాయిలో కూడా రెండు దేశాల స్నేహం ప్రతిబింబిస్తుంటుంది. అయితే, ఈ స్నేహం గతంలో ఇంత సన్నిహితంగా లేదు.1956లో అప్పటి చైనా ప్రధానమంత్రి చౌ ఎన్ లై పాకిస్తాన్‌లో పర్యటించారు. ఆ పర్యటన చైనా, పాకిస్తాన్ దేశాల మధ్య బలమైన సంబంధాలకు నాంది పలికింది.అయితే, 1958లో పాకిస్తాన్‌లో సైనిక పాలన వచ్చింది. అప్పుడు చీఫ్ మార్షల్ లా అడ్మినిస్ట్రేటర్‌గా ఆర్మీ జనరల్ అయూబ్ ఖాన్ ఉన్నారు. చైనా విస్తరణ విధానంపై అయూబ్ ఖాన్ ఆందోళన వ్యక్తంచేశారు. దీంతో 1959లో అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూను కలిశారు అయూబ్ ఖాన్.ఆ ఏడాది ఏప్రిల్ 24న 'ఉమ్మడి రక్షణ ఒప్పందం'ను ప్రతిపాదించారు అయూబ్ ఖాన్. కానీ నెహ్రూ తిరస్కరించారు.1961లో జుల్ఫికర్ అలీ భుట్టో నేతృత్వంలోని పాకిస్తాన్ ప్రతినిధి బృందం ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో పాల్గొంది. ఆ సమయంలో చైనాకు మద్దతుగా సభలో ఒక తీర్మానం ప్రవేశపెట్టినపుడు పాక్ దానికి అనుకూలంగా ఓటు వేసింది. అప్పటి నుంచి చైనాకు పాకిస్తాన్ మద్దతుదారుగా ఉంటోంది.1962లో సరిహద్దు విషయంలో భారత్, చైనాల మధ్య యుద్ధం కూడా జరిగింది. చాలా సంవత్సరాలుగా ఇండియాతో ఉన్న ఈ ఉమ్మడి శత్రుత్వమే చైనా, పాక్ స్నేహానికి ప్రధాన కారణంగా పరిగణిస్తున్నారు.అయితే, వారి స్నేహానికి ఇది మాత్రమే కారణం కాదు. ఎందుకంటే, పాకిస్తాన్, అఫ్గానిస్తాన్‌లతో చైనాకు కీలక ప్రయోజనాలు ఉన్నాయి.భారత్‌కు వ్యతిరేకమైన విషయాలలో పాకిస్తాన్‌కు చైనా నిర్భయంగా మద్దతు ఇచ్చిందని అంతర్జాతీయ వ్యవహారాల నిపుణుడు ప్రొఫెసర్ హర్ష్ పంత్ 2021లో బీబీసీతో జరిగిన ఒక సంభాషణలో చెప్పారు.హర్ష్ పంత్ చెప్పిన ప్రకారం.. ఉగ్రవాద అంశంపై పాకిస్తాన్‌పై చర్యలు తీసుకోకుండా, ఎఫ్ఏటీఎఫ్ బ్లాక్‌లిస్టులో పడకుండా పాకిస్తాన్‌కు మద్దతునిచ్చింది చైనా.అంతేకాదు, కశ్మీర్ సమస్యను చైనా ద్వైపాక్షికంగా చూడొచ్చు కానీ, అలా చేయలేదు. పాకిస్తాన్‌లో చైనా ప్రతిష్టాత్మకమైన 'బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్' కింద నిర్మిస్తున్న వాణిజ్య నెట్‌వర్క్‌లో 'చైనా-పాకిస్తాన్ ఆర్థిక కారిడార్' లేదా సీపీఈసీ ఒక భాగం. ఈ ప్రాజెక్టు కింద పాకిస్తాన్‌లో అనేక నిర్మాణాలు జరుగుతున్నాయి. పాకిస్తాన్‌లో వేల కోట్ల డాలర్లను పెట్టుబడిగా పెట్టింది చైనా.పాకిస్తాన్‌ను చైనా ఆర్థికంగానూ ఆదుకుంది, పాక్ ఆర్థిక వ్యవస్థ పతనం అవుతున్నపుడు చైనా అప్పులిచ్చింది. చైనాలో వీగర్ ముస్లింల కోసం పాకిస్తాన్ ఎక్కువగా గొంతెత్తలేదు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) విస్తరించాలనుకున్నపుడు భారత్‌ను చేర్చుకోవాలని రష్యా సూచించగా, పాకిస్తాన్ పేరును ముందుకు తెచ్చింది చైనా.పాకిస్తాన్‌కే అత్యధికంగా చైనా ఆయుధాలుచైనా, పాకిస్తాన్ మధ్య సైనిక సహకారం కూడా ఉంది. పాకిస్తాన్ సైన్యం చైనాలో శిక్షణ పొందుతోంది. ఉమ్మడి సైనిక విన్యాసాలు చేస్తుంటారు.అణ్వాయుధాలు, యుద్ధనౌకలు, విమానాలు, క్షిపణులు వంటి సైనిక పరికరాలను తయారు చేయడంలోనూ పాకిస్తాన్‌కు సహాయం చేస్తుంది చైనా.పాకిస్తాన్ వార్తాపత్రిక ది ఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ ప్రకారం.. చైనా ఆయుధాలను అత్యధికంగా దిగుమతి చేసుకుంటున్న దేశం పాకిస్తాన్. 2000-14 కాలంలో చైనా మొత్తం ఆయుధ అమ్మకాలలో 42 శాతం పాకిస్తాన్ కొనుగోలు చేసిందని అమెరికన్ వెబ్‌సైట్ రాండ్ కార్పొరేషన్ చెప్పినట్లు పేర్కొంది.

# నేవీ ఆఫీసర్ భార్య హిమాన్షి కీలక వ్యాఖ్యలు

- పహల్గామ్ ఉగ్ర దాడిలో భర్తను కోల్పోయిన హిమాన్షి
- రక్తదాన శిబిరంలో ముస్లింలపై కీలక వ్యాఖ్యలు

**ఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రదాడిలో భర్తను కోల్పోయిన నేవీ ఆఫీసర్ వినయ్ నర్వాల్ భార్య హిమాన్షి కీలక వ్యాఖ్యలు చేశారు. వినయ్ నర్వాల్ గౌరవార్థం నేషనల్ ఇంటిగ్రేటెడ్ ఫోరమ్ ఆఫ్ ఆర్టిస్ట్స్ అండ్ యాక్టివిస్ట్స్ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి హిమాన్షి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ముస్లింలపై కీలక వ్యాఖ్యలు చేశారు. తనకు ముస్లింల పట్ల ఎలాంటి ద్వేషం లేదని ఆమె పేర్కొన్నారు. తనకు కాశ్మీరీల పట్ల గానీ.. ముస్లింల పట్ల గానీ ఎలాంటి ద్వేషం లేదని.. తాము శాంతిని మాత్రమే కోరుకుంటున్నట్లు చెప్పుకొచ్చారు. మత ఘర్షణలకు ముగింపు పలకాలని విజ్ఞప్తి చేస్తూ.. న్యాయం కోసం గట్టిగా డిమాండ్ చేశారు. ప్రస్తుతం దేశ ప్రజలంతా కోపంగా ఉన్నారని.. అయినా కూడా కాశ్మీరీలకు.. ముస్లింలకు వ్యతిరేకంగా ప్రజలు వెళ్లాలని తాను కోరుకోవడం లేదని.. కేవలం శాంతిని మాత్రమే కోరుకుంటున్నట్లు ఆమె స్పష్టం చేశారు. తన భర్త వినయ్ నర్వాల్ కూడా ఇదే కోరుకుంటారని ఆమె వ్యాఖ్యానించారు.గురుగ్రామ్ కు చెందిన హిమాన్షి పీహెచ్ డీ స్కాలర్. ఏప్రిల్ 16న నేవీ ఆఫీసర్ వినయ్ నర్వాల్ ను వివాహం చేసుకుంది. అనంతరం ఏప్రిల్ 19న గ్రాండ్ గా రిసెప్షన్ ఏర్పాటు చేశారు. అటు తర్వాత హనీమూన్ కోసమని విదేశాలకు వెళ్లాలని అనుకున్నారు. కానీ ప్లాన్ కుదరకపోవడంతో పహల్గామ్ టూర్ ప్లాన్ చేసుకున్నారు. ఏప్రిల్ 22న భర్తతో కలిసి సరదాగా గడుపుతున్న సమయంలో ఒక్కసారి ముష్కరులు తుపాకులతో విరుచుకుపడ్డారు. అంతే ఒక్కసారిగా తూటాలకు వినయ్ నర్వాల్ నేలకొరిగారు. అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. భర్త మృతదేహం దగ్గరే హిమాన్షి కుప్పకూలిపోయింది. తీవ్రంగా కన్నీటి పర్యాంతం అయింది. ఇందుకు సంబంధించిన ఫొటో సోషల్ మీడియాలో వైరల్ అయింది.ఇక వినయ్ నర్వాల్ కు హర్యానాలో సైనిక లాంఛనలతో అంత్యక్రియలు జరిగాయి. ముఖ్యమంత్రి సైనీతో పాటు కేంద్రమంత్రి ఖట్టర్, పలువురు నేతలు కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. ఇక ఢిల్లీ ఎయిర్ పోర్టులో ముఖ్యమంత్రి రేఖా గుప్తా నివాళులర్పించారు. అనంతరం హిమాన్షిని ఓదార్చారు. ఇక భర్త శవపేటికను కౌగిలించుకుని హిమాన్షి సెల్యూట్ చేసింది. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

# ఉగ్ర వేటలో భారత్‌కు సహకరించండి


- ఉగ్ర వేటలో భారత్‌కు సహకరించండి
- పాక్‌కు జేడీవాన్స్ సూచన



**అమెరికా :** పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత భారత్-పాకిస్థాన్ ల మధ్య చోటుచేసుకున్న ఉద్రిక్తతలపై అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ స్పందించారు. ప్రస్తుతం రెండు దేశాలు సంయమనం పాటించాలని కోరారు. ''స్పెషల్ రిపోర్ట్ విత్ బ్రెట్ బేయర్''కు ఇచ్చిన ఇంటర్వ్యూలో జేడీ వాన్స్ స్పందించారు. పాక్ కేంద్రంగా పని చేస్తున్న ఉగ్రవాదులను పట్టుకునేందుకు భారత్ కు పాకిస్థాన్ సహకరించాలని కోరారు. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరగకూడదని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు.జేడీ వాన్స్ కుటుంబం భారత్ లో పర్యటిస్తున్నప్పుడే పహల్గామ్ ఉగ్ర దాడి జరిగింది. ఈ దాడిని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, జేడీ వాన్స్ ఖండించారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేసే పోరాటంలో అమెరికా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తుందని జేడీ వాన్స్ భరోసానిచ్చారు.ఇక పహల్గామ్ ఉగ్ర దాడి తర్వాత పాకిస్థాన్ పై భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంది. సింధు జలాలు నిలిపివేసింది. వీసాలను రద్దు చేసింది. అటారీ సరిహద్దు మూసివేసింది. యూట్యూబ్ ఛానళ్లు నిలిపివేసింది. భారత్ గగనతలాన్ని మూసివేసింది. ఇలా ఒక్కొక్కటిగా భారత్ కఠిన నిర్ణయాలు తీసుకుంది. దీంతో పాకిస్థాన్ ఉక్కిరిబిక్కిరికి గురైంది. ఇదిలా ఉంటే ఉగ్రవాదలు కోసం ఎన్ ఐఏ వేట సాగిస్తోంది.

# తెరుచుకున్న కేదార్‌నాథ్ ఆలయ తలుపులు

- ఉత్తరాఖండ్ జిల్లాలోని రుద్ర ప్రయాగ్ జిల్లాలోని కేదార్‌నాథ్ ఆలయం తలుపు తెరుచుకున్నాయి
- ఈ కార్యక్రమానికి సీఎం పుష్కర్ సింగ్ దామి హాజరయ్యారు



**రుద్రప్రయాగ్ :** ఉత్తరాఖండ్ లోని కేదార్ నాథ్ దేవాలయం ద్వారాలు శుక్రవారం తెరుచుకున్నాయి. ఈ రోజు ఉదయం 7.00 గంటలకు వేద మంత్రోచ్చారణల మధ్య ఈ అలయం ద్వారాలను తెరిచారు.ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామీ హాజరయ్యారు. ఇక ఆలయాన్ని రకరకాల పువ్వులతో అందంగా అలంకరించారు. స్వామి వారిని దర్శించుకోనేందుకు భారీగా భక్తులు పోటెత్తారు. ఈ నేపథ్యంలో హెలికాప్టర్ ద్వారా భక్తులపై పూల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో బద్రీనాథ్, కేదార్ నాథ్ దేవాలయాల అధికారులు, కమిటీ సభ్యులు, పూజారులతోపాటు వేద పండితులు పాల్గొన్నారు.చార్ ధామ్ యాత్రలో భాగంగా అక్షయ తృతీయ సందర్భంగా గంగోత్రి, యమునోత్రిలను ఏప్రిల్ 30వ తేదీన తెరిచిన సంగతి తెలిసిందే. బద్రీనాథ్ దేవాలయం మాత్రం మే 4వ తేదీన తెరవనున్న సంగతి తెలిసిందే. అయితే కేదార్ నాథ్ యాత్ర కోసం సోన్ ప్రయాగ్ నుంచి హెలికాప్టర్ సేవలు ఇప్పటికే ప్రారంభమైనాయి. ఇక కేదార్ నాథ్ కు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా.. దేవాలయ అధికారుల తోపాటు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకున్నారు. ఇక జమ్మూ కశ్మీర్ లో ఉగ్రదాడి నేపథ్యంలో దేవాలయ పరిసర ప్రాంతాలలోనే కాకుండా.. పలు చోట్ల భద్రతను పెంచారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకొకుండా భారీగా భద్రతా బలగాలను మోహరించారు. కేదార్ నాథ్ దేవాలయం తలుపులు తెరుచుకోవడంతో.. చార్ దామ్ యాత్రా దాదాపుగా ప్రారంభమైనట్లు అయింది. బద్రీనాథ్ దేవాలయం తలుపులు మరికొద్ది రోజుల్లో తెరుచుకోనుంది. దీంతో మరి కొద్ది రోజుల్లో ఈ యాత్రకు లక్షలాది మంది భక్తులు పోటెత్తనున్నారు.

# ఢిల్లీలో వర్ష బీభత్సం

- నలుగురు మృతి
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక
- విమాన రాకపోకలకు అంతరాయం



**ఢిల్లీ :** దేశ రాజధాని ఢిల్లీలో శుక్రవారం తెల్లవారు జామున సృష్టించిన దుమ్ము తుఫాన్, భారీ వర్షానికి నగరం అతలాకుతలం అయింది. రహదారులపై నీళ్లు నిలిచిపోయాయి. ఇక భారీ ఈదురుగాలుల కారణంగా చెట్లు నేలకొరిగాయి. నజాఫ్ గఢ్ లో భారీ చెట్టు కూలడంతో నలుగురు చనిపోయారు. వీరంతా ఒకే కుటుంబానికి చెందిన వారిగా గుర్తించారు. 26 ఏళ్ల జ్యోతి అనే వివాహితతో పాటు ఆమె ముగ్గురు పిల్లలు మరణించారు. భర్త అజయ్ మాత్రం స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.ఇక విమాన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలోకి కూడా నీళ్లు వచ్చేశాయి. దాదాపు 100కి పైగా విమానాలు ఆలస్యం కానున్నట్లు విమాన సంస్థలు హెచ్చరించాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కనెక్టివిటీ విమాన ప్రయాణికులు మాత్రం మరింత ఇబ్బందులు పడుతున్నారు. ఇక ఢిల్లీ విమానాశ్రయంలో ల్యాండ్ కావాల్సిన రెండు విమానాలను జైపూర్ కు, ఒక విమానాన్ని అహ్మదాబాద్ కు మళ్లించినట్లు అధికారి తెలిపారు.ఇక ఢిల్లీలోని ద్వారక, ఖాన్ పూర్, సౌత్ ఎక్స్ టెన్షన్ రింగ్ రోడ్, మింటో రోడ్, లజ్ పత్ నగర్ మరియు మోతీ బాగ్ వంటి ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. ఇక భారీ ఈదురుగాలుల కారణంగా చెట్లు కూలిపోయాయి. కొన్ని కొమ్మలు రహదారులపై పడిపోయాయి. అయితే అధికారులు నష్టాన్ని అంచనా వేయలేదు. వీలైనంత వరకు ప్రజల్లో ఇళ్లల్లోనే ఉండాలని ప్రజలకు అధికారులు సూచించారు.ఇక భారత వాతావరణ శాఖ ఢిల్లీకి రెడ్ అలర్ట్ జారీ చేసింది. శనివారం వరకు తీవ్రమైన ఉరుములు, ఈదురుగాలులు వీస్తాయని వార్నింగ్ ఇచ్చింది. ఉత్తరప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, హిమాచల్ ప్రదేశ్ లోని కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. అసవరమైతే తప్ప బయటకు రావొద్దని ప్రజలకు అధికారులు సూచించారు.

# హత్య కేసులో ప్రధాన నిందితుడు మర్డర్

- హత్య కేసులో ప్రధాన నిందితుడు మర్డర్
- మంగళూరులో పోలీసుల హై అలర్ట్

**మంగళూరు :** మంగళూరులో రౌడీషీటర్ సుహాస్ శెట్టి హత్య తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. గురువారం రాత్రి స్నేహితులతో కలిసి కారులో వెళ్తుండగా దుండగులు అడ్డగించి హత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. దీంతో పోలీసులు అప్రమత్తమై.. మత ఘర్షణలు జరగకుండా హై అలర్ట్ ప్రకటించారు. భారీ బందోబస్త్ ఏర్పాటు చేశారు.మే 1న రాత్రి 8:30 గంటలకు సుహాస్ శెట్టి.. మరో ఐదుగురు స్నేహితులతో కలిసి బాజ్ పేలోని కిన్నికంబ్లాలో కారులో ప్రయాణిస్తున్నాడు. ఆరుగురు ప్రత్యర్థులు కారును అడ్డగించి.. కారులోంచి సుహాస్ శెట్టిని బయటకు లాగి విచక్షణారహితంగా కత్తులతో, రాళ్లతో దాడి చేశారు. ఇందుకు సంబంధించిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. హత్య తర్వాత స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారి తీసింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు ఘర్షణలు తలెత్తకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. హై అలర్ట్ ప్రకటించారు.మంగళూరు ఏడీజీపీ (లా అండ్ ఆర్డర్) ఆర్ హితేంద్ర మాట్లాడుతూ.. "నిన్న సాయంత్రం సుహాస్ శెట్టి అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. అనంతరం నగరంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అందుకు తగిన ఏర్పాట్లు చేశాం. పోస్ట్ మార్టం జరుగుతోంది. దహన సంస్కారాలకు ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. మంగళూరు పౌరులు శాంతిని కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. నిందితులను గుర్తించాం. పోలీస్ బృందాలు వారి కోసం గాలిస్తున్నాయి." అని తెలిపారు.మంగళూరు నగర పోలీసు కమిషనర్ అనుపమ్ అగర్వాల్ మాట్లాడుతూ.. "సంఘటన గురువారం రాత్రి 8.27 గంటల ప్రాంతంలో జరిగింది. సుహాస్ వాహనంలో సంజయ్, ప్రజ్వల్, అన్విత్, లతీష్, శశాంక్ తో కలిసి ప్రయాణిస్తుండగా ఐదు నుంచి ఆరుగురు వ్యక్తుల ముఠా వారిని అడ్డగించారు. దుండగులు సుహాస్ బయటకు లాగి కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఆసుపత్రికి తరలించారు కానీ కొద్దిసేపటికే మరణించారు." అని పేర్కొన్నారు.కర్ణాటక హోం మంత్రి జి. పరమేశ్వర మాట్లాడుతూ.. "నిందితులను పట్టుకోవడానికి నాలుగు బృందాలను ఏర్పాటు చేశాం. మేము ఎవరినీ వదిలిపెట్టము. ఎవరినీ వదిలిపెట్టే ప్రశ్నే లేదు. ఇది శాంతిభద్రతల వైఫల్యం కాదు. కర్ణాటకలో మేము శాంతిని కాపాడాము." అని ఆయన అన్నారు.బెంగళూరు ఎంపీ పీసీ మోహన్.. దాడికి సంబంధించిన వీడియోను షేర్ చేశారు. "మంగుళూరులో అనుమానిత జిహాదీ శక్తులు హిందూ కార్యకర్త సుహాస్ శెట్టిని దారుణంగా హత్య చేయడం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఇటువంటి హేయమైన చర్యలు కర్ణాటకలో క్షీణిస్తున్న శాంతిభద్రతలకు నిదర్శనం. నా ప్రార్థనలు ఆయన కుటుంబంతో ఉన్నాయి. ఓం శాంతి." అని పేర్కొన్నారు.సుహాస్ శెట్టిపై కనీసం ఐదు క్రిమినల్ కేసులు పెండింగ్ లో ఉన్నాయి. జూలై 2022లో బీజేపీ యువ మోర్చా నాయకుడు ప్రవీణ్ నెట్టారు హత్య జరిగిన కొద్ది రోజులకే సూరత్కల్ లో 23 ఏళ్ల యువకుడు ఫాజిల్ ను నరికి చంపిన కేసులో ప్రధాన నిందితుల్లో ఒకడిగా ఉన్నాడు. ఫాజిల్ హత్యకు ప్రతీకారంగానే ప్రస్తుతం ఈ హత్య జరిగినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి మంగళూరు గ్రామీణ పోలీస్ స్టేషన్ కు చెందిన ఇన్ స్పెక్టర్ శివకుమార్, హెడ్ కానిస్టేబుల్ చంద్ర పి, కానిస్టేబుల్ యల్లలింగలను సస్పెండ్ చేశారు.

# ఓటీటీ షోలో అసభ్య కంటెంట్

## ఎంపీ ప్రియాంక చతుర్వేది ఆగ్రహం

- 'హౌస్ అరెస్ట్' షో క్లిప్ వివాదం ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లలో కంటెంట్ నియంత్రణపై మరోసారి చర్చను రేకెత్తించింది
- ఈ అంశంపై ప్రియాంక చతుర్వేది, నిషికాంత్ దుబే వంటి నేతలు కూడా స్పందించారు



**ఢిల్లీ :** ఇటీవల ఒక ఓటీటీ (ఓవర్ ది టాప్) ప్లాట్ ఫామ్ లో ప్రసారమైన రియాలిటీ షో క్లిప్ సోషల్ మీడియాలో తీవ్ర వివాదానికి దారితీసింది. ఈ క్లిప్ లోని అసభ్య కంటెంట్ పై ప్రజలు, రాజకీయ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది ఈ ఓటీటీ యాప్ ను ఎందుకు నిషేధించలేదని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎంపీ నిషికాంత్ దుబే ఈ షోపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ వివాదం ఓటీటీ ప్లాట్ ఫామ్ లలో అసభ్య కంటెంట్ ను నియంత్రించాలన్న చర్చను మరింత ఉధృతం చేసింది.

**వివాదానికి కారణమైన క్లిప్**

ఈ వివాదం 'హౌస్ అరెస్ట్' అనే వెబ్ సిరీస్‌లోని ఒక క్లిప్‌తో మొదలైంది. ఈ షోను 'ఉల్లు' అనే ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో ప్రసారం చేస్తున్నారు. ఈ షోను మాజీ బిగ్ బాస్ కంటెస్టెంట్ అజాజ్ ఖాన్ నిర్వహిస్తున్నారు. ఈ క్లిప్‌లో అజాజ్ ఖాన్ ఒక కంటెస్టెంట్‌తో కామసూత్రలోని వివిధ సెక్స్ పొజిషన్‌ల గురించి ప్రస్తావించారు. ఆ తర్వాత మరికొందరు కంటెస్టెంట్‌లను ఆ పొజిషన్‌లను ప్రదర్శించమని అడిగారు. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దాదాపు రెండు నిమిషాల ఈ క్లిప్‌ను ప్రియాంక చతుర్వేది ఎక్స్ (ట్విట్టర్)లో షేర్ చేసి, ఇలాంటి అసభ్య కంటెంట్‌ను నియంత్రించాలని కేంద్రాన్ని కోరారు.

**ప్రియాంక చతుర్వేది ఆగ్రహం**

రాజ్యసభ ఎంపీ ప్రియాంక చతుర్వేది ఈ విషయంపై తీవ్రంగా స్పందించారు. ఉల్లు, ఆల్ట్ బాలాజీ వంటి ఓటీటీ యాప్‌లలో అసభ్య కంటెంట్ ఉందని తాను గతంలోనూ పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. అయితే, ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి సమాధానం రాలేదని ఆమె ఆరోపించారు. గత ఏడాది మార్చి 14న సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ (ఐబీ మినిస్ట్రీ) 18 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లను అసభ్య, అశ్లీల కంటెంట్ కారణంగా నిషేధించింది. అయితే, ఉల్లు, ఆల్ట్ బాలాజీ వంటి పెద్ద యాప్‌లను ఎందుకు నిషేధించలేదని ఆమె ప్రశ్నించారు. ఈ రెండు యాప్‌లను ఎందుకు వదిలేశారో ఐబీ మంత్రిత్వ శాఖ సమాధానం చెప్పాలన్నారు.

**బీజేపీ ఎంపీ, నాయకుల స్పందన**

ఈ క్లిప్‌పై బీజేపీ ఎంపీ నిషికాంత్ దుబే కూడా స్పందించారు. "ఇలాంటి కంటెంట్‌ను అనుమతించబోమన్నారు. మా కమిటీ ఈ విషయంపై చర్యలు తీసుకుంటుంది," అని ఆయన ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఐబీ మంత్రిత్వ శాఖను ట్యాగ్ చేస్తూ ఈ షోపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ యువ మోర్చా బీహార్ చీఫ్ బరుణ్ రాజ్ సింగ్ కూడా ఈ షోను వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. "ఇలాంటి షోలు టీవీలో చూపిస్తుంటే ఐబీ మంత్రిత్వ శాఖ నిద్రపోతోందా? మన పిల్లలను కాపాడాలని ఆయన సమాచార, ప్రసార మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కోరారు.

**సోషల్ మీడియాలో ఆగ్రహం**

ఈ క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ కావడంతో యూజర్లు తీవ్రంగా స్పందించారు. టీవీ షోలు ఇంత దిగజారిపోయాయా అని ఒక ఎక్స్ యూజర్ వ్యాఖ్యానించారు. ఇది ఎంటర్‌టైన్‌మెంట్ కాదన్నారు. నిర్మాతలు, దర్శకుల ఆలోచనలు ఏంటో అర్థం కావడం లేదని మరొకరు పేర్కొన్నారు.

# ప్రిలిమ్స్, మెయిన్స్‌కు వేర్వేరు హాల్ టికెట్లు ఎందుకిచ్చారు?

- అభ్యర్థుల లాగిన్ లో పలు మార్లు మార్కులు మారాయి
- హైకోర్టులో పిటిషనర్ల తరపు అడ్వకేట్ వాదనలు






**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** టీజీపీఎస్సీ జారీ చేసిన నోటిఫికేషన్ కు విరుద్ధంగా గ్రూప్ -1 మెయిన్స్ పరీక్షలను నిర్వహించారని పిటిషనర్ల తరపు న్యాయవాది హైకోర్టుకు నివేదించారు. వాల్యుయేషన్ లో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన నాలుగు పిటిషన్లపై జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు గురువారం విచారణ చేపట్టారు. పిటిషనర్ల తరపున సీనియర్ న్యాయవాది రచనా రెడ్డి వాదనలు వినిపిస్తూ.. గ్రూప్ -1 నోటిఫికేషన్ లో ప్రిలిమ్స్ కు, మెయిన్స్ కు వేర్వేరు హాల్ టికెట్లు జారీ చేస్తామని ఎక్కడా ప్రస్తావించలేదన్నారు. వెబ్ నోట్ లో కూడా ఈ విషయాన్ని ప్రస్తావించలేదన్నారు. వారంలో మెయిన్స్ జరుగుతాయనగా కొత్త నంబర్లతో హాల్ టికెట్లు జారీ అయ్యాయన్నారు. వరుసగా నంబర్లు కేటాయించడానికి సులభంగా ఉంటుందని టీజీపీఎస్సీ చెబుతున్న కారణం సహేతుకంగా లేదన్నారు. కేవలం కొంత మందికి లబ్ధి చేకూర్చడానికే మెయిన్స్ కు హాల్ టికెట్లు వేరుగా ఇచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించే యూపీపీఎస్సీ పరీక్షలకు లక్షల మంది హాజరైనా ఒకే హాల్ టికెట్ జారీ చేస్తున్నదన్నారు. కానీ తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్ వన్ పరీక్షలకు రెండు హాల్ టికెట్లు జారీ చేయడం అనుమానాలకు తావిస్తున్నదన్నారు.

**పది మంది అదనంగా ఎలా వచ్చారు?**

పరీక్షలకు హాజరైన అభ్యర్థుల సంఖ్యను ప్రకటించడంలోనూ సర్వీస్ కమిషన్ వేర్వేరు సందర్భాల్లో వేర్వేరు లెక్కలు చెప్పిందని రచనారెడ్డి పేర్కొన్నారు. గ్రూప్ 1 పరీక్షలు పూర్తికాగానే 21 వేల 75 మంది పరీక్షలు రాశారని చెప్పి, ఆ తర్వాత 21 వేల 85 మంది అని చెప్పడంపై అనుమానాలున్నాయన్నారు. ఈ పది మంది అదనంగా ఎలా వచ్చారన్నదానికి స్పష్టమైన వివరణ ఇవ్వట్లేదన్నారు. కోఠి ఉమెన్స్‌కాలేజీలో పురుషులకు టాయిలెట్స్ లేనందున వారి అభ్యర్థన మేరకు మహిళలనే కేటాయించామని టీజీపీఎస్సీ చెప్తోందన్నారు.అలాంటప్పుడు మిగిలిన మహిళా కాలేజీల్లో పురుషులు, స్త్రీలు కలిసి ఎలా పరీక్ష రాశారన్నారు. అక్కడ కేవలం మహిళలనే ఎందుకు కేటాయించలేదన్నారు. ఇటీవల జరిగిన యూపీఎస్సీ పరీక్షలను కోఠి ఉమెన్స్‌కాలేజీలో పెట్టారని, పురుషులు, మహిళలు ఇద్దరూ హాజరయ్యారన్నారు. ఈ కేటాయింపుల్లో గూడుపుఠాని ఉందని, అందుకే కోఠి మహిళా కాలేజీలోని 2 సెంటర్లలో పరీక్ష రాసిన మహిళలు ఎక్కువ మంది అర్హత సాధించారన్నారు. ముందు వెనుక కూర్చున్నవారికి, పక్కపక్కన ఉన్న నంబర్లకు ఒకే రకమైన మార్కులు రావడాన్ని బట్టి చూస్తే మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయని స్పష్టమవుతున్నదన్నారు.

**మార్కులు తగ్గడంపై వినతి పత్రం ఇస్తే కేసు పెట్టారు**

ఫలితాల వెల్లడిలోనూ అవకతవకలు జరిగాయని రచనా రెడ్డి కోర్టు దృష్టికి తెచ్చారు. వెబ్ సైట్ లో ప్రొవిజనల్ ఫలితాలను వెల్లడించలేదన్నారు. అభ్యర్థులు లాగిన్ అయి సబ్జెక్టుల వారీగా మార్కులు తెలుసుకోవాలని అన్నారని, అయితే ఈ మధ్య పలుమార్లు లోపల మార్కులు మారిపోయాయన్నారు. మార్కులు తగ్గడంపై వినతి పత్రం ఇస్తే నకిలీ అంటూ బెదిరించి క్రిమినల్ కేసు పెట్టారన్నారు. వాదనలు పూర్తికాకపోవడంతో న్యాయమూర్తి విచారణను శుక్రవారానికి వాయిదా వేస్తూ, వేల మంది అభ్యర్థులు నియామకాల కోసం ఎదురు చూస్తున్నారని, శుక్రవారంతో వాదనలను ముగించాలని న్యాయవాదులకు సూచించారు.

# అమెరికాలో 'మేడిన్ ఇండియా' ఐఫోన్లు!

- అమెరికా, చైనా మధ్య తీవ్రతరమవుతున్న వాణిజ్య ఉద్రిక్తతలు
- ప్రముఖ టెక్నాలజీ దిగ్గజం ఆపిల్ కీలక నిర్ణయం
- ఐఫోన్ల తయారీని భారత్‌కు తరలించాలని యోచిస్తోన్న కంపెనీ
- ఈ అంశంపై యాపిల్ సీఈఓ టిమ్ కుక్ కీలక ప్రకటన

**ఢిల్లీ :** ప్రముఖ టెక్నాలజీ దిగ్గజం ఆపిల్ సంస్థ కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. అమెరికా, చైనా మధ్య తీవ్రతరమవుతున్న వాణిజ్య ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా మార్కెట్ కోసం ఉద్దేశించిన ఐఫోన్ల తయారీని పూర్తిగా భారత్ కు తరలించాలని యోచిస్తోంది.భారత్ లో ఐఫోన్ల తయారీ కేంద్రంగా మార్చేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. అమెరికా మార్కెట్ కోసం అవసరమయ్యే ఐఫోన్లను భారత్ లో తయారు చేయాలని ప్రణాళికలు సిద్ధ చేస్తోంది. తాజాగా ఈ అంశాలపై యాపిల్ సీఈఓ టిమ్ కుక్ స్పందించారు.అమెరికా మార్కెట్ లో అవసరమయ్యే సగం ఐఫోన్లను భారత్ లోనే తయారు చేస్తామని టిమ్ కుక్ ప్రకటించారు. దీనికి గల బలమైన కారణాన్ని ఆయన వెల్లడించారు. చైనాతో పోలిస్తే భారత్ పై అమెరికా తక్కువ సుంకాలు విధించిందని వెల్లడించారు. అందుకే ఈ ఐఫోన్లు ఇక్కడ తయారు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే యాపిల్ ఇతర ఉత్పత్తులను వియత్నాంలో తయారు చేస్తున్నామని సీఈఓ చెప్పుకొచ్చారు. అమెరికాలో భారీ సంఖ్యలో విక్రయించబోయే ఐఫోన్లకు భారత్ కీలక తయారీ కేంద్రంగా అవుతుందని స్పష్టం చేశారు. రానున్న రోజుల్లో అమెరికా సుంకాలపై ఎలాంటి చర్యలు తీసుకునే అవకాశం ఉందో తెలియదన్నారు. దీంతో సుంకాల ప్రభావాన్ని కచ్చితంగా అంచనా వేయలేకపోతున్నామని స్పష్టం చేశారు. యాపిల్ త్రైమాసిక ఫలితాలు విడుదల సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థికశక్తులైన అమెరికా, చైనాల మధ్య పరస్పర సుంకాల నేపథ్యంలో వాణిజ్య యుద్ధం రాజుకుంది. టారిఫ్ ల విషయంలో ఇరుదేశాలు తగ్గేదే లేదన్నట్లు వ్యవహరిస్తున్నాయి. ఈక్రమంలో అమెరికా సుంకాలకు భయపడి యాపిల్ ఇప్పుడు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తోంది. అందుకే అమెరికా మార్కెట్లో విక్రయించే ఐఫోన్లను భారత్ లో తయారు చేసి తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.

# వీర రాఘవరెడ్డిపై దాడి

- మరొకసారి దాడికి గురైన వీర రాఘవరెడ్డి
- మొయినాబాద్ వద్ద ఘటన
- మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో వీర రాఘవరెడ్డి ఫిర్యాదు



**రంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** గతంలో రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ పై దాడి చేసి సంచలనం సృష్టించిన కొవ్వూరి వీర రాఘవరెడ్డి తాజాగా మరోసారి దాడికి గురయ్యాడు. గురువారం (మే 1, 2025) కండిషన్ బెయిల్ పై మొయినాబాద్ పోలీస్ స్టేషన్ కు వెళ్లి వస్తుండగా దాదాపు 20 మంది గుర్తు తెలియని వ్యక్తులు అతడిపై దాడికి పాల్పడ్డారు. పోలీస్ స్టేషన్ లో సంతకం చేసి తిరిగి వస్తున్న వీర రాఘవరెడ్డి ఓ టీ స్టాల్ వద్ద ఆగగా, అక్కడికి చేరుకున్న దుండగులు ఒక్కసారిగా అతడిపై దాడి చేశారు. ఈ దాడిలో వీర రాఘవరెడ్డికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి అడ్డుకోవడంతో దాడి చేసిన వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం వీర రాఘవరెడ్డి మొయినాబాద్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశాడు.అయితే.. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరానికి చెందిన కొవ్వూరి వీర రాఘవరెడ్డి 'రామరాజ్యం' పేరుతో ఒక ప్రైవేట్ సైన్యాన్ని నడుపుతున్నాడు. దేశంలో రామరాజ్యం స్థాపించాలనే లక్ష్యంతో అతడు ప్రచారం చేస్తున్నాడు. అయితే.. కేవలం పదో తరగతి పాసైన, ఫెయిలైన యువకులను తన సైన్యంలోకి రిక్రూట్ చేసుకుంటున్నాడు. ఈ సైన్యంలో చేరడానికి 5 కిలోమీటర్లు నడవగలగడం, 2 కిలోమీటర్లు పరిగెత్తగలగడం, 20 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండటం వంటి అర్హతలు ఉన్నాయి. ఒక్కొక్కరికి నెలకు రూ. 20 వేల జీతం కూడా ఇస్తున్నట్లు తెలుస్తోంది.వీర రాఘవరెడ్డి యువతను తన సైన్యంలో చేర్చుకుని వారితో దౌర్జన్యాలకు పాల్పడుతున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో చిలుకూరు బాలాజీ అర్చకుడు రంగరాజన్ ను తన రామరాజ్యం సైన్యంలో చేరాలని ఒత్తిడి చేశాడు. ఆయన నిరాకరించడంతో తన ప్రైవేట్ సైన్యంతో అర్చకుడి ఇంటిపై తన సైన్యంతో దాడికి దిగాడు. అంతేకాకుండా ఆయన కుమారుడిని కూడా కొట్టించాడని ఆరోపణలు ఉన్నాయి. అంతకుముందు హైదరాబాద్ లోని అబిడ్స్ లో కూడా వీర రాఘవరెడ్డిపై దాడి కేసు నమోదైంది. తాజాగా తనపై జరిగిన దాడిపై వీర రాఘవరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోంది. గతంలో అతడిపై ఉన్న ఆరోపణలు, తాజాగా జరిగిన దాడి నేపథ్యంలో పోలీసులు మరింత లోతుగా విచారణ జరిపే అవకాశం ఉంది.

# బీజేపీ మండల అధ్యక్ష పదవికి పోటాపోటీ..

**ఎల్లారెడ్డిపేట ,ఫ్లాష్ ఇండియా :** ఎల్లారెడ్డిపేట మండల బీజేపీ అధ్యక్ష పదవికి ఆసక్తికరమైన పోటీ నెలకొంది. అధ్యక్ష స్థానానికి ఏకంగా 22 మంది బీజేపీ నాయకులు పోటీలో ఉన్నారు. ఇటీవల అధ్యక్ష పదవికి నామినేషన్ల కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి ఎన్నికలకు ఎన్నికల పరిశీలకులుగా సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ ఆడేపు రవీందర్ నామినేషన్లు స్వీకరించారు. ప్రస్తుతం పార్టీ మండల అధ్యక్షులుగా ఇదే మండలం వెంకటాపూర్ కు చెందిన పొన్నాల తిరుపతి రెడ్డి అధ్యక్షుడిగా కొనసాగుతున్నాడు. గత పది సంవత్సరాల క్రితం నుంచి పార్టీ పగ్గాలు జనరల్ స్థానానికి కేటాయించారు. అప్పట్లో పార్టీ మండల అధ్యక్షుడుగా తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పట్టూరి రాజేశం గుప్తా, పదిర గ్రామానికి చెందిన మద్దుల బుగ్గారెడ్డి కొనసాగగా ప్రస్తుత మండల అధ్యక్షులుగా వెంకటాపూర్ గ్రామానికి చెందిన పొన్నాల తిరుపతి రెడ్డి కొనసాగుతున్నారు. ఇలా గడిచిన పది సంవత్సరాల క్రితం నుండి జనరల్ సామాజిక వర్గానికి చెందిన వారు అధ్యక్ష పదవిలో కొనసాగారు. కానీ బీసీ, ఎస్సీ సామాజిక వర్గానికి పార్టీలో ప్రాధాన్యత లేదని రాష్ట్ర, జిల్లా స్థాయి పార్టీ నాయకుల ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. అయిన బీసీ, ఎస్సీ, ఎస్టీలకు నాయకత్వ పగ్గాలు అప్పగించలేదు. కానీ రెండు దఫాలుగా జరిగిన పార్లమెంట్ సాధారణ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి బండి సంజయ్ కుమార్ ను ఎంపీగా గెలిపించి ఎల్లారెడ్డి పేట మండల బీజేపీ నాయకులు గుర్తింపు సాధించారు.మండల బీజేపీ అధ్యక్ష పదవికి పోటీ ఈ సారి బీసీ సామాజిక వర్గానికి చెందిన వారు మండల అధ్యక్ష పదవి దక్కించుకోవాలని గట్టి ప్రయత్నాలు మొదలు పెట్టారు. అదే విధంగా జనరల్ సామాజిక వర్గానికి చెందిన వారు కూడా అదే స్థాయిలో మంతనాలు జరుపుతున్నారు. బీసీ సామాజిక వర్గం నుంచి రేసులో ఉన్నది వీరే. బీసీ సామాజిక వర్గం నుంచి గతంలో పదిర గ్రామానికి చెందిన కంచర్ల పర్శరాములు మండల అధ్యక్షుడుగా బీసీ సామాజిక వర్గం నుండి సుమారు పది సంవత్సరాల క్రితం పనిచేశారు. అప్పటి నుంచి జనరల్ సామాజిక వర్గం వారికి తప్ప మిగితా సామాజిక వర్గాల వారికి అధ్యక్ష హోదాలో పనిచేసే అవకాశం దక్కలేదు మండలంలోని నారాయణపూర్ కు చెందిన బొల్గం శ్రీనివాస్ గౌడ్, ఇదే గ్రామానికి చెందిన బొమ్మెడ శ్రీనివాస్, అల్మాస్ పూర్ కు చెందిన సింగరవేని కృష్ణ యాదవ్, ఎల్లారెడ్డిపేటకు చెందిన నంది నరేష్, దుమాలకు చెందిన మానుక కుమార్ యాదవ్ గొల్లపల్లికి చెందిన దాసరి గణేష్, పదిరకు చెందిన బోనాల సాయి కుమార్, ఎల్లారెడ్డిపేటకు చెందిన మానుక రాజు యాదవ్, బండలింగంపల్లికి చెందిన కొత్తపల్లి ఆంజనేయులు, రేసులో ఉన్నారు.జనరల్ సామాజిక వర్గం నుండి ఎల్లారెడ్డి పేటకు చెందిన బందారపు లక్ష్మారెడ్డి ,పదిరకు చెందిన రేపాక రామచంద్రారెడ్డి, ఎల్లారెడ్డిపేటకు చెందిన ఒకే కుటుంబానికి చెందిన చందుపట్ల లక్ష్మ రెడ్డి, చందుపట్ల రాజిరెడ్డి, గొల్లపల్లికి చెందిన వంగల రాజు మాజీ మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతి రెడ్డి సైతం అధ్యక్ష స్థానాన్ని ఆశిస్తున్నారు.ఎస్సీ సామాజిక వర్గం నుండి నారాయణ పూర్ కు చెందిన మంతుర్తి శ్రీనివాస్, రాజన్న పేటకు చెందిన ఉడుగుల యాదగిరి, ఎల్లారెడ్డిపేటకు చెందిన బురుక వేణు బరిలో ఉన్నారు.బీజేపీ సోషల్ మీడియా జిల్లా ఇంచార్జీ ఎల్లారెడ్డి పేటకు చెందిన మాలోత్ సాయి కిరణ్ నాయక్, గుండారంకు చెందిన రవి నాయక్ ఉన్నారు. కాగా బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బీసీ సామాజిక వర్గం నుంచి ఎన్నికైన సిరిసిల్ల పట్టణానికి చెందిన రెడ్డబోయిన గోపి బీసీ సామాజిక వర్గంకు చెందిన వారుకాగా మరి బీసీ సామాజిక వర్గానికా, జనరల్ సామాజిక వర్గానికా ? ఎస్సీ సామాజిక వర్గానికా ? అధ్యక్ష పదవి అనేది తీవ్ర ఉత్కంఠ లేపుతుంది.బీజేపీ మండల అధ్యక్ష పదవి ఎన్నికల కోసం రాష్ట్ర నాయకత్వం కోర్ కమిటీ ఏర్పాటు చేశారు. ఇందులో సభ్యులుగా పార్టీ జిల్లా అధ్యక్షుడు రెడ్డి బోయిన గోపి, పార్టీ మాజీ జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ, ముస్తాబాద్ కు చెందిన మాజీ జడ్పీటీసీ మట్ట వేంకటేశ్వర రెడ్డి, ఇదే మండలంకు చెందిన మెరుగు హన్మంతు గౌడ్, వేములవాడకు చెందిన రేగుల మల్లిఖార్జున్ లు కోర్ కమిటీ సభ్యులుగా ఉన్నారు. ఈ కోర్ కమిటీ సభ్యులు అన్ని సామాజిక వర్గాలను పరిగణనలోకి తీసుకుని మండల అధ్యక్షుడిని ఎన్నుకుంటారో, లేక పోటీలో ఉన్న సభ్యుల పై ఏకాభిప్రాయంతో అధ్యక్ష పదవి ఎన్నుకుంటారో చూడాలి. ఒకవేళ కోర్ కమిటీ సభ్యులు తీసుకున్న నిర్ణయం కుదరక, ఏకాభిప్రాయం కుదరకపోతే కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీసుకునే నిర్ణయం ఫైనల్ కానున్నట్లు సమాచారం.

## డ్రోన్‌ల ఎగరవేతపై నిషేధం

- మే 4 నుంచి జూన్ 2 వరకు అమలు
- ఆదేశాలు జారీ చేసిన సీపీ అవినాష్ మహంతి

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** నగరంలో ప్రపంచ మిస్ వరల్డ్ పోటీలు జరుగుతున్న నేపథ్యంలో భద్రతా చర్యల్లో భాగంగా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డ్రోన్ ల ఎగరవేతపై నిషేధం విధిస్తూ కమిషనర్ అవినాష్ మహంతి గురువారం ఆదేశాలు జారీ చేశారు.మే 4వ తేదీ నుంచి జూన్ 2వ తేదీ వరకు సైబరాబాద్ పరిధిలోని హైటెక్స్ మాదాపూర్, ఆర్‌జీఐ ఎయిర్‌పోర్టు శంషాబాద్, గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం, చిలుకూరు ఎకో పార్కు, టీ హబ్, శిల్పారామం, శిల్ప కళావేదిక, ట్రైడెంట్ హోటల్, హైటెక్ సిటీ ప్రాంతాల్లో రిమోట్ కంట్రోల్డ్ డ్రోన్స్‌తో పాటు పారా గ్లైడర్స్, మైక్రోలైట్ ఎయిర్ క్రాఫ్ట్‌లను 100 మీటర్ల కంటే తక్కువ ఎత్తులో ఎగరడం నిషేధం అమల్లో ఉంటుందని తెలిపారు.

## హీరో విజయ్ పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

- గిరిజన జాతిని అవమానించారని ఆరోపించిన లాయర్ కిషన్‌రాజ్ చౌహాన్



**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** సినీ నటుడు విజయ్ దేవరకొండ ఇటీవల చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. గత నెల 26న జరిగిన తమిళ హీరో సూర్య నటించిన 'రెట్రో' మూవీ ప్రీ రిలీజ్ ఈవెంట్ లో విజయ్ దేవరకొండ మాట్లాడారు. ఆ మూవీ ఈవెంట్ లో విజయ్ దేవరకొండ ఆదివాసులను అవమానించేలా మాట్లాడారని ట్రైబల్స్ లాయర్స్ అసోసియేషన్ బాపూనగర్ అధ్యక్షుడు కిషన్ రాజ్ చౌహాన్ ఆరోపించారు. హైదరాబాద్ లోని ఎస్ ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. గిరిజనులను అవమానించేలా మాట్లాడడం దారుణమని, విజయ్ దేవరకొండపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

# లింగంపల్లి నుండి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బస్సులు

- లింగంపల్లి నుంచి శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు ఆర్టీసీ బస్సు
- విమాన ప్రయాణం చేయాలంటే నానా ఇబ్బందులు పడాల్సి వచ్చేది
- లింగంపల్లిలో రైల్వేస్టేషన్ కూడా ఇటు రైల్వే, అటు విమాన ప్రయాణానికి వీలుగా ఆర్టీసీ సిటీబస్సులను ఏర్పాటు




**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** విదేశాలు, ఇతర రాష్ట్రాలకు విమానంలో వెళ్లే ప్రయాణికుల కోసం శంషాబాద్ లోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు టీజీఎస్ ఆర్టీసీ బస్ ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్ టీసీ పుష్పక్ ఏసీ బస్సులను నడుపుతోంది. ఈ బస్సులు లింగంపల్లి ప్రధాన బస్టాండ్ నుండి ప్రతీ రోజు ఉదయం 5.45 నుండి రాత్రి 10.30 వరకు ఉంటాయి. పుష్పక్ బస్సుల రాకపోకల వేళలు.

**లింగంపల్లి బస్టాండ్ నుండి..**

తెల్లవారుజామున 5.45 ఉదయం - 6.35, 7.25, 8.15, 9.05, 9.55, 10.45, 11.35. మధ్యాహ్నం - 14.55, 15.45, సాయంత్రం - 16.35, 17.25, 18.15.,రాత్రి - 19.05, 19.55, 2045.

**విమానాశ్రయం నుండి లింగంపల్లికి వచ్చే బస్సుల వేళలు**

ఉదయం - 7.30, 8.20, 9.10, 10.00, 10.50, 11.40.,మధ్యాహ్నం - 12.30, 13.20., సాయంత్రం - 16.40, 17.30, 18.20,రాత్రి - 20.00, 20.50, 21.40, 22.30.

# దోస్త్ నోటిఫికేషన్ విడుదల..

- తెలంగాణలో డిగ్రీ ప్రవేశాలకు దోస్త్ 2025 నోటిఫికేషన్ విడుదల
- మూడు విడతల్లో అడ్మిషన్లు మొదటి దశకు ఈ నెల 3 నుంచి దరఖాస్తులు
- బకెట్ సిస్టమ్, రిజర్వేషన్లతో ఈసారి ప్రవేశ ప్రక్రియ




**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలోని డిగ్రీ కళాశాలల్లో చేరాలనుకునే విద్యార్థులకు శుభవార్త! ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాల కృష్ణ రెడ్డి , కళాశాల విద్యా శాఖ కమిషనర్ శ్రీ దేవ సేన సంయుక్తంగా డిగ్రీ ఆన్ లైన్ అడ్మిషన్స్ (దోస్త్) 2025-26 నోటిఫికేషన్ ను విడుదల చేశారు. దీంతో రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించేందుకు మార్గం సుగమం కానుంది. ఈ సందర్భంగా చైర్మన్ బాల కృష్ణ రెడ్డి మాట్లాడుతూ, ఈసారి మూడు విడతల్లో అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. మొదటి దశ అడ్మిషన్ల కోసం ఈ నెల 3వ తేదీ నుండి 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని వెల్లడించారు.ఆ తర్వాత, ఈ నెల 10వ తేదీ నుండి 22వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు అందుబాటులో ఉంటాయి. విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలలు, కోర్సులను ఈ సమయంలో ఎంచుకోవచ్చు. మొదటి దశ సీట్ల కేటాయింపు మే 29న జరుగుతుంది. ఇక, మొదటి సెమిస్టర్ తరగతులు జూన్ 30వ తేదీ నుండి ప్రారంభం కానున్నాయి. రాష్ట్రంలో మొత్తం 1057 డిగ్రీ కళాశాలలు ఉండగా, వీటిలో 987 కళాశాలలు దోస్త్ పరిధిలోకి వస్తాయి. మిగిలిన 70 కళాశాలలు ఈ ప్రక్రియలో పాల్గొనవు. ఈసారి ప్రవేశాల ప్రక్రియలో బకెట్ సిస్టమ్ ఉంటుందని చైర్మన్ తెలిపారు. అంతేకాకుండా, ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన ఉత్తర్వుల ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయబడతాయి. రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో మొత్తం 4,67,456 సీట్లు అందుబాటులో ఉన్నాయని అధికారులు వెల్లడించారు.

## రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్రంలో ఎండలు దంచికొడుతున్నాయి. రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. గత కొద్ది రోజులుగా సాధారణ ఉష్ణోగ్రతల కంటే10డిగ్రీల అత్యధికంగా నమోదు అవుతున్నాయి. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ, తూర్పు తెలంగాణలో భారీగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి.శనివారం ( మే2) ఆదిలాబాద్ జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలో బేల మండంలో చాప్రాల గ్రామంలో 45.2 డిగ్రీల ఉష్ణోగ్రత రికార్డయ్యింది. తెలంగాణలోని మిగతా ప్రాంతాల్లో దాదాపు అదే ఉష్ణోగ్రతలు ఉన్నాయి. మరోవైపు శనివారం సాయంత్రి తెలంగాణలోని పలు ప్రాంతాల్లో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తుంది. ముఖ్యంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ములుగు, భూపాలపల్లి , వరంగల్, హనుమకొండ, జనగాం, సూర్యాపేట, నల్లగొండ జిల్లాల్లో ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడే ఛాన్స్ ఉందని ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్ రూరల్, ఖమ్మం జిల్లాలో కూడా ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని ఎల్లో అలెర్ట్ ప్రకటించింది. ఐఎండీ. ఈ జిల్లాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

## బస్సు ఆపలేదని 10 కి.మీ చేజ్

**హైదరాబాద్ ,ఫ్లాష్ ఇండియా :** మహాలక్ష్మి పథకం అమలు తర్వాత ఆర్టీసీ బస్సుల్లో గొడవల వ్యవహారం రోజుకో చోట వార్తల్లో నిలుస్తోంది. తాను బస్సు ఎక్కేందుకు ప్రయత్నిస్తుండగా ఆపకుండా వెళ్లిపోయారని తాజాగా ఓ మహిళ 10 కిలోమీటర్లు చేజ్ చేసి బస్సు డ్రైవర్, కండక్టర్ తో వాగ్వాదానికి దిగింది. ఉప్పల్ ఎక్స్ రోడ్డు వద్ద చోటు చేసుకున్న ఈ ఘటనపై సంబంధించిన వీడియో ప్రస్తుతం వైరల్ గా మారింది. తాను ప్రతి రోజు ఉప్పల్ ఎక్స్ రోడ్డు వద్ద బస్సు ఎక్కుతానని ఎప్పటిలాగే ఇవాళ కూడా తనతో పాటు తన పిల్లతో కలిసి బస్సు ఎక్కేందుకు వచ్చానని ఓ మహిళ ఆరోపించింది. దిగేవాళ్లు దిగుతుండగానే కొందరు బస్సు ఎక్కారని, తాను కూడా బస్సు ఎక్కాను. తన పిల్లలు ఎక్కుతుండగా బస్సు వెళ్లిపోయిందని ఆరోపించారు. తన పిల్లలు ఎక్కలేదని చెప్పినా ఆపకుండా బస్సు కదిలిందని దాంతో నేను తన పిల్లల కోసం దిగే క్రమంలో బస్సు నుంచి కింద పడితే తననే తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. అయితే ఈ ఘటనపై కండక్టర్ మాట్లాడుతూ బస్సు కదిరిన తర్వాత ఆమె కిందకు దిగే ప్రయత్నం చేసిందని అదృష్టం బాగుండటం వల్ల బస్సు చక్రాల కింద పడలేదని చెప్పింది. ప్రస్తుతం ఈ వీడియో వైరల్ గా మారింది.

# ఫిల్మ్ నగర్‌లో భూ ఆక్రమణలు

- కొంతమంది అక్రమార్కులు ఫిల్మ్ నగర్ భూమిని ఆక్రమించారని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి ఫిర్యాదులు
- ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఫిర్యాదు చేశారు.

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** షేక్ పేట్ మండలం ఫిల్మ్ నగర్ లో భూ ఆక్రమణలపై హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి ఇవాళ(శుక్రవారం) ఫిర్యాదు అందింది. దీన్ దయాళ్ నగర్ లోని 2 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంతమంది ఆక్రమించారని మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి ఫిర్యాదు చేశారు. పలుమార్లు అధికారులను కంపౌండ్ వాల్ నిర్మాణం కోసం కోరినప్పటికీ స్పందించకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై అధికారులకు వెంటనే ఆదేశాలు ఇవ్వాలని చింతల రామచంద్రారెడ్డి కోరారు. సంబంధిత అధికారులు వెంటనే స్థలాన్ని పరిశీలించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ అనుదీప్ ఆదేశించారు. ఆక్రమణలు నివారించేందుకు జీహెచ్ఎంసీ ల్యాండ్స్ బోర్డు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. అక్రమార్కులపై కేసులు నమోదు చేయాలని కలెక్టర్ అనుదీప్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

**ఇళ్ల నిర్మాణంపై చర్చ:**

రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ నియోజకవర్గానికి 4,000 ఇళ్లు మంజూరు చేస్తామని ప్రకటించిందని చింతల రామచంద్రారెడ్డి గుర్తు చేశారు. హౌసింగ్ ప్రాజెక్టులపై ప్రణాళిక ఏమైనా రూపొందించారా అని కలెక్టర్ అనుదీప్ ను చింతల రామచంద్రారెడ్డి ప్రశ్నించారు. రూరల్ ఏరియాల్లో స్థలం ఉన్న వారు ఉంటే వారికి రూ. 5 లక్షల చొప్పున ఇళ్ల నిర్మాణం కోసం ఇందిరమ్మ హౌసింగ్ స్కీమ్ మంజూరవుతుందని కలెక్టర్ తెలిపారు. అర్బన్ ఏరియాల్లో స్థలం కలిగినవారు తక్కువగా ఉన్నందున ప్రత్యేక మోడిఫైడ్ హౌసింగ్ స్కీమ్ రూపొందిస్తున్నామని వెల్లడించారు. హైదరాబాద్ నగరానికి సంబంధించి 3,500 ఇళ్ల నిర్మాణానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు కలెక్టర్ అనుదీప్ పేర్కొన్నారు.






# 8 మంది డాక్టర్లు డ్యూటీకి డుమ్మా

- కలెక్టర్‌కు రిపోర్ట్ ఇస్తానన్న సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్
- మిర్యాలగూడ ఏరియా హాస్పిటల్‌ఆకస్మిక తనిఖీ

**మిర్యాలగూడ,,ఫ్లాష్ ఇండియా :** మిర్యాలగూడ ఏరియా హాస్పిటల్‌ను సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎటువంటి పర్మిషన్ లేకుండా 8 మంది డాక్టర్లు డ్యూటీకి డుమ్మా కొట్టినట్లు గుర్తించారు. ఉదయం 11 గంటలకు వచ్చిన ఆయన 45 నిమిషాల పాటు దవాఖానలోనే ఉన్నారు. అన్ని వార్డులకు వెళ్లి, పేషంట్లతో మాట్లాడి, వైద్య సేవలపై ఆరా తీశారు. డ్యూటీకి రాని జనరల్ ఫిజీషియన్లు భానుప్రసాద్, ప్రసూన, పల్మనాలజిస్ట్ రోహిత్, అనస్థీషియా డాక్టర్‌సంతోష్ కుమార్, గైనకాలజిస్ట్ స్పందన, సైక్రియాటిస్ట్ లు విజయ్ కుమార్, వీరజ, ఆప్తమాలజిస్ట్ ప్రజ్ఞారెడ్డిలపై కలెక్టర్ కు రిపోర్ట్ఇస్తానని తెలిపారు. రానున్న రోజుల్లో హాస్పిటల్‌లో బయోమెట్రిక్ సిస్టం అమలు చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## నల్గొండ జిల్లాలో హాకీ వేసవి శిక్షణ శిబిరం

**చిట్యాల,ఫ్లాష్ ఇండియా :** ఉరుమడ్ల తెలంగాణ క్రీడా మైదానంలో హాకీ వేసవి శిక్షణ శిబిరాన్ని నల్గొండ జిల్లా క్రీడలు, యువజన శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించారు. జూన్ 6 వరకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు కోచ్ రాము తెలిపారు. హాజరయ్యేవారికి పట్ల నరసింహ టిఫిన్అందిస్తారని చెప్పారు. చిట్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ కోనేటి యాదగిరి, కాంగ్రెస్ జిల్లా నాయకులు పల్లపు బుద్ధుడు, జరపాల శ్రీను, సోషల్ మీడియా ఇన్‌చార్జి పట్ల జనార్ధన్, ఉపాధ్యాయులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ చాంబర్లో విద్యుత్ ఘాతం

**హిమాయత్ నగర్ ,ఫ్లాష్ ఇండియా :** హిమాయత్ నగర్ లోని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ చైర్మన్ చాంబర్ భవనంలో శుక్రవారం ఉదయం విద్యుత్ షాక్ సర్క్యూట్ సంభవించింది. ఈ ప్రమాదంలో చాంబర్స్ లోని ఫర్నీచర్, సంబంధిత ఫైల్స్, తదితర సామాగ్రి విద్యుత్ షాక్ తో పూర్తిగా దగ్ధమై భారీగా నష్టం జరిగింది. అగ్నిమాపక సిబ్బంది శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ విషయం తెలిసిన వెంటనే హుటాహుటిన మున్సిపల్ ఛాంబర్ రాష్ట్ర చైర్మన్ వెన్ రెడ్డి రాజు భవనాన్ని సందర్శించి జరిగిన పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో చైర్మన్లు సొంతం నిధులతో నిర్మించుకున్న భవనం పురపాలికలో విప్లవాత్మక మార్పునకు వేదిక అయిందన్నారు. సమర్థవంతమైన పాలన అవగాహన చైర్ పర్సన్ల సమస్యలు మెరుగైన పురపాలికకు సంబంధించి అనేక అంశాలకు దిక్సూచిగా నిలవడమే కాకుండా పూర్తిస్థాయిలో పురపాలక సంఘాలు పటిష్టవంతం చేయడంలో పలు సమస్యలు పరిష్కరించడంలో కూడా సమర్థంగా పనిచేసిందని వివరించారు. ఎంతో చారిత్రత్మకమైనటువంటి ఈ ఛాంబర్ లో విద్యుత్ షాక్ సంభవించడం బాదేసిందని, ప్రభుత్వం ఈ భవనానికి సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్, ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోటి రూపాయలను మంజూరు చేసి పూర్తిస్థాయిలో ఆధునీకరించాలని ఆయన కోరారు.



## ఎలక్ట్రికల్ టెక్నీషియన్ ఆత్మహత్య

**పెద్దేముల్ ,ఫ్లాష్ ఇండియా :** సోలార్ పవర్ ప్లాంటులో ఎలక్ట్రికల్ టెక్నీషియన్ ఉరేసుకొని అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన పెద్దేముల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తితే పెద్దేముల్ మండల పరిధిలోని గోపాల్ పూర్ గ్రామానికి చెందిన రాజశేఖర్ రెడ్డి అనే యువకుడు, ఇందూర్ సోలార్ పవర్ ప్లాంట్ లో ఎలక్ట్రిషన్ టెక్నీషియన్ గా వర్క్ చేస్తున్నాడు. కాగా గురువారం రాత్రి నైట్ డ్యూటీ ఉండటంతో యధావిధిగా డ్యూటీకి వచ్చాడు. శుక్రవారం తెల్లారేసరికి సోలార్ పవర్ ప్లాంట్ లో ఉరివేసుకొని వేలాడుతూ కనిపించడం పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఇంటికెళ్లిన రాజస్థాన్ రాయల్స్



ముంబై ఇండియన్స్ జట్టుకు ఐపీఎల్ చరిత్రలో ఓ ప్రత్యేక స్థానముంది. కానీ ఈ సీజన్లో మొదట్లో తడబడిన ముంబై జట్టు, ప్రస్తుతం క్రమంగా పుంజుకుని టాప్ స్థాయికి చేరుకుంది. సూపర్ ఫామ్ లో ఉన్న ముంబై ఇండియన్స్ (MI) మరోసారి తన ఆధిపత్యాన్ని చూపించింది. నిన్న రాజస్థాన్ రాయల్స్ (RR)పై జరిగిన మ్యాచులో 100 పరుగుల భారీ తేడాతో విజయం సాధించి పాయింట్ల పట్టికలో అగ్రస్థానం చేరుకోవడం విశేషం. ఈ క్రమంలో వరుసగా ఆరో విజయం నమోదు చేసింది. ఈ విజయంతో MI 14 పాయింట్లతో టాప్ లో నిలవగా, RR 6 పాయింట్లతో ప్లేఆఫ్ రేస్ నుంచి తప్పుకుంది.

**టాస్ ఓడిన తర్వాత**

టాస్ ఓడి మొదట బ్యాటింగ్ కు దిగిన ముంబై జట్టు అదర గొట్టింది. ర్యాన్ రికెల్టన్ (38 బంతుల్లో 61; 7 ఫోర్లు, 3 సిక్సర్లు), రోహిత్ శర్మ (36 బంతుల్లో 53; 9 ఫోర్లు) మొదటి వికెట్ కి 116 పరుగులు చేశారు. ఆ తరువాత వచ్చిన సూర్యకుమార్ యాదవ్ (48 నాటౌట్, 23 బంతుల్లో; 4 ఫోర్లు, 3 సిక్సర్లు), హార్దిక్ పాండ్యా (48 నాటౌట్, 23 బంతుల్లో; 6 ఫోర్లు, 1 సిక్సర్) కలిసి వేగంగా స్కోరు పెంచారు. ఈ ఇద్దరూ కలిసి 94 పరుగుల భాగస్వామ్యాన్ని నమోదు చేసి స్కోరు బోర్డును 217/2 వరకూ తీసుకెళ్లారు. రాజస్థాన్ బౌలర్లలో మాహీష్ థీక్షణా, కెప్టెన్ రియాన్ పరాగ్ ఒక్కో వికెట్ తీసారు.

**ప్రత్యర్థి జట్టుకు..**

లక్ష్యచేదనలో దిగిన రాజస్థాన్ కు మొదటి నుంచే ఎదురుదెబ్బలు తగిలాయి. MI పేస్ త్రయం జస్ప్రీత్ బుమ్రా, ట్రెంట్ బౌల్ట్, దీపక్ చాహర్ కలిసి పవర్ ప్లేలోనే ప్రత్యర్థిని వణికించారు. దీంతో RR స్కోరు 47/5కి పడిపోయింది. జోఫ్రా ఆర్చర్ (27 బంతుల్లో 30; 2 ఫోర్లు, 2 సిక్సర్లు) కొంత ఆడినప్పటికీ, ఎవరూ నిలదొక్కుకోలేక పోయారు. చివరికి RR 16.1 ఓవర్లలో 117 పరుగులకే కుప్పకూలింది. కర్ణ్ శర్మ (3/23), ట్రెంట్ బౌల్ట్ (3/28), బుమ్రా (2/15) అద్భుతంగా బౌలింగ్ వేసి ప్రత్యర్థి జట్టుకు చుక్కలు చూపించారు. కెప్టెన్ హార్దిక్ కూడా ఒక వికెట్ తీసాడు. బుమ్రా, శర్మ ధాటికి తట్టుకోలేకపోయారు.

**తదుపరి మ్యాచ్ పై దృష్టి**

ముంబై ప్రస్తుతం 7 గెలుపులతో పాయింట్ల పట్టికలో టాప్ లో ఉంది. ఇంకో రెండు మ్యాచులు గెలిస్తే ప్లేఆఫ్ బెర్త్ దాదాపు ఖాయమని చెప్పవచ్చు. ఈ జట్టు గుజరాత్ టైటన్స్ తో మే 6న వాంఖడేలో జరిగే మ్యాచుకు సిద్ధంగా ఉంది.

# ప్రేమలో కొత్త ఇన్నింగ్స్



శిఖర్ ధావన్...ఈ పేరు వినగానే డాషింగ్ బ్యాటింగ్, గబ్బర్ సింగ్ స్టైల్ సెలబ్రేషన్స్ గుర్తొస్తాయి. కానీ ఇప్పుడు అతని పేరు క్రికెట్ కంటే ఎక్కువగా లవ్ స్టోరీ కారణంగా చర్చల్లో నిలిచాడు. ఇటీవల శిఖర్ తన సోషల్ మీడియా ఖాతాలో సోఫీ షైన్ అనే యువతితో ఒక ఫోటోను షేర్ చేశాడు. ఆ ఫోటోకు క్యాప్షన్ గా ఒక సింపుల్ హార్ట్ ఎమోజీని యాడ్ చేశాడు. అంతేకాదు మై లవ్ అని పేర్కొన్నాడు. ఇది చూసిన అభిమానులు విషెస్ తెలియజేస్తున్నారు. ఈ పోస్ట్ తో ఒక్కసారిగా సోషల్ మీడియా హోరెత్తిపోయింది. ఈ క్రమంలో మరికొంత మంది అభిమానులు, నెటిజన్లు ఈ ఫోటో గురించి, సోఫీ షైన్ గురించి వెతకడం మొదలుపెట్టారు.2025 చాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా వైరల్ అయిన ఒక ఫోటోలో శిఖర్ ధావన్ ఒక 'మిస్టరీ ఉమన్'తో కనిపించాడు. ఆ ఫోటో సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. అనేక మీడియా సంస్థలు ఆ మహిళ సోఫీ షైన్ అని, ఆమె ఐర్లాండ్‌కు చెందిన యువతి అని పేర్కొన్నాయి. అయితే, శిఖర్ మాత్రం ఈ విషయంపై క్లారిటీ ఇవ్వలేదు. కానీ ఇటీవల ఓ టీవీ ఇంటర్వ్యూలో మాట్లాడిన క్రమంలో కీలక విషయాలను ప్రస్తావించారు. యాంకర్ శిఖర్ గర్ల్‌ఫ్రెండ్ గురించి అడిగినప్పుడు, మొదట అతను సమాధానం చెప్పడానికి సంకోచించాడు. కానీ తర్వాత నవ్వుతూ ఇలా అన్నాడు. నేను ఎవరి పేరూ చెప్పను. కానీ ఈ రూమ్‌లో అతి అందమైన అమ్మాయి నా గర్ల్‌ఫ్రెండ్ అన్నారు.ఆ క్షణంలో కెమెరా సోఫీ షైన్‌పై ఫోకస్ చేసింది. ఈ సంఘటనతో గాసిప్‌గా మొదలైన వార్త అధికారికంగా నిజమైంది. దీంతో సోషల్ మీడియాలో అభిమానులు ఈ జంటను ఆశీర్వదిస్తూ పొగుడుతూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. సోఫీ షైన్ గురించి ఇంకా పెద్దగా సమాచారం బయటకు రాలేదు. ఆమె ఐర్లాండ్‌కు చెందిన యువతి అని, శిఖర్‌తో ఆమె సన్నిహిత సంబంధం కలిగి ఉందని మాత్రమే తెలుసు. ఈ జంట ఎప్పటి నుంచి డేటింగ్ చేస్తున్నారు. వారి లవ్ స్టోరీ ఎలా మొదలైందనే విషయాలు మాత్రం తెలియాల్సి ఉంది. శిఖర్ ధావన్ స్వయంగా ఐపీఎల్‌లో వరుసగా రెండు సెంచరీలు సాధించిన తొలి ఆటగాడు. ఆయన అనుభవం, ఆటతీరు యువ క్రికెటర్లకు స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పవచ్చు.

## ఇండియాకు మరో నాలుగు స్వర్ణాలు



ఆసియా అండర్-15, 17 చాంపియన్‌షిప్‌లో ఇండియాకు మరో నాలుగు స్వర్ణాలు లభించాయి. గురువారం జరిగిన అండర్-17 ఫైనల్లో ఖుషి చంద్ (46 కేజీ) 3-2తో అల్తాంజుల్ అల్తంగాదాస్ (మంగోలియా)పై, అహాన శర్మ (50 కేజీ), జన్నత్ (54 కేజీ) తమ ప్రత్యర్థులపై 5-0తో నెగ్గారు. 80ం కేజీల్లో అన్షిక ఆర్ఎస్‌సీ ద్వారా జానా అలవ్నే (జోర్డాన్)ను ఓడించి నాలుగో గోల్డ్‌ను అందించింది. బాయ్స్ అండర్-17లో దేవాన్ష (80 కేజీ) 0-5తో ముఖమెదలి రుస్టెంబెక్ (కజకిస్తాన్) చేతిలో ఓడి సిల్వర్‌తో సంతృప్తిపడ్డాడు. దీంతో బాయ్స్ టీమ్ ఒక సిల్వర్, ఆరు బ్రాంజ్ మెడల్స్‌ను సాధించింది. సిమ్రన్‌జిత్ కౌర్ (60 కేజీ), హర్సిక (63 కేజీ)లకు సిల్వర్ మెడల్స్ దక్కాయి. ఓవరాల్‌గా ఈ టోర్నీలో ఇండియా 15 స్వర్ణాలు, 6 రజతాలు, 22 కాంస్యాలతో మూడో స్థానంలో నిలిచింది. కజకిస్తాన్ టాప్‌లో నిలవగా ఉజ్బెకిస్తాన్ మూడో ప్లేస్‌తో సరిపెట్టుకుంది.

## ఆర్ఆర్ యాజమాన్యానికి తలనొప్పిగా



వైభవ్ సూర్యవంశీ ఆర్ఆర్ యాజమాన్యానికి తలనొప్పిగా మారాడా.. ఆ జట్టు రెగ్యులర్ కెప్టెన్ సంజూ శాంసన్ జట్టులోకి ఎంట్రీ ఇస్తే వైభవ్ ని పక్కన పెట్టేస్తారా.. ద్రవిడ్- సంజు శాంసన్ మధ్య విభేదాలను వైభవ్ పెంచుతున్నాడా.. ప్రస్తుతం క్రికెట్ కారిడార్లో వైభవ్ సూర్యవంశీ పేరు బాగా వినిపిస్తుంది. తొలి మ్యాచ్, తొలి బంతికే సిక్సర్ బాది తన పొటెన్షియాలిటీని చూపించాడు. అదే దూకుడును కొనసాగించి హాఫ్ సెంచరీ చేరువలో అవుటయ్యాడు. కానీ తాను ఓ ఐపీఎల్ ప్లేయర్నన్న విషయమే మరిచిపోయి గుక్క పెట్టి ఏడ్చుకుంటూ మైదానం వీడాడు. దాంతో కొందరు వైభవ్ పై విమర్శలు చేశారు. తొలి మ్యాచ్ లోనే ఇంత ఓవరాక్షన్ పనికిరాదంటూ కామెంట్స్ చేశారు. కానీ తన మూడో మ్యాచ్ లో భారీ సెంచరీతో అందరి నోళ్లు మూయించాడు. 17 బంతుల్లో 50, 35 బంతుల్లో సెంచరీ బాది ప్రపంచ క్రికెట్ని ఆకర్షించాడు.అయితే, ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ.. రెగ్యులర్ కెప్టెన్ సంజూ స్థానంలో ఆడుతున్నాడు. సంజు గాయం కారణంగా జట్టుకు దూరమవడంతో వైభవ్ కి తుది జట్టులో అవకాశం వచ్చింది. అయితే, సంజూ తిరిగి జట్టులోకి వస్తే వైభవ్ ని తప్పిస్తారా లేక సంజుకి ఇంకొన్నాళ్ళు విశ్రాంతి కల్పిస్తారా చూడాలి. ఈ విషయంలో హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ వైభవ్ వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తుంది. తాజాగా సంజూ గాయంపై మాట్లాడిన ద్రవిడ్ సంజుకి మరి కొంతకాలం రెస్ట్ అవసరమని చెప్పుకొచ్చాడు. గాయం నయమవుతుందని, అయితే యాజమాన్యం సంజూ విషయంలో తొందరపడాలనుకోవట్లేదని పేర్కొన్నాడు. తొందర పడి జట్టులోకి తీసుకుని, సమస్యని మరింత పెంచాలనుకోవట్లేదన్నాడు.మరోవైపు వైభవ్ పై కూడా ఎక్కువ దృష్టి పెట్టాలనుకోవట్లేదని రాజస్థాన్ రాయల్స్ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ తెలిపారు. కానీ అతని టాలెంట్ ను ఎవరూ ఆపలేరని ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ద్రవిడ్ చేసిన ఈ వ్యాఖ్యలను గమనిస్తే.. సంజూ ఇంకొంత కాలం విశ్రాంతి మోడ్ లోనే ఉండొచ్చని తెలుస్తుంది. కాగా, వైభవ్ కోసమే సంజుని పక్కన పెడుతున్నారని కొందరు అభిప్రాయ పడుతున్నారు.

## ప్రజ్ఞానందకు మూడో స్థానం



ఇండియా గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద (20.5 పాయింట్లు).. సూపర్‌బెట్ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీలో మూడో ప్లేస్‌లో నిలిచాడు. గురువారం జరిగిన ఫైనల్ రౌండ్‌లో ప్రజ్ఞా తొలి ఐదు గేమ్‌ల్లో ఒక్క పాయింట్ మాత్రమే సాధించాడు. కానీ సెకండాఫ్‌లో ఇండియన్ మాస్టర్ వరుసగా డుడా, తపలోవ్, అరవింద్, గావ్రిలెస్కులను ఓడించాడు. దీంతో తొమ్మిది గేమ్‌ల్లో ఐదు పాయింట్లను సాధించడంతో మూడో ప్లేస్ ఖాయమైంది. వ్లాదిమిర్ ఫెడోసీవ్ (స్లోవేనియా) 26.5 పాయింట్లతో టైటిల్‌ను గెలుచుకోగా, మ్యాక్సీమ్ వాచిర్ లాగ్రేవ్ (ఫ్రాన్స్) 21.5 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచాడు. ఇండియాకు చెందిన అరవింద్ చిదంబరం 17 పాయింట్లతో ఎనిమిదో స్థానంతో సరిపెట్టుకున్నాడు. ఈ నెల 7 నుంచి మొదలయ్యే క్లాసికల్ ఈవెంట్‌లో ప్రజ్ఞానందతో పాటు గుకేశ్ బరిలోకి దిగనున్నాడు. అమెరికన్ ద్వయం కరువానా, వెస్లీ సో, నోడిర్బెక్ అబ్దుసత్తారోవ్ (ఉజ్బెకిస్తాన్) పోటీలో ఉన్నారు. రొమేనియా రాజధాని బుకారెస్ట్‌లో ఈ టోర్నీ జరగనుంది.

## పదేళ్ల ఐపీఎల్ రికార్డ్ బ్రేక్



ఐపీఎల్ 2025లో సూర్యకుమార్ యాదవ్ (Suryakumar Yadav) తాజాగా సరికొత్త రికార్డ్ సృష్టించాడు. ముంబై ఇండియన్స్ తరఫున ఆడుతున్న సూర్యకుమార్ వరుసగా 11 ఇన్నింగ్స్ లలో 25 కంటే ఎక్కువ పరుగులు చేసి అరుదైన ఘనతను దక్కించుకున్నాడు. అంతకుముందు ఈ రికార్డు 2014లో కోల్ కతా నైట్ రైడర్స్ తరఫున అడిన రాబిన్ ఉతప్ప పేరిట ఉండేది. అతను 10 ఇన్నింగ్స్ లలో ఈ ఘనత సాధించాడు. ఈ క్రమంలో తాజాగా సూర్యకుమార్ యాదవ్ సాయి సుదర్శన్ ను వెనక్కినెట్టి ఆరెంజ్ క్యాప్ రేసులో అగ్రస్థానానికి చేరుకున్నాడు.

**మొదట రోహిత్ శర్మతో**

జైపూర్ లో రాజస్థాన్ రాయల్స్ తో జరిగిన మ్యాచ్ లో, ర్యాన్ రికెల్టన్ ఔట్ అయిన తర్వాత సూర్యకుమార్ క్రీజులోకి వచ్చి మొదట రోహిత్ శర్మతో, ఆ తర్వాత హార్దిక్ పాండ్యాతో కలిసి 23 బంతుల్లో 48 పరుగులు చేశాడు. ఈ మ్యాచ్ లో సూర్యకుమార్ అర్ధ సెంచరీని కోల్పోయినప్పటికీ, మరోసారి అద్భుతంగా బ్యాటింగ్ చేయడం ద్వారా తన జట్టును 200 దాటించడంలో కీలక పాత్ర పోషించాడు. IPL 2025లో సూర్యకుమార్ యాదవ్ ఇప్పటివరకు ఆడిన 11 మ్యాచ్ లలో 29, 48, 27*, 67, 28, 40, 26, 68*, 40*, 54, 48* పరుగులు చేశాడు. అతని అద్భుతమైన నిలకడ కారణంగానే లీగ్ దశలో 50 మ్యాచ్ లు పూర్తి చేసిన తర్వాత ఆరెంజ్ క్యాపులో టాప్ కి చేరాడు.

**ఐపీఎల్ లో వరుసగా అత్యధికంగా 25+ పరుగులు చేసిన ఆటగాళ్లు**

11 ఇన్నింగ్స్ లు – సూర్యకుమార్ యాదవ్ (2025)*

10 ఇన్నింగ్స్ లు – రాబిన్ ఉతప్ప (2014)

9 ఇన్నింగ్స్ లు – విరాట్ కోహ్లీ (2024–25)

9 ఇన్నింగ్స్ లు – స్టీవ్ స్మిత్ (2016–17)

9 ఇన్నింగ్స్ లు – సాయి సుదర్శన్ (2023–24)

**మరిన్ని రికార్డులు**

ఈ సీజన్ లో సూర్య 67.85 సగటుతో 172.72 ఫాస్ట్ స్ట్రైక్ రేట్ తో 475 పరుగులు చేశాడు. ఈ సమయంలో అతను 46 ఫోర్లు, 26 సిక్సర్లు కొట్టాడు. ఇదే ప్రదర్శన కొనసాగిస్తే, ఈ సీజన్ చివరి నాటికి అతను మరిన్ని రికార్డులు క్రియేట్ చేసే ఛాన్సుంది. దీంతోపాటు ముంబై ఇండియన్స్ టైటిల్ పోరులో నిలిచే అవకాశం ఉంది.

**IPL 2025 ఆరెంజ్ క్యాప్ లీడర్ బోర్డ్**

సూర్యకుమార్ యాదవ్- 475 పరుగులు
సాయి సుదర్శన్- 456 పరుగులు
విరాట్ కోహ్లీ- 443 పరుగులు
యశస్వి జైస్వాల్- 439 పరుగులు
జోస్ బట్లర్- 406 పరుగులు



# చూసుకోవాలి కదా శ్రేయాస్

ఎట్టకేలకు పంజాబ్ కింగ్స్ గట్టెక్కింది. యుజ్వేంద్ర చహల్ 4 వికెట్లు, కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్ 72 పరుగులతో రాణించడంతో పంజాబ్ మరో రెండు బంతులు మిగిలి ఉండగానే చెన్నైని ఓడించింది. ఈ విజయంతో పంజాబ్ ప్లేఆఫ్స్ ఆశలను సజీవం చేసుకుంది. అటు చెన్నై సూపర్ కింగ్స్ టోర్నీ నుంచి నిష్క్రమించింది. అయితే కెప్టెన్ గా, ఆటగాడిగా సక్సెస్ అయినప్పటికీ.. శ్రేయాస్ పై బీసీసీఐ చర్యలు తీసుకుంది. స్లో ఓవర్ రేట్ కారణంగా ఇప్పటికే పంత్, గిల్ భారీగా నష్టపోయారు. తాజాగా స్లో ఓవర్ రేట్ కారణంగా బీసీసీఐ శ్రేయాస్ కు రూ.12 లక్షల రూపాయల ఫైన్ విధించింది.ఐపీఎల్ 2025లో పంజాబ్ కింగ్స్ తొలిసారి స్లో ఓవర్ రేట్ నమోదు చేయడంతో రూ.12 లక్షలతో బీసీసీఐ సరిపెట్టింది. రెండోసారి ఇదే రిపీట్ అయితే రూ.24 లక్షల ఫైన్ పడుతుంది. ఐపీఎల్ నియమం 2.2 ప్రకారం నిర్ణీత సమయంలో ఓవర్లు పూర్తి చేయకపోతే కెప్టెన్ కు జరిమానా పడుతుంది. కాగా పంజాబ్ తమ తదుపరి మ్యాచ్ లో లక్నో సూపర్ జెయింట్స్ తో తలపడనుంది. పంజాబ్ పై ఓడిన చెన్నై నెక్స్ట్ ఆర్సీబీతో తలపడుతుంది. ఈ సీజన్లో చెన్నై 10 మ్యాచుల్లో కేవలం రెండు మాత్రమే గెలిచింది. పటిష్ట టీమ్ లేకపోవడంతో ఈ సీజన్ ధోనీ సేనకు ఏ మాత్రం కలిసి రాలేదు.గతేడాది కేకేఆర్ ని ఛాంపియన్ గా నిలబెట్టినప్పటికీ ఆ జట్టు యాజమాన్యం ఐపీఎల్ 2025 మెగా వేలంలో శ్రేయాస్ అయ్యర్ ని విడుదల చేసింది. దీంతో శ్రేయాస్ ను బాలీవుడ్ సీనియర్ నటి ప్రీతి జింతా రూ.26 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేశారు. శ్రేయాస్ వేలంలోకి రాగానే అతడిని కొనుగోలు చేయడానికి ప్రీతి ప్రణాళికలు రచించారు. వేలంలో మిగతా జట్లతో పోటీపడి మరీ కోట్లు కుమ్మరించారు. ప్రీతి సహా పంజాబ్ యాజమాన్యం తనపై పెట్టుకున్న నమ్మకాన్ని శ్రేయాస్ నిలబెట్టుకున్నాడు. 10 మ్యాచుల్లో నాలుగు అర్ధ సెంచరీలతో 360 పరుగులు చేశాడు. అంతేకాదు జట్టును తనదైన శైలిలో ముందుకు నడిపిస్తున్నాడు. ఇప్పుడు పంజాబ్ 13 పాయింట్లతో ప్లేఆఫ్స్ చేరువైంది. మిగిలిన నాలుగు మ్యాచులో రెండు గెలిస్తే అధికారిక బెర్త్ దక్కుతుంది. ప్లేఆఫ్స్ లో ఇంకాస్త దూకుడుగా ఆడితే పంజాబ్ టైటిల్ కొట్టడం ఖాయంగా కనిపిస్తోంది.

# ఫస్ట్ సింగిల్ రిలీజ్ డేట్ ఫిక్స్




మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' ఫేమ్ మహేష్ బాబు. పి దర్శకత్వంలో ఉస్తాద్ రామ్ పోతినేని హీరోగా ఓ సినిమా తెరకెక్కుతోంది. అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఫీల్ గుడ్ అండ్ క్రేజీ ఎంటర్ టైనర్ ఈసినిమాను ప్రొడ్యూస్ చేస్తోంది. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మాతలగా వ్యవహరిస్తున్నారు. హీరోగా రామ్ 22వ సినిమా ఇది. రామ్ సరసన అందాల భామ భాగ్యశ్రీ బోర్స్ హీరోయిన్ గా నటిస్తుంది. ఈ సినిమాలో సాగర్ పాత్రలో రామ్ నటిస్తున్నారు.ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. కాగా ఈ సినిమాలో రామ్ ఈ సినిమాలో ఓ ప్రేమ గీతాన్నిస్వయంగా రాసాడనే సంగతి తెలిసిందే. ఆ పాట చాలా అద్భుతంగా వచ్చిందని సమాచారం. ఇప్పుడు ఈ సాంగ్ ను రిలీజ్ చేసేందుకు డేట్ ఫిక్స్ చేశారు మేకర్స్. ఈ నెల 15న రామ్ పుట్టిన రోజు సందర్భంగా ఫస్ట్ సింగిల్ ను రిలీజ్ చేయనున్నారు. రొమాంటిక్ ప్రేమ కావ్యంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకు తమిళ్ మ్యూజిక్ ద్వయం వివేక్ – మెర్విన్ సంగీతం అందిస్తున్నారు. గతంలోను రామ్ నటుడిగానే కాకుండా కొరియోగ్రాఫర్ గాను ఫైట్స్ కంపొజిషన్ లోను తన ప్రతిమను నిరూపించుకున్నాడు. మరి ఇప్పుడు పాటల రచయితగ మారిన రామ్ రచించిన సాంగ్ ఎలా ఉండబోతుందని Rapo ఫ్యాన్స్ ఈగర్ గా ఎదురు చూస్తున్నారు. శరవేగంగా షూటింగ్ జరుగుతున్న ఈ సినిమాను ఈ ఏడాది దీపావళి కానుకగా రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారట మేకర్స్.



# ఇప్పటికి బాధపడుతున్న..

తమిళ స్టార్ హీరో సూర్య కి ఎలాంటి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉందో చెప్పక్కర్లేదు. ఒక తమిళ్ లో మాత్రమే కాదు తెలుగులో కూడా సూర్య సినిమాలకు మంచి డిమాండ్ ఉంది. చివరిగా 'కంగువా' చిత్రంతో రాగా కమర్షియల్ గా ఫెయిల్ అయ్యింది. ఫ్యాన్స్, ఆడియెన్స్ కు కూడా అంతగా ఆకట్టుకోలేకపోయింది. ఇక తాజాగా 'రెట్రో' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు సూర్య. మే1న ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేశారు. మొదటి షోల్లో పాజిటివ్ టాక్ ను సొంతం చేసుకుంది. దీంతో సినిమా కలెక్షన్ల పై ఆసక్తి నెలకొంది. అయితే, సూర్య 'రెట్రో' కోసం మునుపెన్నడూ లేని విధంగా జోరుగా ప్రమోషన్స్ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో తన కెరీయర్ లో ఒక రూల్ ను బ్రేక్ చేశానని చెప్పుకొచ్చారు..'నా సినీ కెరీర్ లో ఎప్పుడు కూడా సినిమాల ద్వారా స్మోకింగ్, డ్రింకింగ్ హ్యాబిట్ ను అదే పనిగా చూపించలేదు. సీన్ కోసం తప్పితే. కానీ 'విక్రమ్' సినిమాలోని రోలెక్స్ పాత్రతో అది బ్రేక్ చేశా . అది కూడా అనుకోకుండా జరిగిపోయింది. ఇప్పటికి బాధ పడుతున్నా. ఆ పాత్ర చాలా క్రూరమైన, చెడ్డ వాడికి సంబంధించిందనే విషయం మాత్రమే నాకు తెలుసు. కానీ షూటింగ్ కు వెళ్లిన తర్వాత స్క్రిప్ట్ ఇచ్చారు, కేవలం హాఫ్ డే షూటింగ్ మాత్రమే చేశాను. అంతలోనే విధ్వంసం చూపించారు. ఇక కమల్ హాసన్ మూవీ కనుక కాదు అనలేక నా నియమాన్ని బ్రేక్ చేశా. ఇక 'రెట్రో' చిత్రంలోనూ స్మోకింగ్ చేస్తూ కనిపిస్తాను. ఎవరూ ఇలాంటి వ్యసనాలకు అలవాటు కావొద్దని ముందుగానే సూచించారు.' అంటూ చెప్పుకొచ్చాడు.


# మరేమీ కనిపించలేదు




యంగ్ బ్యూటీ అనన్య నాగళ్ల మనందరికీ సుపరిచితమే. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన 'వకీల్ సాబ్' సినిమాతో ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఈ భామకు ఫస్ట్ మూవీనే మంచి ఫేమ్ తెచ్చిపెట్టింది. దీంతో వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. అలా వచ్చిన అవకాశాలన్నింటిలో నటిస్తూ మెప్పిస్తుంది. అంతేకాకుండా హీరోయిన్ గా కూడా రాణిస్తోంది. అలా గత ఏడాది 'తంత్ర', 'పొట్టేల్', 'శ్రీకాకుళం షెర్లాక్ హోల్మ్స్', 'డార్లింగ్' వంటి సినిమాల్లో నటించి అలరించింది. ప్రస్తుతం ఒకటి రెండు ప్రాజెక్టులతో బిజీ బిజీగా గడుపుతోంది.అలాగే నిత్యం సోషల్ మీడియాలో ఫుల్ యాక్టీవ్ గా ఉంటూ తన అంద చందాలతో అదరహో అనిపిస్తుంది. అంతేకాకుండా తన పర్సనల్ లైఫ్ విషయాలను, సినిమాలకు సంబంధించిన విషయాలను పంచుకుంటూ అభిమానులకు దగ్గరవుతూ ఉంటుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా అనన్య నాగళ్ల ఇన్ స్టాగ్రామ్ వేదికగా ఓ పోస్ట్ పెట్టింది. అందులో ఫారెస్ట్ లో తిరుగుతూ.. 'జీప్ సఫారీ కానీ నెమళ్ళు, జింకలు తప్ప మరేమీ కనిపించలేదు' అని రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ కాస్త నెట్టింట వైరల్ గా మారగా..దీన్ని చూసిన నెటిజన్లు ఫ్రంట్ ఓకే కానీ బ్యాక్ సరిగ్గా చూపించలేవు అని కామెంట్స్ చేస్తున్నారు.

# కళ్లు బయర్లు కమ్మాల్సిందే

నేచురల్ స్టార్ నాని హీరోగా నటించిన సినిమా హిట్ 3. యంగ్ డైరెక్టర్ శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా మే డే కానుకగా 1వ తేదీన వరల్డ్ వైడ్ గా రిలీజ్ అయింది. టీజర్, ట్రైలర్ తో భారీ హైప్ తెచ్చుకున్న ఈ సినిమా భారీ ఎత్తున రిలీజ్ అయింది. తమిళ్ స్టార్ హీరో సూర్య సినిమా రెట్రోతో పోటీని ఎదుర్కున్న హిట్ 3 తోలి ఆట నుండే హిట్ టాక్ అందుకుంది. హింసపాళ్ళు కాస్త ఎక్కువయ్యాయని కంప్లైంట్ ఉన్నకలెక్షన్స్ పై ఏ మాత్రం ప్రభావం చూపలేదు.అడ్వాన్స్ బుకింగ్స్ లో జోరు చూపించిన హిట్ 3 మొదటి రోజు అంతే జోష్ చూపించింది. హిట్ 3 మొదటి రోజు వరల్డ్ వైడ్ గా రూ. 43 కోట్లు రాబట్టినట్టు అధికారకంగా ప్రకటించారు. ఈవిషయాన్ని అధికారకంగా ప్రకటిస్తూ పోస్టర్ రిలీజ్ చేసారు. నాని కెరీర్ లోనే బిగ్గెస్ట్ ఓపెనింగ్ అందుకున్న సినిమాగా హిట్ 3 సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఈ రికార్డ్ తో పాటు మరో రికార్డ్ ను కూడా సొంతం చేసుకున్నాడు నేచురల్ స్టార్. ప్రస్తుతం ఉన్న టైర్ 2 హీరోలలో డే 1 అత్యధిక కలెక్షన్స్ రాబట్టిన సినిమాగా నిలిచింది. రేపు, ఎల్లుండి లాంగ్ వీకెండ్ ఉండడం హిట్ 3 కి కలిసొచ్చే అంశం. ఈ వీకెండ్ నాటికి ఈ సినిమా వంద కోట్ల క్లబ్ క్లబ్ లో చేరుతుందని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు. అటు ఓవర్సీస్ లోను హిట్ 3 భారీ వసూళ్ల దిశగా సాగుతోంది.




# చాలా 'కాస్ట్లీ' గురూ



ఏదో ఒక హాట్ టాపిక్ తో రెగ్యులర్ గా వార్తల్లో నిలుస్తూనే ఉంటుంది నయనతార. ధనుష్ తో వివాదం, ఎప్పుడూ లేని విధంగా రూల్స్ బ్రేక్ చేసుకుని మూకుత్తి అమ్మన్ 2 ఓపెనింగ్ డేకు హాజరు కావడం వంటి విషయాలు లేడీ సూపర్ స్టార్ ను ట్రెండింగ్ లో నిలబెట్టాయి. ఇప్పుడు రెమ్యునరేషన్ విషయంలో మరోసారి మేడమ్ పేరు సినీ సర్కిల్స్ లో చక్కర్లు కొడుతున్నాయి. ఓ టాలీవుడ్ ప్రాజెక్ట్ కోసం ఆమెను అప్రోచ్ అయితే భారీగా డిమాండ్ చేసిందన్న బజ్ గట్టిగానే వినిపిస్తోంది.సౌత్ ఇండస్ట్రీలో హయ్యెస్ట్ రెమ్యునరేషన్ తీసుకునే హీరోయిన్లలో నయనతార ఒకరు. జవాన్ ముందు వరకు ఆమె సుమారు రూ. 4 కోట్ల నుండి రూ. 6 కోట్లు డిమాండ్ చేసేది. కానీ ఎప్పుడైతే బాలీవుడ్ వెళ్లిందో అప్పటి నుండి రెమ్యునరేషన్ ఛేంజ్ చేసింది. జవాన్ కోసం ఆమెకు రూ. 10 కోట్లు ఇచ్చాడట అట్లీ. నార్త్ లో అంత ఇస్తున్నారు కదా ఇక్కడ ఎందుకు ఇవ్వరు అనుకున్న నయన్ సౌత్ లో కూడా అంతే ఇవ్వాలని డిమాండ్ చేయడం స్టార్ట్ చేసింది. ముఖ్యంగా పాన్ ఇండియా చిత్రాలకు వేరే లెవల్లో చార్జ్ చేస్తోంది ఈ బ్యూటీ. టాక్సిక్, మూకుత్తి అమ్మన్ 2 కోసం ఏకంగా రూ. 12 కోట్లను తీసుకుంటుందట నయన్. ఇక చిరంజీవి- అనిల్ రావిపూడి కాంబోలో వస్తున్న మూవీ కోసం నయన్ ను అడిగితే ఏకంగా రూ. 18కోట్లు డిమాండ్ చేసిందట లేడీ సూపర్ స్టార్. దీంతో ఖంగుతిన్న టీం మరో ఆప్షన్ కోసం చూస్తున్నట్లు టీఎఫ్ఐలో వార్త చక్కర్లు కొడుతుంది. డిమాండ్ కు తగ్గట్టే రెమ్యునరేషన్ పెంచుతున్న నయన్ లేడి సూపర్ స్టార్ అనిపించుకుంది.

# స్పిరిట్ పై వస్తున్న ఆ వార్తలన్నీ ఫేక్..!

ప్రభాస్ నటించబోయే సినిమాలలో సందీప్ రెడ్డి వంగాతో చేయబోయే స్పిరిట్ కోసం ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు అభిమానులు. ఇప్పటికే దర్శకుడు సందీప్ రెడ్డి వంగ ప్రీ ప్రొడక్షన్ వర్క్ తో బిజీగా ఉన్నాడు. ప్రస్తుతం కొత్త నటీ నటులను ఫైనల్ చేసే పనిలో ఉన్నాడు. మరోవైపు ప్రభాస్ ఫౌజీ. రాజాసాబ్ షూటింగ్స్ పూర్తి చేసేలా జెట్ స్పీడ్ లో ఉన్నాడు. వీలైనంత త్వరగా స్పిరిట్ ను సెట్స్ పైకి తీసుకెళ్లేలా ప్లాన్ చేస్తున్నాడు వంగా .ఈ సినిమాలో ఫస్ట్ టైం పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ గా కనిపించబోతున్నాడు ప్రభాస్.కానీ ఇప్పుడు ఈ సినిమాపై రకరకలా ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ప్రభాస్ ముందుగా రాజాసాబ్, ఫౌజీ సినిమాలను ఫినిష్ చేసి ఆ తర్వాత ప్రశాంత్ వర్మ సినిమా స్టార్ట్ చేస్తాడని ఆ వెంటనే నాగ్ అశ్విన్ డైరెక్షన్ లో కల్కి 2 చేసి లైన్ లోనే సలార్ 2 ను కూడా చేసేలా ప్లానింగ్ జరుగుతోందట. ఇవన్నీ ఫినిష్ అయ్యాకే సందీప్ రెడ్డి వంగతో స్పిరిట్ ఉంటుందని టాక్ నడుస్తోంది. అయితే ఇవన్నీ ఫేక్ అని విశ్వసనీయ సమాచారం. సందీప్ రెడ్డి వంగా మరే ఇతర సినిమాలు చెయట్లేదు. ఇటీవల ఆయన కథ చెప్పడానికి రెండుసార్లు చెన్నైకి వెళ్లి విజయ్ సేతుపతితో చర్చించారు. ప్రస్తుతం సేతుపతి గ్రీన్ సిగ్నల్ కోసం సందీప్ ఎదురు చూస్తున్నారు. అలాగే ఈ సినిమాకు సంబంధించి మ్యూజిక్ సిట్టింగ్ చాలా కాలం క్రితం ప్రారంభమయ్యాయి. మరోవైపు లొకేషన్స్ వేటకూడా కొనసాగిస్తున్నాడు సందీప్. అందులో భాగాంగానే 4 స్థానాలను ఖరారు చేశారని కూడా తెలిపారు.






'నన్ను దోచుకుందువటే' సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన యంగ్ బ్యూటీ నభా నటేష్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. తన అందం అభినయంతో తెలుగు ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు సంపాదించుకున్నది. దీంతో వరుస ఆఫర్లు క్యూ కట్టాయి. అలా ఎన్నో సినిమాల్లో నటించి మెప్పించింది. ఇక లవర్ బాయ్ రామ్ పోతినేని నటించిన 'ఇస్మార్ట్ శంకర్' మూవీతో ఫుల్ క్రేజ్ తెచ్చుకుంది. ప్రస్తుతం నిఖిల్

# కాంక్రీట్ అడవిలో రాధ

సరసన 'స్వయంభు' మూవీలో నటిస్తోంది.అలాగే సోషల్ మీడియాలో ఫుల్ యాక్టీవ్ గా ఉంటూ తన అందచందాలతో మెస్మరైజ్ చేస్తుంది. ఈ క్రమంలో ఈ భామ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది. తాజాగా నభా నటేష్ తన ఇన్ స్టాగ్రామ్ వేదికగా కొన్ని ఫొటోలు షేర్ చేసింది. అందులో రెడ్ కలర్ బ్లౌజ్ అండ్ ఓణీతో పాటు మెరూన్ కలర్ లంగా వేసుకుంది. ఇక సేమ్ టు సేమ్ రాధలా రెడీ అయింది. ఇక ఈ సూపర్ క్యూట్ ఫొటోస్ ను షేర్ చేస్తూ.. 'కాంక్రీట్ అడవిలో ఉన్న రాధ - గందర గోళంలో దయను మరియు హడావిడిలో లయను కనుగొంటుంది' అని రాసుకొచ్చింది. దీంతో ఈ పోస్ట్ కాస్తా నెట్టింట వైరల్ గా మారింది. ఇక వాటిని చూసిన నెటిజన్లు నీ కృష్ణుడ్ని ఎప్పుడు పరిచయం చేస్తావంటూ కామెంట్స్ చేస్తున్నారు.

# 'క' చిత్రాన్ని వరించిన ప్రతిష్టాత్మక అవార్డు

టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన 'క' చిత్రం అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. ఢిల్లీ వేదికగా ఓ ప్రైవేట్ సంస్థ నిర్వహించిన 'దాదా సాహెబ్ ఫాల్కే ఫిల్మ్ ఫెస్టివల్ లో ఉత్తమ చిత్రంగా అవార్డును సొంతం చేసుకుంది. ఓ తెలుగు చిత్రాన్ని ఇంతటి ప్రతిష్టాత్మక అవార్డు వరించటంతో అభిమానులు సోషల్ మీడియా వేదికగా చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలుపుతున్నారు.కాగా, పీరియాడికల్ సస్పెన్స్ థ్రిల్లర్ గా కొత్త దర్శకుడు సుజిత్, సందీప్ సంయుక్తంగా ఈ సినిమాను రూపొందించారు. డాల్బీ విజన్ 4కే, అట్మాస్ టెక్నాలజీ ఉపయోగించి ఈ మూవీని తెరకెక్కించారు. ఇందులో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించారు. గతేడాది విడుదలైన ఈ చిత్రం సూపర్ హిట్ టాక్ ను సొంతం చేసుకుంది. అంతేకాదు, కిరణ్ అబ్బవరం కెరీర్ లోనే బిగ్గెస్ట్ హిట్ సినిమాగా నిలిచింది. రూ.50 కోట్లకు పైగా కలెక్షన్లను సాధించింది. ఇక ఈ చిత్రానికి సెకండ్ పార్టు కూడా ఉంటుందని మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. పార్ట్ 1 విజయం సాధించడంతో పార్ట్ 2పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ప్రస్తుతం ఈ సినిమా ఓటీటీ ప్లాట్ ఫామ్ అమెజాన్ ప్రైంలో అందుబాటులో ఉంది.




Edited, Printed, Published & Owned by KOMARAJU SRINIVASULU and Printed at Ramu Graphics, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229